
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 299

గురువారం 13-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




భారత బౌలర్ల జోరు

తొలి ఇన్నింగ్స్‌లో తడబడిన వెస్టిండీస్.. అశ్విన్‌కు నాలుగు వికెట్లు - 12లో



విప్రో ఉద్యోగులకు ఏఐలో శిక్షణ

సిబ్బందికి ఏఐలో శిక్షణనిచ్చేందుకు రూ. 8,200 కోట్లు వెచ్చించనుంది -13లో



యమున ఉధృతి

యమునా నది నీటిమట్టం రికార్డు స్థాయిలో 207.71 మీటర్లకు చేరింది. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వివరాలు 6లో ▸



ఉ.కొరియా క్షిపణి కవ్వింపులు

అమెరికా, దక్షిణ కొరియాలను బెదిరిస్తూ ఉత్తర కొరియా మరోసారి ఖండాంతర క్షిపణిని పరీక్షించింది.

వివరాలు 6లో ▸



తైవాన్ దిశగా యుద్ధ విమానాలు

చైనా పెద్ద సంఖ్యలో నౌకలు, యుద్ధ విమానాలను తైవాన్ దిశగా పంపించింది. చైనా తీరుపై తైవాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸



రష్యా లెఫ్టినెంట్ జనరల్ మృతి

ఉక్రెయిన్ సేనలు స్టార్మ్ షాడో క్షిపణితో చేసిన దాడిలో రష్యా లెఫ్టినెంట్ జనరల్ ఒలెగ్ యూరివిజ్ త్సొకోవ్ మరణించారు.

వివరాలు 6లో ▸

54 వేల ఎకరాల భూ పంపిణీ

రైతులుగా మారనున్న 46,935 మంది భూమి లేని నిరుపేదలు

అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పన

- భూమి కేటాయించి 20 ఏళ్లు పూర్తయిన వారికి అమ్ముకునే హక్కు.. దాదాపు 22 లక్షల మంది దళిత, బడుగు, బలహీన వర్గాలకు లబ్ధి
- 9 వేల ఎకరాలకు పైగా లంక భూములకు డీ పట్టాలు
- 1.68 లక్షల ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములకు 22ఏ నుంచి విముక్తి.. 1,966 రెవెన్యూ గ్రామాల్లో ఎస్సీల కోసం శ్మశాన వాటికలకు భూమి కేటాయింపు
- ఈ నెలలో నేతన్న నేస్తం, విదేశీ విద్యా దీవెన
- సీఆర్డీయే పరిధిలో ఇళ్ల నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్
- దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు నో రిటైర్మెంట్
- దేవదాయ శాఖ ఉద్యోగులకు 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయసు పెంపు.. మార్కాపురం, మదనపల్లిలో వైద్య కళాశాలల ఏర్పాటుకు 1,412 పోస్టుల సృష్టి
- గండికోట పునరావాసం కోసం రూ.454.6 కోట్లు కేటాయింపు.. పోలవరం పునరావాస పనులకు ప్రత్యేకంగా ఇంజినీరింగ్ విభాగం
- సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం
- వివరాలు వెల్లడించిన మంత్రి చెల్లుబోయిన





సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిరుపేదలు, అసైన్డ్, సర్వీస్ ఇనామ్, లంక భూముల రైతులకు భారీ మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. తద్వారా భూములకు సంబంధించి గతంలో ఏ ప్రభుత్వం చేయనంత మేలు రైతులకు చేకూరనుంది. ఈ నిర్ణయాలకు సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం తాత్కాలిక సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దివంగత సీఎం వైఎస్సార్ తర్వాత మళ్లీ భూ పంపిణీకి సీఎం జగన్ సర్కార్ సిద్ధమైంది. 54,129.45 ఎకరాలను భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులను కల్పించేందుకు ఆమోదం తెలిపింది. భూమిని ప్రభుత్వం కేటాయించి (అసైన్ చేసి) 20 ఏళ్లు పూర్తయిన అనంతరం ఆ భూమిపై సంబంధిత రైతులు, వారి వారసులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీంతో

మిగతా 2వ పేజీలో ▶

12వ పీఆర్సీ ఏర్పాటు

కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ మన్మోహన్‌సింగ్

ఏడాదిలో నివేదిక ఇవ్వాలని ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 12వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంలో పలు కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగులు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ సంస్థలు, వర్సిటీల్లో పనిచేసే నాన్-టీచింగ్ ఉద్యోగులు, వర్క్‌చార్జ్‌డ్, ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగుల జీతాల స్ట్రక్చర్‌లో చేయాల్సిన మార్పులపై నివేదిక ఇవ్వాలని కమిషన్‌కు సూచించారు. అలాగే, 12వ పీఆర్సీ కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను ప్రభుత్వం నియమించింది. ఉద్యోగులకు సంబంధించిన అన్ని అంశాలపై కమిషన్ సిఫారసులు చేయవచ్చని ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని అందుకనుగుణంగా కమిటీ సిఫారసులు చేయాలని సూచించారు. కమిషన్ సాధారణంగా వెలగపూడి సచివాలయం నుంచి పనిచేయాలని అవసరాన్ని బట్టి ఏపీలోని పలు ప్రాంతాలు, బయట ప్రాంతాల్లోనూ పర్యటించవచ్చని పేర్కొన్నారు. కమిషనర్ బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

కాలుష్య రహిత భారతావనే లక్ష్యం



కాలుష్య రహిత భారతావని నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. తిరుపతి జిల్లా కొత్తపాలెం పరిధిలోని జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటారు.

వివరాలు 5లో ▸

వలంటీర్ వ్యవస్థకు అధిపతి ఎవరు?



ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. రామోజీ, చంద్రబాబు డైరెక్షన్‌లో మళ్లీ చెలరేగిపోయారు. వలంటీర్లు మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

వివరాలు 3లో ▸

గిరిజన విద్యార్థి మృతికి కారకులను వదిలిపెట్టం



గిరిజన విద్యార్థి గోగుల అఖిల్‌వర్ధన్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. బాలుడి తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

వివరాలు 14లో ▸

నేటి నుంచి ప్రధాని ఫ్రాన్స్ పర్యటన



ప్రధాని మోదీ నేటి నుంచి 2 రోజులపాటు ఫ్రాన్స్‌లో పర్యటించనున్నారు. సాంస్కృతిక, శాస్త్రీయ, విద్య, ఆర్థిక, రక్షణ రంగాల్లో పరస్పర భాగస్వామ్యంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో చర్చించనున్నారు. అధునాతన యుద్ధవిమానాలు, ఆయుధాల కొనుగోళ్లపై ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది.

వివరాలు 6లో ▸

నల్ల'మార్గ'ం ఉక్కిరిబిక్కిరి!

మార్గదర్శిలో రూ.కోటి దాటి డిపాజిట్ చేసినవారు వేలల్లో

- జాతీయ బ్యాంకుల్లో కాకుండా తక్కువ వడ్డీ ఇచ్చే చిట్‌ఫండ్ కంపెనీలో డిపాజిట్లా?
- ఆర్బీఐ, ఐటీ, సీబీడీటీ కంట్లో పడకుండా నల్లబాబుల జాగ్రత్తలు
- ఇప్పటికే 800 మందికిపైగా సీఐడీ నోటీసులు జారీ
- ఆదాయపన్ను చట్టాన్ని పాటిస్తున్నట్లు మార్గదర్శి బుకాయింపు
- కానీ డిపాజిట్ల సేకరణకు అనుసరించాల్సింది ఆర్బీఐ నిబంధనలు



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల పుట్టలో దాగిన 'నల్ల'పాములు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. అక్రమ డిపాజిట్ల గుట్టు తేల్చేందుకు సీఐడీ తీసుకుంటున్న చర్యలతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ బెంబేలెత్తుతోంది. రూ.కోటి దాటి అక్రమ డిపాజిట్లు చేసిన వారెవరు? వారి వెనుక ఉన్నదెవరు? అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సీఐడీ చర్యలను వ్యతిరేకించడం ద్వారా అక్రమ డిపాజిట్ల సేకరణను మార్గదర్శి పరోక్షంగా అంగీకరించినట్టైందని పరిశీలకులు పేర్కొన్నారు.

బ్యాంకులను కాదని చిట్టీ కంపెనీలోనా?

రాష్ట్రంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ 37 బ్రాంచి కార్యాలయాల పరిధిలో ఇప్పటికే వెయ్యి మందికిపైగా అక్రమ డిపాజిట్‌దారులను సీఐడీ గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ప్రక్రియ

మిగతా 10వ పేజీలో ▶



విపక్షాల రెండో భేటీకి 24 పార్టీలు

6 లో

బీజేపీతో పొత్తుపై

చులకన కాలేను

- అనుకూల మీడియాతో ఇష్టాగోష్టిలో చంద్రబాబు
- ఎవరెవరో మాట్లాడే వాటిపై స్పందించనని వెల్లడి
- ఇటీవల బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీ వెళ్లిన బాబు
- అమిత్ షా అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు
- టీడీపీతో పొత్తుకు బీజేపీ సిద్ధమంటూ ఎల్లో, సోషల్ మీడియాలో ప్రచారం
- చంద్రబాబు తాజా వ్యాఖ్యలతో గందరగోళంలో టీడీపీ

10 లో

చంద్రబాబు సింగపూర్ పార్ట్‌నర్

'ఈశ్వరన్' ఔట్

అవినీతి కేసులో 'సీపీఐబీ' విచారణకు ఆదేశించిన ఆ దేశ ప్రధాని

- రవాణా శాఖ మంత్రిగా తొలగింపు
- ఈశ్వరన్‌ను ముందుపెట్టి బాబు అంతర్జాతీయ డ్రామా
- ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా ప్రచారం
- అమరావతి స్టార్టప్ ఏరియాలో రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్
- సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించాక ఆ ప్రాజెక్టుతో తమకు సంబంధం లేదని తేల్చిన సింగపూర్ ప్రభుత్వం



తన భాగస్వామి, సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ను సత్కరిస్తున్న, చంద్రబాబు(ఫైల్)

సాక్షి, అమరావతి: పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన సింగపూర్ సీనియర్ మంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్నేహితుడు ఎస్.ఈశ్వరన్‌పై అక్కడి అత్యున్నత దర్యాప్తు సంస్థ సీపీఐబీ (కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) విచారణ ప్రారంభించింది. సింగపూర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్న ఎస్.ఈశ్వరన్ తీసుకున్న నిర్ణయాల వల్ల దేశానికి భారీ ఎత్తున నష్టం వాటిల్లినట్లు సీపీఐబీ గుర్తించింది. అత్యంత తీవ్రమైన అవినీతికి పాల్పడిన మంత్రి ఈశ్వరన్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సింగపూర్ ప్రధాని లీని సీపీఐబీ డైరెక్టర్ డెనిస్ టాంగ్ ఈనెల 5న కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన సింగపూర్ ప్రధాని ఈనెల 6న అనుమతిచ్చారు. ఈనెల 11న సీపీఐబీ విచారణ ప్రారంభించడంతో ఈశ్వరన్‌ను తాజాగా మంత్రి పదవి నుంచి సింగపూర్ ప్రధాని తప్పించారు.

అమరావతి పేరుతో అంతర్జాతీయ నాటకం..

రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన

మిగతా 10వ పేజీలో ▶



ఎందుకు సార్! అక్కడ గ్రాఫిక్స్ వర్కవుట్ కాదా?!

అడగకుండానే అంగన్‌వాడీలకు ఎన్నో వరాలు

అధికారం చేపట్టిన వెంటనే వేతనాలు పెంచిన సీఎం వైఎస్ జగన్

- వర్కర్లు, ఆయాలకు 56,984 స్మార్ట్‌ఫోన్లు, వన్ జీబీ అదనపు డేటా
- గ్రేడ్-2 సూపర్‌వైజర్లుగా ప్రమోషన్, వయోపరిమితి సడలింపు
- అంగన్‌వాడీల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నేటి ప్రభుత్వం
- నాడు వేతనాలు అడిగితే గుర్రాలతో తొక్కించిన చంద్రబాబు
- ఎన్నికల ముందు అరకొరగా జీతాలు పెంచి బకాయి పెట్టిన టీడీపీ సర్కార్
- ఆందోళన కాదు.. ఆదుకున్నదెవరో చూడాలి

ఫ్యాక్ట్ చెక్



సాక్షి, అమరావతి: అడగకుండానే అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే వర్కర్లు, హెల్పర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక వరాలిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి వేతనాలు పెంచారు. పదోన్నతులు కల్పించారు. పదోన్నతుల్లో వయో పరిమితి పెంచుతూ అనేక మందికి అవకాశం కల్పించారు. పాత స్మార్ట్ ఫోన్‌ల స్థానంలో కొత్త స్మార్ట్ ఫోన్‌లు అందించారు. మునుపెన్నడూ లేని విధంగా సెలవులు మంజూరు చేశారు. బీమా కల్పించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మేలు చేసి మనసున్న సీఎంగా వైఎస్ జగన్ మన్ననలు

మిగతా 3వ పేజీలో ▶

నేడు 'స్థానిక' ఉప ఎన్నికలు

మచిలీపట్నం కార్పొరేషన్, పెడన, మాచర్ల, ధర్మవరం మున్సిపాలిటీల్లో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

13 మండలాల్లో 4 ఎంపీపీ, 7 ఉపాధ్యక్ష, 3 కో-ఆప్షన్ పదవులకు ఎన్నికలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలుచోట్ల గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో పరోక్ష పద్ధతిన ఎన్నిక జరిగే పలు పదవులకు గురువారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. గతంలోనే ఎన్నికలు జరిగి రాజీనామా చేయడం, మరణించడం వంటి కారణాలతో ఖాళీ అయిన పదవులకు ఈ ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మచిలీపట్నం నగరపాలక సంస్థలో రెండు డిప్యూటీ మేయర్ పదవులు, పెడన మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, మాచర్ల మున్సిపాలిటీలో ఒకటి, ధర్మవరం మున్సిపాలిటీలో రెండు వైస్ చైర్మన్ పదవులకు, 13 మండలాల్లో నాలుగు ఎంపీపీ, ఏడు ఉపాధ్యక్ష, మూడు కో-ఆప్షన్ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

సీఎం జగన్‌కు ఏపీ అర్చక సమాఖ్య కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలో పనిచేసే అర్చకులకు పదవీ విరమణ లేకుండా వీలైనంత కాలం పనిచేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలపడంపై ఏపీ అర్చక సమాఖ్య సీఎం జగన్‌కు బుధవారం కృతజ్ఞతలు తెలిపింది. మాట తప్పని మడమ తిప్పని నాయకుడు జగన్ అంటూ అర్చక సమాఖ్య అధ్యక్షుడు అగ్నిహోత్రం ఆత్రేయ బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దింటి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణకూ ధన్యవాదాలు తెలిపారు.

వర్సిటీ బోధనా సిబ్బంది పదవీ విరమణ వయసు పెంపుపై హర్షం

- తమకూ పెంచాలని రాష్ట్ర వర్సిటీల నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్ర యూనివర్సిటీలలోని బోధనా సిబ్బంది పదవీ విరమణ వయసును 62 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని రాష్ట్ర వర్సిటీల నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పేర్కొంది. అదే రీతిలో వర్సిటీల్లోని నాన్‌టీచింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసును కూడా 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి విన్నవించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు వై.వెంకటప్పారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది జనవరిలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అయితే వర్సిటీల నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు వర్తింపజేయలేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న తమకు కూడా పదవీ విరమణ వయసు పెంపును అమలు చేయాలని కోరారు. గతంలో 58 ఏళ్లనుంచి 60 ఏళ్లకు పెంచిన సమయంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటే తమకూ వర్తింపచేశారని గుర్తు చేశారు.

పదవీ విరమణ వయస్సు పెంపుపై ఆచార్యుల హర్షం

సాక్షి, అమరావతి:విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల అధ్యాపక సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఇందుకుగాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆచార్యులు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యాన వర్సిటీ వీసీ నియామకంపై హైకోర్టులో పిల్

సాక్షి, అమరావతి: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (వీసీ)గా డాక్టర్ టి.జానకిరామ్‌ను తిరిగి నియమించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన జానకిరామ్ నియామకాన్ని రద్దు చేసి, ఆయన స్థానంలో అన్ని అర్హతలున్న వ్యక్తిని వైస్ చాన్సలర్‌గా నియమించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఏపీ ఎస్టీ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దారునాయక్, వైఎస్సార్ జిల్లాకు చెందిన డాక్టర్ చక్రధర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది గొట్టిపాటి కవిత వాదనలు వినిపిస్తూ.. చట్టం నిర్దేశించిన విధి విధానాలకు విరుద్ధంగా జానకిరామ్ నియామకం జరిగిందన్నారు. సెర్చ్ అండ్ సెలక్షన్ కమిటీకి పేర్లు పంపకుండా నేరుగా జానకిరామ్‌ను వీసీగా నియమించారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదులుగా ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు, జానకిరామ్‌కు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ విచారణను ఆగస్టు 9వ తేదీకి వాయిదా వేసింది.

మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు కన్నుమూత

- నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



సాక్షి, అమరావతి/మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు (83) బుధవారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. అల్లూరు కృష్ణంరాజు కాంగ్రెస్ పార్టీ నుంచి 2004లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి అల్లూరు కృష్ణంరాజు అనుచరుడిగా ఉండేవారు. కృష్ణంరాజు భౌతికకాయాన్ని గురువారం స్వస్థలం సఖినేటిపల్లికి తీసుకురానున్నారు. కాగా అల్లూరి మృతికి మంత్రి చెల్లుబోయిన సంతాపం వ్యక్తం చేశారు. అల్లూరి అంతిమ సంస్కరణలు ప్రభుత్వ లాంఛనాలతో చేయాలని సీఎం జగన్ ఆదేశించారని మంత్రి తెలిపారు.

54 వేల ఎకరాల భూ పంపిణీ

▶ మొదటి పేజీ తరువాయి

పట్టా భూముల రైతుల మాదిరిగానే అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలకు అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వం వాస్తవంగా ఎవరికైతే భూమిని కేటాయించిందో వారికి యాజమాన్య హక్కు దక్కుతుంది. వారు లేని పక్షంలో వారి వారసులకు హక్కులు రానున్నాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో దాదాపు 22 లక్షల మంది బడుగు, బలహీన వర్గాల వారికి ప్రయోజనం చేకూరనుంది. ఇంకా క్యాబినెట్ నిర్ణయాల గురించి సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఆ కుల వృత్తుల వారికి శుభవార్త

3 కేటగిరీల్లోని 9,062 ఎకరాల లంక భూముల రైతులకు డీ పట్టాలు ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కొన్ని భూములను ఐదేళ్లు లీజు ఇవ్వడానికి అనుమతించారు. ఈ నిర్ణయంతో 19,176 మంది రైతులకు మేలు చేకూరుసుంది. పేదలకు భూ పంపిణీ, లంక భూములకు డీ పట్టాలు ఇవ్వడం ద్వారా మొత్తంగా 63,191 ఎకరాలకు సంబంధించి 66,111 మందికి లబ్ధి చేకూరనుంది. గ్రామాల్లో కుల వృత్తులు చేసుకునే వారికి ఇచ్చిన సర్వీస్ ఇనామ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కేబినెట్ ఆమోదించింది. కుమ్మరి, రజక, కమ్మరి, నాయీబ్రాహ్మణ తదితర కుల వృత్తులు చేసుకునే వారికి గతంలో ఇనామ్‌గా ఇచ్చిన భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. వీటిని ఇప్పుడు ఆ జాబితా నుంచి తొలగింపు ద్వారా వారికి సర్వ హక్కులు కల్పించనున్నారు. 1,68,603.71 ఎకరాల భూములు నిషేధిత జాబితా(22ఏ) నుంచి తొలగించడం ద్వారా 1,13,610 మందికి ప్రయోజనం కలుగనుంది. 2013కు ముందే వీరందరూ రైత్వారీ పట్టాలు పొందారు. ఆ తర్వాత ఈ భూములపై ఆంక్షలను విధించారు. ఇప్పుడీ ఆంక్షలన్నీ తొలగిపోనున్నాయి. రాష్ట్ర విభజనకు ముందు ల్యాండ్ పర్చేజ్ స్కీమ్ కింద గతంలో 16,213 ఎకరాలు పొందిన దళితులకు సానుకూలంగా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 14,223 మందికి కట్టాల్సిన రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వం.. రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా మాఫీ చేయడం ద్వారా రూ.2 వేల కోట్ల విలువైన భూములపై వారికి పూర్తి హక్కులు లభించను న్నాయి. ఆగస్టు తొలి వారంలో దళితు ల కు హక్కు పత్రాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేపడుతోంది.

అంతిమ సంస్కారానికి దిగులుండదు

గ్రామాల్లో ఎస్సీలకు శ్మశాన వాటికల కోసం భూములు కేటాయిస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. 1,966 రెవెన్యూ గ్రామాల్లో ఎస్సీలకు శ్మశాన వాటికలు లేవని సర్వే ద్వారా గుర్తించిన ప్రభుత్వం.. ఇందులో 1,700 రెవిన్యూ గ్రామాల్లో అందుబాటులో ఉన్న 1,050.08 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎకరం వరకు భూ కేటాయింపు అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. మరో 266 రెవెన్యూ గ్రామాలకు భూ సేకరణ చేసి ఇవ్వనున్నారు. ఇందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇక ఓపికున్నంత వరకు అర్చకత్వం

దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులు ఓపిక, శక్తి ఉన్నంత వరకు భగవంతుడి సేవలో కొనసాగేలా ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చట్ట సవరణ చేసేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే దేవదాయ శాఖ ఉద్యోగులకు కూడా ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు నిర్ణయించింది.

పునరావాసానికి ప్రత్యేక చర్యలు

వైఎస్సార్ జిల్లాలో 10,231 గండికోట ముంపు బాధిత కుటుంబాలకు పునరావాసం ప్యాకేజీ కింద రూ.454.6 కోట్లు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఫేజ్ 2, 3లోని ముంపు బాధితుల తరహాలోనే ఫేజ్1 బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనుంది. పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు సహాయ పునరావాస పనుల కోసం ప్రత్యేక ఇంజినీరింగ్ విభాగం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందుకు గాను 73 పోస్టులను కేబినెట్ ఆమోదించింది. వీటికి అదనంగా 6 ఔట్ సోర్సింగ్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

మరిన్ని అంశాలకు ఆమోదం

- నంద్యాల జిల్లా బేతంచర్ల, అనంతపురం జిల్లా గుంతకల్, వైఎస్సార్ జిల్లా మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలల్లో 128 టీచింగ్ పోస్టులు, 68 నాన్ టీచింగ్ పోస్టుల మంజూరుకు ఆమోదం. ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున 26, ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 నైపుణ్యాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వీటన్నింటికీ ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేసి, దాని ద్వారా పాఠ్య ప్రణాళికను రూపొందించాలని సీఎం జగన్ నిర్ణయించారు.
- జేఎన్‌టీయూ(కే)లో 27 నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకానికి ఆమోదం. వర్సిటీల్లో బోధనా సిబ్బంది కొరతను తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు. రిటైర్ అవుతున్న బోధనా సిబ్బంది సేవలను కాంట్రాక్టు పద్ధతిలో వినియోగించుకోవాలని నిర్ణయం. కోర్టు కేసుల దృష్ట్యా పోస్టుల భర్తీలో జాప్యం ఉంటోంది. దీనికి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా 62 ఏళ్లకు రిటైర్ అవు తున్న బోధనా సిబ్బంది సేవలను 65 ఏళ్లకు కాంట్రాక్టు పద్ధతిలో వినియోగించుకోవడానికి కేబినెట్ ఆమోదం. టోఫెల్ పరీక్షల కోసం ప్రభుత్వ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం కోసం విఖ్యాత విద్యా సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందానికి కేబినెట్ ఆమోదం. 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్న ఈటీఎస్. సన్నాహక పరీక్షలతోపాటు టోఫెల్ ప్రైమరీ, జూనియర్ స్థాయి పరీక్షలను ఈటీఎస్ నిర్వహించనుంది. అంతర్జాతీయ స్థాయిలో పోటీని తట్టుకునేలా ప్రాథమిక స్థాయి నుంచే మన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం చేస్తోంది. ఈ శిక్షణను ప్లస్, ప్లస్ వన్ స్థాయికి విస్తరించనున్నారు. ఈ నెల 23 నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో టోఫెల్‌పై శిక్షణ ప్రారంభం కానుంది.
- స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్, ట్రెనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ)ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎస్‌సీఈఆర్‌టీలో కాంట్రాక్ట్ పద్ధతిలో తొమ్మిది అకడమిక్ ఎక్స్‌పర్ట్ పోస్టుల నియామకాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటు చేసిన తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లో 19 పోస్టుల మంజూరు, కొత్తగా ఏర్పాటైన ఒంగోలు, అనంతపురం, నంద్యాల, చిత్తూరు, విజయనగరం, మచిలీపట్నం సౌత్ మండలాల్లో 70 పోస్టులు, కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో 13 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల మంజూరుకు ఆమోదం. మచిలీపట్నం, గుడివాడల్లో 6 కాలనీల్లో 1970–80 మధ్య ప్రభుత్వ ఉద్యోగులకు, జర్నలిస్టులకు మార్కెట్/నామినల్ విలువపై భూములు కేటాయిస్తూ అప్పుడు పేర్కొన్న నిబంధనలను సవరించేందుకు ఆమోదం. రాష్ట్ర మానవ హక్కుల సంఘంలోని దర్యాప్తు విభాగానికి కేటాయించిన 9 పోస్టుల మంజూరుతో పాటు, మరో 21 పోస్టులకు ఆమోదం. విశాఖ భూముల అక్రమాలపై సిట్ కమిటీ ఇచ్చిన తొలి నివేదిక లోని 69 సిఫార్సులను కేబినెట్ ఆమోదించింది. ఇందులో మరో 18 సిఫార్సులపై మరింత శోధన అవసరమన్న సిట్ నివేదికకు సమ్మతి వ్యక్తం చేసింది.

పరిశ్రమల స్థాపన.. ఉద్యోగాల కల్పన

- వైఎస్సార్ జిల్లా వేంపల్లిలో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సంస్థ రూ.8,104 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న 1,500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు ఆమోదం. దీంతో 1500 ఉద్యోగాలకు రూపకల్పన.
- హీరో ఫ్యూచర్స్‌కు చెందిన క్లీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సోలార్, విండ్ ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పేందుకు ఆమోదం. ఈ సంస్థ 375 మెగావాట్ల సామర్థ్యంతో అనంతపురం, నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో రూ.2,450 కోట్ల పెట్టుబడులతో పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తుంది. దీని ద్వారా 375 మందికి ఉద్యోగాల అవకాశాలు దక్కుతాయి.
- రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఐఐసీ పరిధిలోని వివిధ పరిశ్రమలకు 352.79 ఎకరాల భూముల కేటాయింపులకు సంబంధించి 44 ప్రతిపాదనలకు ఆమోదం. ఇందులో రూ.4,204.07 కోట్ల పెట్టుబడుతో 4,705 మందికి ఉపాధి దక్కనుంది. వీటితో పాటు ఎస్ఐపీబీ నిర్ణయాలకూ ఆమోదం.
- శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు నిర్మాణానికి అవసరమైన వనరుల సమీకరణకు ఏపీ మారిటైం బోర్డు రూ.3,884.70 కోట్ల రుణం తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వ గ్యారంటీకి కేబినెట్ ఆమోదం. ఏపీ మారిటైం బోర్డులో 2 ఇంజినీరింగ్ పో స్టులు, ఎస్ఐపీబీలో ఆమోదించిన టూరి జం ప్రాజెక్టులకు, చెన్నై– కడప, విజయవాడ–కడప, బెంగళూరు–కడప, విశాఖ–కడప మధ్య విమా నాలు నడుపుతున్న ఇండిగో సంస్థకు మరో ఏడాది పాటు వయ బిలిటీ గ్యాప్ ఫండింగ్ కొనసాగింపునకు అంగీకారం.

ఈ నెలలో అమలు చేసే కార్యక్రమాలకు ఆమోదం

- ఈ నెల 18వ తేదీన జగనన్న తోడు నాలుగో ఏడాది మొదటి విడత కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. 5.1 లక్షల మందికి రూ.510 కోట్ల రుణాలు ఇప్పిస్తూ, వడ్డీ మాఫీ కింద 4.58 లక్షల మందికి రూ.10.03 కోట్లు చెల్లించనున్నారు.
- ఈ నెల 21న నేతన్న నేస్తం పథకం కింద లబ్ధిదారులకు నిధులు జమ చేయనున్నారు. వరుసగా ఐదో ఏడాది ఈ పథకం అమలు ద్వారా 80,686 మందికి దాదాపు రూ.300 కోట్ల మేర ప్రభుత్వం లబ్ధి చేకూర్చనుంది.
- ఈ నెల 24న సీఆర్డీయే ప్రాంతంలో నిరుపేదల ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని 50,793 మందికి ప్రభుత్వం 1,366.48 ఎకరాల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. కాగా, 47,017 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. పేదల ఇళ్లు నిర్మిస్తున్న వైఎస్సార్–జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.384.52 కోట్లు కేటాయింపునకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.
- ఈ నెల 26న వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు డబ్బు జమ చేయనుంది. వరుసగా నాలుగో ఏడాది పంపిణీ చేపట్టనున్నారు. 9.48 లక్షల గ్రూపుల్లోని మహిళలకు ఈ పథకం కింద రూ.1,353.76 కోట్లు ఇవ్వనున్నారు. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం సుమారు రూ.5 వేల కోట్లు అక్కచెల్లెమ్మలకు ఇచ్చినట్లవుతుంది.
- ఈ నెల 28న విదేశీ విద్యా దీవెన కింద అర్హులైన లబ్ధిదారులకు రూ.50 కోట్ల మేర జమ చేయనున్నారు.

వైద్య రంగంలో పోస్టుల భర్తీ

2024–25 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. పులివెందుల, పాడేరు, ఆదోని మెడికల్ కాలేజీలకు గత మంత్రివర్గ సమావేశంలో పోస్టులు మంజూరు చేశారు. మిగిలిన రెండు చోట్ల.. మదనపల్లి, మార్కాపురం వైద్య కళాశాలలు ప్రారంభించడానికి వీలుగా కళాశాలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 1,412 పోస్టుల సృష్టికి కేబినెట్ ఆమోదం తెలిపింది. సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఇప్పటికే 5 వైద్య కళాశాలలను ఈ విద్యా సంవత్సరం(2023–24) నుంచి ప్రారంభించనున్నారు. క్యాన్సర్ వ్యాధి నియంత్రణ, చికిత్సలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలో కర్నూలులో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు 247 పోస్టులు మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వం ప్రజా వైద్యాన్ని బలోపేతం చేస్తోంది. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదని సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ప్రతి మూడు నెలలకోసారి నివేదిక ఇవ్వాలన్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వ విభాగంలో కలిపేందుకు జారీ చేసిన ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో విమ్స్.. మెడికల్ కాలేజీగా మార్పు, ప్రస్తుతం ఉన్న 11 మెడికల్ కాలేజీల్లో కార్డియాలజీ, క్యాథ్‌లాబ్ సీటీవీసీ విభాగాల్లో 94 పోస్టుల మంజూరు, పుంగనూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు అనుమతించింది.

మరింత సమన్వయంతో పని చేయండి

మంత్రులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం

- మరో 9 నెలల్లో ఎన్నికలు..
- 175కు 175 స్థానాల్లో విజయమే మన లక్ష్యం
- జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి
- వారానికి ఒక నియోజకవర్గం సమస్యలపై సమీక్షించాలి
- 'గడప గడపకు మన ప్రభుత్వం' పై శ్రద్ధ పెట్టాలి

సాక్షి, అమరావతి: మరో తొమ్మిది నెలల్లో జరగనున్న ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో మరింత సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. అజెండా అంశాలపై చర్చ ముగిశాక సమావేశం నుంచి అధికారులు నిష్క్రమించారు. ఆ తర్వాత సమకాలీన రాజకీయ పరిస్థితులపై సీఎం.. మంత్రులతో చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 1 నుంచి నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని ఈ సందర్భంగా మంత్రులు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. ఎలాంటి లంచాలకు తావు లేకుండా.. ప్రజల వద్దకే అధికారులు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని సీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొని, ప్రజలతో మరింతగా మమేకమయ్యేలా చూడాలని మంత్రులకు సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న జిల్లాలో వారంలో ఒక రోజు ఒక నియోజకవర్గానికి వెళ్లి.. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్, జిల్లా అధికారులతో ఆ నియోజకవర్గ సమస్యలపై సమీక్షించాలని ఆదేశించారు. ఆ సమావేశంలో వ్యక్తమయ్యే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడు వారాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్న ఏడు నియోజకవర్గాల్లో సమీక్ష సమావేశాలు పూర్తి చేయాలని చెప్పారు. మనం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ చేసిన మంచిని వివరించడానికి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మరింత ప్రభావవంతంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు.

సంస్కార హీనుడు పవన్

- ఎవరి మెప్పు కోసం వలంటీర్లపై మాట్లాడుతున్నావ్
- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: సంస్కర హీనుడిలా పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు అభిమానించే సీఎం వైఎస్ జగన్‌ని సంస్కార హీనుడంటున్న పవన్ తన మాటల్ని మళ్లీ ప్లే చేసుకుని వింటే ఎవరు సంస్కర హీనులో ఆయనకే అర్థమవుతుందని బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సభలో మాట్లాడిన తప్పుడు మాటలు, గణాంకాలు ఎవరు రాసిచ్చారని, టీడీపీ హయాంలో జరిగిన దోపిడీలు, దుర్మార్గాలు కనిపించడం లేదా అని పవన్‌ను ప్రశ్నించారు. పోలవరం 2019 నాటికి ఎలా వుందో, ఇప్పుడు ఎలావుందో? ఇలా ఉండడానికి కారణం ఎవరో? తెలిసే మాట్లాడుతున్నవా? అని నిలదీశారు. గత ప్రభుత్వంలో కనీస జ్ఞానం లేకుండా డయాఫ్రమ్ వాల్ కట్టి రూ.కోట్లు దోచేశారని, అందుకే వరదల్లో అది కొట్టుకుపోయిందని మంత్రి వివరించారు. సేవా దృక్పథంతో పని చేస్తున్న వలంటీర్లపై ఎవరి మెప్పు కోసం మాట్లాడుతున్నారని, పార్టీ పెట్టింది రాజకీయాలు చేయడానికా, లేక తిట్టడానికా అని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌ని తిట్టడానికి మాత్రమే పవన్ యాత్రలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. జనసేన అధికారంలోకి వస్తే క్వాలిటీ మద్యం అమ్మిస్తానని, కుర్రాళ్ల చేత తాగిస్తానని అంటున్నట్టుగా పవన్ మాటలు ఉన్నాయన్నారు. పవన్ తాను చెబుతున్న లెక్కలపై నిలబడతారా అని మంత్రి సవాల్ విసిరారు.

నేడు 'స్థానిక' ఉప ఎన్నికలు

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసింది. 12 పంచాయతీల్లో 12 ఉప సర్పంచి పదవులకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ కోసం ఉదయం 11 గంటలకు ఆయా స్థానికసంస్థల ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు.

ఉప ఎన్నికలు జరగనున్న స్థానిక సంస్థలు, పదవుల వివరాలు



పట్టణ ప్రాంతాల్లో..

- మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (కృష్ణా జిల్లా)– 2 డిప్యూటీ మేయర్ పదవులు
- పెడన మున్సిపాలిటీ (కృష్ణా)– చైర్‌పర్సన్
- మాచర్ల మున్సిపాలిటీ (పల్నాడు)– వైస్ చైర్మన్
- ధర్మవరం (శ్రీసత్యసాయి)– రెండు వైస్ చైర్మన్ పదవులు

గ్రామీణ ప్రాంతాల్లో ..

- **ఎంపీపీ ఎన్నికలు జరిగే మండలాలు(4):** రామకుప్పం(చిత్తూరు జిల్లా), తొండంగి(కాకినాడ), వత్సవాయి(ఎన్టీఆర్), చేజర్ల (నెల్లూరు)
- **ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగే మండలాలు (7):** రామకుప్పం, విజయాపురం(చిత్తూరు), రాపూరు (నెల్లూరు), గాలివీడు (అన్నమయ్య), పార్వతీపురం (పార్వతీపురం మన్యం), పెదకడబూరు (కర్నూలు), రాయదుర్గం (అనంతపురం)
- **కో–ఆప్షన్ మెంబర్ ఎన్నిక జరిగే మండలాలు (3):** చిత్తూరు, బి.మఠం (వైఎస్సార్), రాజంపేట (అన్నమయ్య)
- **ఉపసర్పంచి ఎన్నికలు జరిగే పంచాయతీలు (12):** అనకాపల్లి, బాపట్ల, అన్నమయ్య జిల్లాల్లో రెండేసి పంచాయతీలు, శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ఒక్కొక్క పంచాయతీ

వీవీఐపీల కోసం రెండు హెలికాప్టర్లు

- రెండేళ్ల కాలపరిమితితో లీజుకు టెండర్లు పిలిచిన ఏపీఏసీఎల్
- ప్రస్తుత హెలికాప్టర్ల కాలపరిమితి ముగియడంతో కొత్త వాటికి టెండర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రముఖుల పర్యటనల కోసం రెండు హెలికాప్టర్లను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకుంటోంది. విశాఖ, విజయవాడ ఎయిర్‌పోర్టుల్లో 24 గంటలూ అందుబాటులో ఉండే విధంగా.. రెండు ఇంజన్లు కలిగిన హెలికాప్టర్లను లీజు విధానంలో తీసుకోవడానికి ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఏసీఎల్) టెండర్లను ఆహ్వానించింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, కేంద్ర హోం శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంటూ.. రెండేళ్ల కాలపరిమితితో లీజు కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. ఈ విషయాన్ని ఏపీఏసీఎల్ ఎండీ భరత్‌కుమార్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ప్రస్తుతం వినియోగిస్తున్న హెలికాప్టర్లు పాతవి కావడం, సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో పాటు వాటి కాలపరిమితి ముగియడంతో ఏపీఏసీఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. 8 మంది కూర్చునేలా సీటింగ్ సామర్థ్యం కలిగి ఉండటంతో పాటు ఒకసారి ఇంధనం నింపుకున్న తర్వాత ఆగకుండా రెండున్నర గంటల పాటు ప్రయాణించాలన్న నిబంధనను ఏపీఏసీఎల్ విధించింది. బిడ్ దక్కించుకున్న సంస్థే హెలికాప్టర్ సిబ్బందిని, దాని నిర్వహణను, గ్రౌండ్ పార్కింగ్ చార్జీలు, ఇంధనం, బీమా తదితరాలన్నీ భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నెలకు 50 గంటల చొప్పున ఏడాదికి 600 గంటలు ప్రయాణించే అంశాలను దృష్టిలో పెట్టుకొని బిడ్ దాఖలు చేయాలని సూచించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారై రెండేళ్లు దాటని హెలికాప్టర్లనే సరఫరా చేయాలని స్పష్టం చేసింది. అవి తమ సొంత హెలికాప్టర్లని ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. అవసరమైతే కాలపరిమితిని పెంచే అవకాశం కూడా ఉందని భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

చంద్రబాబును ప్రజలు సీరియస్‌గా తీసుకోవట్లేదు

- బాబు పాలనలో సంపద సృష్టించలేదు.. గ్రాఫిక్ డిజైన్లు చేశారు
- మంత్రి చెల్లుబోయిన



సాక్షి, అమరావతి: చంద్రబాబు ఐదేళ్ల పాలనలో సంపద సృష్టించడం మానేసి గ్రాఫిక్‌డిజైన్లతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. అందుకే చంద్రబాబు వ్యాఖ్యలను ప్రజలు సీరియస్‌గా తీసుకోవట్లేదని ఎద్దేవా చేశారు. ఆయన బుధవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు చేసిన నష్టాల కారణంగా ప్రజలు వెనుకబాటుకు గురయ్యారని అన్నారు. మోసానికి పరాకాష్టగా, అధికారమే లక్ష్యంగా ఏం చేసినా చెల్లుతుందనుకోవడం సరికాదని హితవు పలికారు. చంద్రబాబు రూ.4.73 లక్షల కోట్లు అప్పులు చూపించారని, ఆ డబ్బులన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. చంద్రబాబు అప్పులపై పెట్టిన దృష్టి అభివృద్ధిపై పెట్టి ఉంటే ఈరోజు రాష్ట్రానికి ఇన్ని కష్టాలు వచ్చేవి కావని అన్నారు. ఆయనపై ఆయనకే నమ్మకం లేకనే పవన్‌ను తోడుగా తెచ్చుకుంటున్నారన్నారు. తొలుత పవన్‌ది జాతీయ భావమని, తర్వాత రెండు రాష్ట్రాలకు నాయకుడని, ఇప్పుడేమో చంద్రబాబు ఆ రెండు జిల్లాలకే పరిమితం చేసేశారని చెప్పారు. పవన్‌కు మీ వాళ్లు అక్కడే ఉన్నారు.. అక్కడే తిరుగు అంటున్నాడన్నారు. గోదావరి జిల్లాల్లో ఎన్ని సీట్లలో పోటీ చేస్తాడో తెలియని పవన్.. మమ్మల్ని 34 సీట్లలో గెలవనివ్వనని చెప్పడం హాస్యాస్పదం అని మండిపడ్డారు.

వాళ్లకు మహిళలంటే చులకన

మిస్సైన మహిళలందరూ ట్రాఫికింగ్‌కు గురయ్యారన్న పవన్ ఆలోచన తప్పని చెప్పారు. మహిళలు కనిపిస్తే అలా చూడాలన్న భావజాలం ఆయనకు ఉండొచ్చని, కానీ వలంటీర్ మాత్రం కష్టాల్లోని మహిళలను దేవతల్లా చూస్తున్నారని తెలిపారు. జన్మభూమి కమిటీలు చేసిన అకృత్యాలు అందరూ చేస్తారనుకోవడం సరికాదని అన్నారు. బతుకు దెరువు కోసం వేరే ప్రాంతానికి వెళ్లిన వ్యక్తులు.. వయసు పైబడిన తల్లిదండ్రులను దగ్గరుండి చూసుకోవాలని అనుకుంటారని, కానీ అది చాలా కష్టమని, అటువంటి తల్లిదండ్రులను ఆదుకుంటున్న వలంటీర్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఇది కచ్చితంగా చంద్రబాబు స్క్రిప్టులో భాగమేనని చెప్పారు. వీళ్లకు మహిళలంటే అంత చులకన భావమని చెప్పారు. రాష్ట్రంలో అధికారికంగా 1400 మిస్సింగ్ కేసులు ఉంటే.. పవన్ 30 వేల కేసులున్నాయని, ఐబీ చెప్పిందని అంటున్నారన్నారు. ఇలాగైతే ఐబీ ఫెయి ల్ అయినట్టేనన్నారు. ఐబీ డైరెక్టర్ ప్రధాన మంత్రికి, హోంశాఖకు బాధ్యత వహిస్తారని, పవన్‌కు ఎలా సమాచారం ఇస్తారని నిలదీశారు. ప్రభుత్వంలో కీలక సేవలందించే గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను సృష్టించిన సీఎంను చూసి ఓర్వలేకే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

క్లుప్తంగా...

విషం తాగిన మహిళను రక్షించిన వలంటీర్

పెనుకొండ: విషం తాగిన మహిళను వార్డు వలంటీర్ దిశ పోలీసుల సాయంతో రక్షించిన ఉదంతం శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుకొండకు చెందిన ఓ మహిళకు ఏడేళ్ల క్రితం నరేష్‌తో వివాహమైంది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా ఘర్షణ జరిగింది. దీంతో భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంటనే విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. అదే సమయంలో ఆ ఇంటికి వెళ్లిన వార్డు వలంటీర్ అశ్విని వెంటనే అప్రమత్తమై దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసింది. నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకున్న దిశ టీం బాధితురాలిని వలంటీర్ సాయంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వివాహితకు ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు.

పెట్రోలియం ఉత్పత్తుల తలసరి వినియోగం గోవాలో అత్యధికం

పర్యాటక ప్రాంతం కావడంతో బోటింగ్‌కు వినియోగం ఎక్కువ



సాక్షి, అమరావతి: దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల తలసరి వినియోగంలో గోవా రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. గుజరాత్ రెండో స్థానంలో, హరియాణ మూడో స్థానంలో ఉన్నాయి. కేంద్ర గణాంకాలు కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సుస్థిర ప్రగతి లక్ష్యాల పురోగతి – 2023 నివేదిక ఈ విషయం వెల్లడించింది. రాష్ట్రాలవారీగా పెట్రోలియం ఉత్పత్తుల తలసరి వినియోగాన్ని ఈ నివేదిక వివరించింది. గోవా పర్యాటక ప్రాంతం కావడంతో బోట్ల వినియోగం అత్యధికంగా ఉంది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఈ రాష్ట్రంలో కార్లూ అత్యధికంగా ఉన్నాయి. దీంతో పెట్రోలియం ఉత్పత్తుల తలసరి వినియోగం అత్యధికంగా 496.8 కిలోలు ఉంది. గుజరాత్ రాష్ట్రంలో తలసరి వినియోగం 363.8 కిలోలు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌లో అతి తక్కువ వినియోగం ఉన్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల తలసరి వినియోగం 161.6 కిలోలుగా తెలిపింది. దేశంలో 2015–16లో 136.9 కేజీలుగా పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోలియం ఉత్పత్తుల తలసరి వినియోగం 151.7 కిలోలు ఉన్నట్లు నివేదిక తెలిపింది. 2015–16 లో రాష్ట్రంలో తలసరి వినియోగం కేవలం 125.2 కిలోలు మాత్రమేనని ఆ నివేదిక వెల్లడించింది.



చిత్తూరు జిల్లా వి.కోటలో వలంటీర్ల నిరసన ర్యాలీ



విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద వలంటీర్ల నిరసన ప్రదర్శన



ఏలూరు జిల్లా బోడిగూడెంలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరులో వలంటీర్ల మానవహారం



వైఎస్సార్ జిల్లా లింగాలలో పవన్ దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగిస్తున్న వలంటీర్లు



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో పవన్ దిష్టిబొమ్మ దహనం

అదే ఛీత్కారం!

పవన్ వ్యాఖ్యలపై మూడో రోజూ వలంటీర్ల నిరసనలు

- రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, మానవ హారాలు
- పవన్ చిత్రాలను చెప్పులతో కొట్టిన వలంటీర్లు
- వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్
- పలు చోట్ల పోలీసులపై ఫిర్యాదులు
- చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వినతి

సాక్షి, నెట్‌వర్క్: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. మూడోరోజు బుధవారం నాడు కూడా నిరసనలు పెల్లుబికాయి. అన్ని జిల్లాల్లో వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు, ప్రజలు, పలు సంఘాల ప్రతినిధులు పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన ర్యాలీలు, మానవ హారాలు నిర్వహించారు. పవన్ దిష్టి బొమ్మలు దహనం చేశారు. పలుచోట్ల పవన్‌పై పోలీసులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. పవన్ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము తలచుకొంటే వారాహి యాత్ర ముందుకు సాగదని హెచ్చరించారు.

- విజయనగరం జిల్లాలో నిరసన ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి, పవన్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఆయన చిత్రపటాలకు చెప్పుల దండలు వేసి ఊరేగించారు. పవన్‌పై చర్యలు కోరుతూ గరివిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేదారిలంకలో వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తం మండల కేంద్రం వద్ద పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. తమ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడినందుకు పవన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందించారు. రాజోలు, ఇరుసుమండ, లక్కవరం, గూడపల్లి, పల్లిపాలెంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. మామిడికుదురు మండలం పెదపట్నం, తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాకలో మానవహారాలు నిర్వహించారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెం, కుక్కునూరు, కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామాల్లో పవన్ దిష్టి బొమ్మలను దహనం చేశారు.
- ఉమ్మడి ప్రకాశం జిల్లావ్యాప్తంగా మూడో రోజూ నిరసనలు కొనసాగాయి. బుధవారం చీమకుర్తిలో పవన్ దిష్టిబొమ్మను వలంటీర్లు దహనం చేసి, మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అనంతరం పవన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా చీరాలలో పవన్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి దహనం చేశారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు, కలిగిరిలో వలంటీర్లు భారీ ప్రదర్శనలు చేసి ప్యాకేజీ స్టార్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు.
- తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల వలంటీర్లు మానవహారాలు నిర్వహించారు. పవన్ దిష్టిబొమ్మలను చెప్పులు, చీపుర్లతో కొడుతూ దహనం చేశారు. పవన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గంగాధర నెల్లూరు, పెనుమూరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో వలంటీర్లు నిరసన ర్యాలీ నిర్వహించి పోలీసు స్టేషన్‌లో పవన్‌పై ఫిర్యాదు చేశారు. జూపాడుబంగ్లా మండలం మండ్లెం సచివాలయం–1 పరిధిలో పవన్ ఫొటోకు చెప్పుల దండ వేసి నిరసన ర్యాలీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిర, అమరాపురం, పుట్టపర్తి, కుందుర్పి, బెస్తరపల్లి తదితర ప్రాంతాల్లో వలంటీర్లు నిరసన ప్రదర్శనలు చేశారు.

విజయవాడలో న్యాయవాదులు, వలంటీర్ల ఫిర్యాదు

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ విజయవాడ లీగల్ సెల్ ప్రతినిధులు, పలువురు వలంటీర్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో డిప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ–అడ్మిన్) మోకా సత్తిబాబుకు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కోవిడ్ బాధితులకు కుటుంబ సభ్యులే దూరంగా ఉన్న తరుణంలో ప్రాణాలకు తెగించి వలంటీర్లు సేవలందించారని గుర్తుచేశారు. ప్రకృతి వైపరీత్యాల్లో సైతం సేవ చేస్తున్నారని అన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పథకం ప్రజల ముంగిటకే చేరుతోందన్నారు. వలంటీర్లు తలచుకుంటే వారాహి యాత్ర ఒక్క అడుగు ముందుకు సాగదని హెచ్చరించారు. వలంటీర్లకు పవన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. డీసీపీని కలిసిన వారిలో న్యాయవాదులు సాయిరామ్, ఒగ్గు గవాస్కర్, నిర్మల రాజేష్, గంజి కిరణ్, విఠల్, బసవ రెడ్డి, రజాక్, ఉషాజ్యోతి, లావణ్య, కె.వెంకటేష్‌శర్మ, పలువురు వలంటీర్లు ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థకు అధిపతి ఎవరు?

- రామోజీ, చంద్రబాబు డైరెక్షన్‌లో మళ్లీ చెలరేగిపోయిన పవన్
- తాడేపల్లిగూడెం సభలో వలంటీర్లపై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు
- రాష్ట్రమంతా ఆగ్రహం వ్యక్తమవుతున్నా మళ్లీ అదే స్క్రిప్టు
- అత్యాచారాలు చేస్తున్నారని తీవ్ర ఆరోపణ
- ఎర్ర చందనం, మద్యం అక్రమ రవాణా చేస్తున్నారని వ్యాఖలు
- మహిళా కమిషన్ నోటీసులకు భయపడనని వెల్లడి

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థకు అధిపతి ఎవరని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. వలంటీర్లు సేకరించిన డేటా అంతా హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని ఎస్‌ఓఏ ఆఫీసులో ఎందుకుందని ప్రశ్నించారు. ఏపీలోని మహిళల బ్యాంకు వివరాలు మీ ఆఫీసులో ఎందుకు పెట్టారని అన్నారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరిగిన వారాహి విజయయాత్ర సభలో ఆయన మాట్లాడారు. ప్రజలు నిరంతరం సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలపై గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ ఆయన రామోజీ డైరెక్షన్‌లో చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టు చదువుతూ మరోమారు వలంటీర్లపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. బుధవారమూ వారి స్క్రిప్టునే చదివారు. 'వలంటీర్లలో కొందరు పుచ్చులు, కిరాతకులు ఉంటే ఏం చేస్తున్నారు? మహిళలు, చిన్న పిల్లలపై వలంటీర్లు అత్యాచారం చేస్తున్నారు. తిరుపతిలో ఎర్రచందనం రవాణాలో పట్టుబడ్డారు. మద్యం అక్రమ రవాణా చేస్తున్నారు. డబ్బులు తీసుకుని అనర్హులైన వారికి పథకాలను అందిస్తున్నారు. వలంటీర్లు దైవ సంభూతులని మీ పార్టీ వాళ్లు కాళ్లు కడుగుతున్నారు. కానీ వలంటీర్లు ఇళ్ల వద్ద రెక్కీ చేసి ఒంటరి ఆడపిల్లలను వేధిస్తున్నారు, లొంగకపోతే పథకాలు తొలిగిస్తామని చెబుతున్నారు. పరువు పోతుందని తల్లిదండ్రులు బయటకు రావడంలేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఏ వలంటీరుపై ఫిర్యాదు చేయాలన్నా పోలీసులు, కలెక్టర్ వద్దకు వెళ్లాలని, తాము అండగా ఉంటామని చెప్పారు. మహిళా కమిషన్ నోటీసులకు తాను భయపడనని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గారి సతీమణి భారతి మేడమ్ ప్రత్యక్ష రాజకీయాల్లో లేరు కాబట్టి ఆమె గురించి తాను ఎప్పుడూ మాట్లాడనన్నారు. వారు మాత్రం వీర మహిళలను, మా ఇంట్లో వాళ్లను తిట్టిస్తున్నారని అన్నారు. తాను బీజేపీతో ఉన్నానని ముస్లింలు తనను నమ్మరని, తాను ముస్లిం సమాజానికి న్యాయం చేస్తానని చెప్పారు. తాను బీజేపీతో ఉన్నానా లేదా అనేది అనవసరమని అన్నారు. ఈ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమం కోసం కేటాయించిన నిధులు 7 శాతం మాత్రమే ఖర్చు పెట్టిందని అన్నారు.

జాతీయ స్థాయిని మించి రాష్ట్రంలో మాంసం లభ్యత

- జాతీయ స్థాయిలో ఏడాదికి తలసరి మాంసం లభ్యత 6.82 కిలోలు
- ఏపీలో 19.43 కిలోలు
- కేంద్ర పశుసంవర్ధక మంత్రిత్వ శాఖ–2022 సర్వే వెల్లడి

సాక్షి, అమరావతి: జాతీయ స్థాయిని మించి ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి తలసరి మాంసం లభ్యత ఉందని కేంద్ర పశు సంవర్థక మంత్రిత్వ శాఖ సర్వే–2022 వెల్లడించింది. జాతీయ స్థాయిలో ఏడాదికి తలసరి మాంసం లభ్యత 6.82 కేజీలు మాత్రమే ఉండగా, ఏపీలో 19.43 కేజీలతో దేశంలోని రాష్ట్రాల్లో మూడో స్థానంలో ఉంది. ఏడాదికి తలసరి మాంసం లభ్యతలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, హరియాణ రెండో స్థానంలో ఉంది. మాంసం ఉత్పత్తిలో టాప్ ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నాల్గో స్థానంలో ఉంది. మాంసం ఉత్పత్తిలో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్ రెండో స్థానం, పశ్చిమ బెంగాల్ మూడో స్థానం, తెలంగాణ ఐదో స్థానంలో ఉన్నాయని సర్వే తెలిపింది. దేశంలో ఈ ఐదు రాష్ట్రాల్లోనే 57.86 శాతం మాంసం ఉత్పత్తి అవుతున్నట్టు సర్వే పేర్కొంది. రాష్ట్రంలో గత మూడు ఆర్థిక సంవత్సరాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లో మాంసం ఉత్పత్తిలో వృద్ధి నమోదవుతోంది. 2019–20లో ఏపీలో 850 వేల టన్నుల మాంసం ఉత్పత్తి కాగా, 2020–21లో 954 వేల టన్నులు ఉత్పత్తి అయింది. 2021–22లో 1025 వేల టన్నుల మాంసం ఉత్పత్తి అయినట్లు సర్వే పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 2020–21లో ఏడాదికి తలసరి మాంసం లభ్యత 18.17 కేజీలుండగా 2021–22లో తలసరి మాంసం లభ్యత 19.43 కేజీలకు పెరిగిందని సర్వే పేర్కొంది.

అడగకుండానే అంగన్‌వాడీలకు ఎన్నో వరాలు



▶ మొదటి పేజీ తరువాయి

అందుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అంగన్‌వాడీలను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలనే విపక్షాల కుట్ర చేశాయి. వాస్తవాలను మరుగుపరిచి వారిని రెచ్చగొడుతున్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలు తమను ఆదుకున్నదెవరో చూడాల్సిన అవసరం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలు, వాటిలో సేవలు అందించే వర్కర్లు, హెల్పర్ల పట్ల గత ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహించింది? ప్రస్తుత ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తోంది? అనే వాస్తవాలు ఒకసారి పరిశీలిస్తే..

బాబు జమానాలో దారుణం..

వేతనాలు పెంచాలని ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను గుర్రాలతో తొక్కించి, లాఠీలతో కొట్టించి చెదరగొట్టిన చంద్రబాబు నిరంకుశ పాలనను ఇప్పటికీ ప్రజలు మరిచిపోలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ అంగన్‌వాడీల ఆవేదనను, ఆక్రోశాన్ని, కన్నీళ్లను చంద్రబాబు పట్టించుకోలేదు. విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆయన కనికరించలేదు. ఎన్నికల ముందు అరకొరగా జీతాలు పెంచి వాటిని అమలు చేయకుండా బకాయిలు పెట్టి వదిలేశారు.

అంగన్‌వాడీల్లో మనమే బెస్ట్



అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వర్కర్లు, హెల్పర్ల వేతనాల పెంపు వంటి అనేక విషయాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ బెస్ట్. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అనేక చర్యలు చేపట్టడంతో అంగన్‌వాడీల వ్యవస్థ నేడు మెరుగ్గా ఉంది. అంగన్‌వాడీలు, ప్రభుత్వ బడుల్లో బలహీనవర్గాలకు చెందిన పిల్లలే అధికంగా ఉంటారు. ఆ వర్గాలకు చెందిన పిల్లలకు సీఎం వైఎస్ జగన్ తోడుగా నిలబడుతున్నారు. ఆయన పెద్ద మనస్సుతో తీసుకున్న చర్యల వల్ల రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విప్లవాత్మక మార్పులు సంతరించుకున్నాయి.


– కేవీ ఉషశ్రీచరణ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి

సీఎం జగన్ అమలు చేసిన కార్యక్రమాల్లో కొన్ని..

- చంద్రబాబు హయాంలో అంగన్‌వాడీల జీతాల పెంపును నాలుగున్నర ఏళ్ల పాటు పట్టించుకోలేదు. ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకూ వర్కర్ల జీతం రూ. 7 వేలు, హెల్పర్లకు రూ. 4,500 మాత్రమే. ఆ తర్వాత అరకొరగా పెంచినా అమలు చేయలేదు. ఆ పెంపు కూడా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే వేతనంతో సమానం కాదు. అయినా 'ఈనాడు' ఈ నిజాన్ని దాచి అబద్ధాలు ప్రచారం చేసింది. వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే వారి జీతాలు పెంచారు. అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు నెలకు రూ. 11,500కు, హెల్పర్లకు రూ.7 వేలకు పెంచి అప్పటి నుంచి దానిని అమలు చేస్తున్నారు.
- విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా నెలకు రూ. 500 చొప్పున ప్రభుత్వం అదనంగా అందిస్తోంది. ఇందుకోసం ఏడాదికి సుమారు రూ. 27.8 కోట్లు చెల్లిస్తోంది.
- 2013 నుంచి అంగన్‌వాడీలకు పదోన్నతులు లేవు. గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్–2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేసింది. ఈ సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసే వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచి ఎక్కువ మందికి అవకాశం కల్పించింది.
- అంగన్‌వాడీ వర్కర్లకు స్మార్ట్‌ఫోన్లు కూడా ఇచ్చింది. 56,984 స్మార్ట్ ఫోన్ల కొనుగోలుకు రూ. 85.47 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అదనంగా 1 జీబీ డేటా కూడా ఇస్తోంది.
- రూ. 16 కోట్ల ఖర్చుతో ఒక్కో అంగన్‌వాడీ వర్కర్‌కు, హెల్పర్‌కు 6 చొప్పున యూనిఫాం శారీలు అందించే కార్యక్రమం కొనసాగుతోంది.
- అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి పర్యవేక్షించడంతో పాటు వర్కర్లు, హెల్పర్లకు వార్షిక సెలవులు, ప్రసూతి సెలవులు, బీమా సౌకర్యం కల్పించి భరోసా ఇస్తున్నారు. పదవి విరమణ సమయంలో ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది.
- నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వం.. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ నాణ్యంగా కనీస మౌలిక సదుపాయాలను అందించేలా చర్యలు చేపట్టింది.
- 10,932 అంగన్‌వాడీ కేంద్రాల్లో (సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లోకి రీలొకేట్ అయినవి) మౌలిక సదుపాయాలు, తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మరో రూ. 500 కోట్లతో మిగిలిన 45,000 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ పనుల్లో భాగంగా అంగన్‌వాడీ భవనాలకు రిపేర్లు, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ ఉపకరణాలు, రంగులు, రక్షిత తాగునీరు, గోడలపై బొమ్మలు తదితర పనులు చేపడుతున్నారు.
- స్మార్ట్ టీవీల ఏర్పాటుతో పాటు పిల్లల్లో నేర్చుకునే విధానాలను మెరుగుపరచడానికి ప్రత్యేక కిట్లు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని 8.5 లక్షల మంది పిల్లలకు ఈ కిట్లను ప్రభుత్వం ఇస్తోంది. దీంతోపాటు స్పోకెన్ ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను అందిస్తోంది. అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమాల ద్వారా వారి సామర్థ్యాన్ని పెంచేలా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది.
- పిల్లల ఎదుగుదలను పరిశీలించేందుకు రూ. 16.04 కోట్ల ఖర్చుతో 19,236 పరికరాలను అంగన్‌వాడీ స్కూళ్లకు ప్రభుత్వం అందిస్తోంది. గ్రోత్ మానిటరింగ్ పరికరాల కొనుగోలు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది.
- గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోం రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు కూడా అందుబాటులోకి తెచ్చింది.

ఆయకట్టు రైతులందరికీ 'తోటపల్లి' ఫలాలు

- ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల్లో మిగతా పనులు పూర్తిచేసే దిశగా అడుగులు
- రివిట్‌మెంట్ పూర్తిచేసి.. నిర్వాసితులకు పునరావాసం..
- బ్యారేజ్‌లో 2.51 టీఎంసీల నిల్వకు చర్యలు
- తద్వారా మిగిలిన 85,765 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడానికి మార్గం సుగమం
- గజపతినగరం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తిచేసి మరో 15 వేల ఎకరాలకు నీటి సరఫరా
- జలయజ్ఞం ప్రాజెక్టులను ప్రాధాన్యతగా చేపట్టి పూర్తిచేస్తున్న సీఎం జగన్



తోటపల్లి ప్రాజెక్టు

సాక్షి, అమరావతి: తోటపల్లి ప్రాజెక్టులో మిగిలిన పనులను శరవేగంగా పూర్తిచేసి మొత్తం ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే పూర్తయిన పనుల ద్వారా గతంలో ఎన్నడూలేని రీతిలో జూన్ 12నే ఖరీఫ్ పంటల సాగు నిమిత్తం 85 వేల ఎకరాలకు నీటిని విడుదల చేసింది. కుడి ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల్లో మిగిలిన పనులను పూర్తిచేయడం.. రివిట్‌మెంట్ పూర్తిచేసి, 2,151 మంది నిర్వాసితులకు పునరావాసం కల్పించి బ్యారేజ్‌లో పూర్తి సామర్థ్యం మేర 2.51 టీఎంసీలను నిల్వచేయడం ద్వారా మిగిలిపోయిన 85,765 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించే దిశగా చర్యలు చేపట్టింది. కుడి ప్రధాన కాలువలో అంతర్భాగంగా చేపట్టిన గజపతినగరం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తిచేసి మరో 15 వేల ఎకరాలకు నీళ్లందించి ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలను సస్యశ్యామలం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం తోటపల్లి వద్ద 1908లో బ్రిటిష్ సర్కార్ తోటపల్లి వద్ద నాగావళి నదిపై రెగ్యులేటర్ ద్వారా 64 వేల ఎకరాలకు నీళ్లందించేది. ఇది శిథిలావస్థకు చేరడంతో ఆయకట్టుకు నీళ్లందించడం సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో.. రెగ్యులేటర్‌కు ఎగువన 2.51 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజ్‌ను నిర్మించి.. అదనంగా 1,06,765 ఎకరాలకు, తోటపల్లి కుడి కాలువలో అంతర్భాగంగా తవ్వే గజపతినగరం బ్రాంచ్ కెనాల్ కింద మరో 15 వేల ఎకరాలకు నీళ్లందించే పనులకు జలయజ్ఞంలో భాగంగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు.

ప్రాధాన్యతగా తోటపల్లి..

జలయజ్ఞం ప్రాజెక్టులను ప్రాధాన్యతగా చేపట్టిన సీఎం వైఎస్ జగన్.. వాటిని ప్రణాళికాబద్ధంగా పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే పెన్నా డెల్టాకు జీవనాడులైన సంగం, నెల్లూరు బ్యారేజ్‌లు పూర్తిచేసిన ముఖ్యమంత్రి.. తోటపల్లిలో మిగిలిన పనులను పూర్తిచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కుడి ప్రధాన కాలువలో మిగిలిన పనులను దాదాపుగా పూర్తిచేశారు. ఇక జూన్ 12న పూర్తయిన పనుల ద్వారా పాత, కొత్త కలిపి 85 వేల ఎకరాలకు నీటిని విడుదల చేశారు. కుడి ప్రధాన కాలువలో ప్యాకేజ్–1లో 5.70 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిపని, 37 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని.. ప్యాకేజ్–2లో 8.84 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పని, 47 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మాత్రమే మిగిలింది. ఖరీఫ్ పంటలకు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో.. కోతలు పూర్తయ్యేదాకా అంటే డిసెంబర్ దాకా కాలువల పనులు చేయడానికి వీలుకాదు. సీఎం జగన్ ఆదేశాల మేరకు పంట కోతలు పూర్తయ్యాక కుడి కాలువలో మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. కుడి కాలువలో అంతర్భాగంగా తవ్వుతున్న గజపతినగరం బ్రాంచ్ కెనాల్ పనుల్లో 2.75 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పని, 27 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మాత్రమే మిగిలింది. ఈ పనుల పూర్తికి అధికారులు చర్యలు చేపట్టారు.

గరిష్ఠ సామర్థ్యం మేరకు నిల్వ..

తోటపల్లి బ్యారేజ్ గరిష్ఠ నీటినిల్వ 2.51 టీఎంసీలు. బ్యారేజ్‌లో ముంపునకు గురయ్యే 20 గ్రామాల్లోని 5,629 నిర్వాసిత కుటుంబాలకుగాను 3,478 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. కానీ, బ్యారేజ్ మట్టికట్టకు రివిట్‌మెంట్ పనులు పూర్తికాలేదు. దీంతో బ్యారేజ్‌లో రెండు టీఎంసీలను మాత్రమే నిల్వ చేయగలుగుతున్నారు. ఈ పనులు పూర్తిచేసి.. మిగతా 2,151 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడం ద్వారా వచ్చే ఏడాదికి బ్యారేజ్‌లో 2.51 టీఎంసీలను నిల్వచేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. బ్యారేజ్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేయడం ద్వారా తోటపల్లి ఆయకట్టు రైతులందరికీ జలయజ్ఞం ఫలాలు అందించే దిశగా అడుగులు వేస్తున్నారు.



నేనొక గొప్ప కవిని. నా కవితలను నేను కాగితం మీద రాయను: అవి అనుభవాలు, అనుభూతులను (మాత్రం) కలిగివుంటాయి.
– హొనొరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 13 జూలై 2023

'సెమీ' ఆశలకు సడన్ బ్రేకులు!

ఆశించిన పురోగతికి అర్ధంతరంగా బ్రేకులు పడినప్పుడు నిరాశ సహజమే! అందులోనూ అది సాక్షాత్తూ ప్రధాని గొప్పగా చెప్పిన ఆత్మనిర్భర ఆశయాలకు భంగకరమని అనిపించినప్పుడు నిరుత్సాహం మరీ ఎక్కువే! భారత దేశ సెమీ కండక్టర్ల (చిప్‌ల) తయారీ ఆకాంక్షలకు ఇప్పుడు అలాంటి అవరోధాలే వచ్చాయి. సెమీ కండక్టర్ల తయారీకి కలసి కృషి చేసేందుకు ఒక్కటైన తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ 'ఫాక్స్‌కాన్', భారత సంస్థ 'వేదాంత' ఇప్పుడు దేని దారి అది చూసుకోవడం అలాంటి పరిణామమే. దీనివల్ల భారత చిప్ లక్ష్యాలకు ఇబ్బంది ఏమీ ఉండదని కేంద్రం చెబుతున్నప్పటికీ అది సంపూర్ణ సత్యమేమీ కాదు. చిప్‌ల తయారీ నిమిత్తం వేదాంత– ఫాక్స్‌కాన్‌లు గత ఏడాది ఉమ్మడి భాగస్వామ్యానికి దిగి, గుజరాత్ ప్రభుత్వంతో 19.5 బిలియన్ డాలర్ల విలువైన సెమీ కండర్ల కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నాయి. తీరా పట్టుమని పది నెలలకే ఆ గ్రూపు నుంచి వైదొలగుతున్నట్టు ఫాక్స్‌కాన్ ప్రకటించడం ఒక విధంగా ఆకస్మిక బ్రేకనే చెప్పాలి. ఎలక్ట్రానిక్స్ తయారీ, డిజైన్ రంగంలో ప్రపంచ కేంద్రంగా మన దేశం ఆవిర్భవించేందుకు తగిన వాతావరణ పరికల్పనే లక్ష్యంగా పెట్టుకున్న భారత సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)కు ఇది శుభవార్త కానే కాదు.

'సెమీ కండక్టర్ల ఆలోచనను నిజం చేయడానికి' వేదాంత సంస్థతో కలసి ఏడాది పైగా కృషి చేసిన ఫాక్స్‌కాన్ పరస్పర అంగీకారంతో, ఈ ఉమ్మడి భాగస్వామ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు సోమవారం ప్రకటించింది. అంటే ఇక ఆ బృహత్ ప్రయత్నంలో ఫాక్స్‌కాన్ పేరు ఉండదు. ప్రాజెక్ట్ పూర్తిగా వేదాంత సంస్థకే సొంతమన్నమాట. తొలి ప్రకటన వచ్చిన 24 గంటలలోపే ఇటు ఫాక్స్‌కాన్ సైతం విడిగా తగిన సాంకేతిక భాగస్వామిని చేర్చుకొని, తనదైన వ్యూహంతో ముందుకు నడుస్తుందన్న సంకేతాలొచ్చేశాయి. కలసి అడుగులేసిన సంస్థలు ఏడాదికే ఇలా వేరు కుంపట్లయిన పరిణామానికి కారణాలేమిటన్నది అవి చెప్పలేదు. గుజరాత్‌లో చిప్‌ల తయారీకి కావాల్సిన లైసెన్స్‌తో కూడిన సాంకేతిక పరిజ్ఞానంకోసం వేదాంత, ఫాక్స్‌కాన్‌లు ఎస్టీమైక్రోను ఆసరాగా బరిలోకి దింపాయి. కానీ, ప్రభుత్వం మాత్రం సదరు యూరోపియన్ చిప్ తయారీ సంస్థ కూడా నిష్పూచీగా మిగలక, ఒప్పందంలో భాగస్వామిగా ఉండాల్సిందే అనడంతో చిక్కొచ్చినట్టుంది.

ప్రపంచంలో 37 శాతం చిప్‌లు తైవాన్‌వే! భారత ఎలక్ట్రానిక్ చిప్ అవసరాలన్నీ ప్రధానంగా దిగుమతి ద్వారానే తీరుతున్నాయి. కొన్నేళ్ళుగా ఏటా దాదాపు 1000 కోట్ల డాలర్ల విలువైన చిప్‌లను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అందులో సుమారు 70 శాతం చైనా నుంచి వస్తున్నవే. చిప్‌ల తయారీలోని ఈ అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఐఎస్ఎం ప్రారంభమైంది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, అనేక ఐరోపా దేశాలు చిప్‌ల తయారీ సత్తా పెంచుకుంటున్నాయి. తాజాగా భారత్ ఆ పరుగులో చేరింది. దేశంలో చిప్‌ల తయారీ కేంద్రాల్ని నెలకొల్పాలని వచ్చేవారికి పెట్టుబడి రూపంలో ప్రోత్సాహకాలిచ్చేందుకు సిద్ధపడింది. అమెరికా చిప్ తయారీ సంస్థ మైక్రాన్ ఇటీవలే భారత్‌లో చిప్ కేంద్రానికి ఆమోదం పొందింది. కేంద్ర, గుజరాత్ సర్కార్లు దానికి గణనీయంగా పెట్టుబడి సాయం చేస్తున్నాయి. ఆత్మ నిర్భరతకై ఇలాంటి యత్నాలు జరుగుతున్న వేళ భారీ ఒప్పందమైన వేదాంత – ఫాక్స్‌కాన్ చిక్కుల్లో పడడమే విచారకరం.

కారణాలేమైనా గత ఏడాది ఫిబ్రవరి 14న ఫాక్స్‌కాన్– వేదాంతల మధ్య మొలకెత్తిన ప్రేమ మూణ్ణాళ్ళ ముచ్చటైంది. గుజరాత్‌లో చిప్‌ల తయారీ కేంద్రాల ఏర్పాటుకై గత సెప్టెంబర్‌లో చేసుకున్న రూ. 1.54 లక్ష కోట్ల మేర ఒప్పందాలు ఇరుకునపడ్డాయి. ఏ సంస్థకు ఆ సంస్థ విడివిడిగా ముందుకు పోయినా భారత సెమీ కండక్టర్ల మిషన్‌లో జాప్యం తప్పదనిపిస్తోంది. చిప్‌ల తయారీకి తగ్గ పునాది లేకున్నా చిప్ డిజైన్‌లో మాత్రం మన దేశం ముందంజలో ఉంది. దాన్ని ఆయుధంగా మలుచుకోవాలి. సొంత తయారీతో పదునుపెట్టుకోవాలి. పైగా, కరోనాతో సరఫరా వ్యవస్థలకు అంతరాయం, రష్యా – ఉక్రెయిన్ యుద్ధంతో వచ్చిపడ్డ అనివార్యతల రీత్యా రక్షణ, ఎలక్ట్రానిక్స్ తదితర కీలక రంగాల్లో భారత్ ఎంత త్వరగా సొంతకాళ్ళపై నిలబడగలిగితే వ్యూహాత్మకంగా అంత మంచిది.

ఆ మాటకొస్తే, ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా పైచేయి సాధించగలిగిందీ ఈ చిప్‌ల వల్లేనంటారు విశ్లేషకులు. అమెరికా, చైనాల మధ్య ఇప్పుడు నడుస్తున్న భౌగోళిక రాజకీయాల తోపులాటలోనూ ఇవే కారణం. ఇవాళ దేశాలన్నీ తమ గడ్డపైనే అన్ని రకాల చిప్‌ల రూపకల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తోందీ, ప్రోత్సాహకాలిస్తున్నదీ అందుకే. కాబట్టి, మనకు అవసరమైన చిప్‌ల డిజైనింగ్ నుంచి తయారీ దాకా అన్నీ మన చేతుల్లోనే ఉండడం పోటీలో ముందు ఉండడానికో, ఆర్థిక ప్రయోజనాల రీత్యానో కాకున్నా... వ్యూహాత్మకంగా భారత్‌కు అత్యంత కీలకం. అందుకే, వేదాంత – ఫాక్స్‌కాన్‌ల బంధం విచ్ఛిన్నమైందన్న నిరాశను పక్కనపెట్టి, సెమీ కండక్టర్ల రంగాన్ని దృఢంగా నిర్మించేందుకు మరింతగా కృషి చేయాలి. చైనా లాంటివి పడనివ్వకుండా చేసినా పట్టుదలతో సాగాలి.

వేదాంత – ఫాక్స్‌కాన్‌లకు ఇరుకున పెట్టిన ఆర్థిక, సాంకేతిక అంశాలనూ క్షుణ్ణంగా పరిశీలించాలి. భవిష్యత్తులో ఇలాంటి మరో ప్రయత్నానికి ఆ చిక్కులు రాకుండా నివారించాలి. సెమీ కండక్టర్ల రంగంలో సాంకేతిక విజ్ఞాన బదలీని ప్రోత్సహించాలి. పరిశోధన, అభివృద్ధిలో దేశ, విదేశీ సంస్థల మధ్య సహకారాన్నీ పెంచిపోషించడమూ అంతే ముఖ్యం. ఎందుకంటే, ఐఎస్ఎం కింద రూ. 76 వేల కోట్ల కేటాయింపుతో నాలుగు పథకాలు ప్రవేశపెట్టామంటున్న ప్రభుత్వం సంస్థలకు తగిన వాతావరణం కల్పిస్తేనే ఫలితం. మేకిన్ ఇండియాకు బ్రేకులు పడకూడదంటే అది అత్యంత కీలకం.

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: బ.ఏకాదశి రా. 8.20 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం: కృత్తిక రా. 11.22 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ. 11.16 నుండి 12.54 వరకు, దుర్ముహూర్తం: ఉ. 9.04 నుండి 10.08 వరకు, తదుపరి ప. 3.08 నుండి 3.59 వరకు అమృతఘడియలు: రా.8.54 నుండి 9.42 వరకు.

సూర్యోదయం : 5.36
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

విద్యుత్ ఛార్జీలను ఎలా నిర్ణయిస్తారు?

పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజా జీవితంలో విద్యుచ్ఛక్తి అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోంది. అది అతి ముఖ్యమైన నిత్యావసరంగా మారింది. అయితే విద్యుత్ ఛార్జీలు పెరిగినప్పుడల్లా వివిధ వర్గాల నుంచి నిరసన వ్యక్తమవుతూ ఉంటుంది. ప్రభుత్వమే ఇందుకు బాధ్యురాలని నిందిస్తూ ఉంటారు. నిజానికి విద్యుత్ ఛార్జీల పెంపుదలను కానీ, తగ్గుదలను కానీ నిర్ణయించేది ప్రభుత్వం కాదు. స్వయం ప్రతిపత్తి గల 'విద్యుత్ నియంత్రణ సంస్థ' ఈ పని చేస్తుంది. అది కూడా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే చేస్తుందని గమనించాలి.

విశ్లేషణ



జస్టిస్ సి. వి. నాగార్జున రెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతి నెలా జారీ చేసే విద్యుత్ బిల్లుల్లోని వివిధ అంశాలపై చాలామందికి పలు అపోహలు, సందేహాలు ఉంటున్నాయి. ముందుగా విద్యుత్ ఛార్జీలను ఎవరు, ఎలా ఖరారు చేస్తారో తెలుసుకోవడం ముఖ్యం. చట్ట ప్రకారం ఏర్పడిన స్వతంత్ర ప్రతిపత్తి గల 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి' (ఏపీఈఆర్‌సీ) విద్యుత్‌కు సంబంధించిన వివిధ అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వినియోగదారుల తరగతులు, వారు చెల్లించాల్సిన విద్యుత్ ఛార్జీలను నిర్ణయిస్తుంది.

విద్యుత్ ఉత్పత్తి చేయడానికి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు, చమురు వంటి ఇంధనాలను వినియోగించాల్సి ఉంటుంది. ఒక యూనిట్ విద్యుత్ తయారుచేయడానికి అయ్యే ఇంధనం ఖర్చును ఈ విద్యుత్ కేంద్రాలు లెక్కించి, దానిని పంపిణీ సంస్థలకు నెల నెలా సరఫరా చేసే విద్యుత్ యూనిట్లతో హెచ్చించి వసూలు చేస్తాయి. పంపిణీ సంస్థలు తిరిగి ఈ మొత్తాలను విద్యుత్ సరఫరా, పంపిణీలో జరిగే సాంకేతిక నష్టాలను కూడా పరిగణనలోకి తీసుకొని వినియోగదారుల నుంచి 'ఎనర్జీ ఛార్జెస్' రూపంలో వసూలు చేస్తాయి.

విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వంటి కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు... రుణ సంస్థలకు చెల్లించే వడ్డీ, ఉద్యోగుల ఖర్చు, నిర్వహణ మూలధనం మీద వడ్డీ, వివిధ రకాల పన్నులు, డ్యూటీలు వంటివాటిని భరించవలసి ఉంటుంది. ఈ ఖర్చులను పంపిణీ సంస్థలు వినియోదారుల నుంచి ఫిక్స్‌డ్ చార్జీల రూపంలో వసూలు చేస్తాయి. వినియోగదారుల మీటర్ల ఖర్చు, మీటర్ రీడింగ్, ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఖర్చులను కస్టమర్ చార్జీల రూపంలో పంపిణీ సంస్థలు వసూలు చేస్తాయి. ఎలక్ట్రిసిటీ డ్యూటీ (విద్యుత్ సుంకము)ని రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల నుంచి వారి విద్యుత్ వినియోగం మీద యూనిట్‌కు ఇంత చొప్పున పంపిణీ సంస్థల నుంచి వసూలు చేస్తుంది. ఈ డ్యూటీ వసూలు చేసే అధికారాన్ని 'ఎలక్ట్రిసిటీ డ్యూటీ చట్టం' రాష్ట్ర ప్రభుత్వానికి కల్పించింది. వ్యవసాయ వినియోగదారులకు తప్ప మిగిలిన అన్ని తరగతుల వారికి ఈ డ్యూటీ వర్తిస్తుంది.

గడువులోగా ఎలక్ట్రిసిటీ డ్యూటీ చెల్లించని వినియోగదారుల నుంచి పంపిణీ సంస్థలు వడ్డీని వసూలు చేస్తాయి. వినియోగదారులు విద్యుత్ ఛార్జీలను బిల్లుల్లో సూచించిన గడువులోగా చెల్లించకపోతే, వారి మీద విధించే వడ్డీ 'సర్ ఛార్జీ'. వినియోగ దారుల మీటర్లలో లోపం కారణంగా సరైన రీడింగ్ నమోదు చేయకపోతే, పంపిణీ సంస్థలు వాటిని పరిశీలించి, సరి చేసి, పాత బిల్లుల మొత్తాలను కూడా దానికనుగుణంగా సరి చేసి, కొత్త బిల్లులలో వాటిని 'షార్ట్ ఫాల్'గా చూపిస్తుంటాయి. ఎవరైనా వినియోగదారుడు పాత నెలలకు సంబంధించిన బిల్లులలో చూపించిన ఛార్జీల కన్నా ఎక్కువగా గాని, తక్కువగా గానీ చెల్లించి ఉంటే, పంపిణీ సంస్థలు, ఆ తేడాను కొత్త బిల్లులలో 'ఎడ్జెస్ట్‌మెంట్'గా చూపిస్తాయి.



విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సరఫరా, పంపిణీ సంస్థల (పంపిణీ వ్యాపారానికి సంబంధించిన) రాబోయే 5 సంవత్సరాల టారీఫ్‌లను ఏపీఈఆర్‌సీ ఒకేసారి నిర్ణయిస్తుంది. ఈ టారీఫ్‌లు ఈ సంస్థలు సమర్పించిన భవిష్య ఆదాయ, వ్యయాల అంచనా ఆధారంగా ఏపీఈఆర్‌సీ నిర్ణయిస్తుంది. అయితే అంచనాలకు వాస్తవ ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసం ఉండడం సహజం. ఈ వ్యత్యాసాలకు గల కారణాలను ఏపీఈఆర్‌సీ పరిశీలించి, ఆమోదించిన తరువాత, పంపిణీ సంస్థలు వాటిని 'ట్రూ అప్' చార్జీల రూపంలో కానీ 'ట్రూ డౌన్' చార్జీల రూపంలోగానీ బిల్లుల్లో చూపిస్తాయి.

ఏపీఈఆర్‌సీ రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటైల్ టారీఫ్‌లను పంపిణీ సంస్థలు సమర్పించిన ఆదాయ, వ్యయాల అంచనాలను కూలంకుషంగా పరిశీలించి నిర్ణయిస్తుంది. ఈ అంచనాలలో, విద్యుత్ కొనుగోలు ఖర్చు అతి ముఖ్యమైనది. అయితే, వాస్తవ విద్యుత్ కొనుగోలు వ్యయం, బొగ్గు, రవాణా తదితరాల ధరలలో వచ్చే మార్పులు, స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్ల వల్ల అంచనా కంటే భిన్నంగా ఉంటుంది. ఈ వ్యత్యాసాలకు గల కారణాలను ఏపీఈఆర్‌సీ పరిశీలించి, తగిన వ్యత్యాసాల మొత్తాలను ఆమోదించిన తరువాత, పంపిణీ సంస్థలు వాటిని ఎఫ్‌పీపీసీఏ రూపంలో బిల్లులో చూపిస్తాయి. ఇది అన్ని తరగతుల వినియోగదారులకు వర్తిస్తుంది. అయితే, వ్యవసాయ వినియోగదారులకు సంబంధించిన భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని తరగతుల వినియోగదారులకు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యూనిట్‌కు కొంత చొప్పున రాయితీలు ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఈ రాయితీలను దృష్టిలో ఉంచుకొని ఆయా తరగతుల వినియోగదారుల చార్జీలు నిర్ణయిస్తుంది. తరువాత, పంపిణీ సంస్థలు ఈ రాయితీ మొత్తాలను ప్రభుత్వం నుంచి పొందుతాయి.

వినియోగదారులను సబ్సిడైసింగ్, సబ్సిడైజ్డ్ వినియోగదారులుగా విభజిస్తారు. సబ్సిడైసింగ్ వినియోగదారుల టారీఫ్ వారికి సరఫరా అయ్యే విద్యుత్ అసలు ధర కంటే ఎక్కువగా ఏపీఈఆర్‌సీ నిర్ణయిస్తుంది. వీరు మెరుగైన కొనుగోలు శక్తి, ఆర్థిక స్తోమత కలవారై ఉంటారు. అలాగే, సబ్సిడైజ్డ్ వినియోగదారుల టారీఫ్ వారికి సరఫరా విద్యుత్ అసలు ధర కంటే తక్కువగా ఏపీఈఆర్‌సీ నిర్ణయిస్తుంది. వీరికి కొనుగోలు శక్తి, ఆర్థిక స్తోమత తక్కువగా ఉంటాయి. సబ్సిడైసింగ్ వినియోగదారులు చెల్లించే ఎక్కువ టారీఫ్‌తో, సబ్సిడైజ్డ్ వినియోగదారుల వల్ల కలిగే ఆదాయ లోటును పంపిణీ సంస్థలు భర్తీ చేసుకుంటాయి. సబ్సిడైసింగ్ వినియోగదారులు వారి అసలు విద్యుత్ ధర కంటే అధికంగా చెల్లించే ధరనే 'క్రాస్ సబ్సిడీ' అంటారు.

వినియోగదారులకు వారున్న ప్రదేశంలోని పంపిణీ సంస్థల నుంచి కాకుండా వేరే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసుకోవడానికి 'కేంద్ర విద్యుత్ చట్టం- 2003' స్వేచ్ఛనిచ్చింది. అయితే దీని వల్ల సబ్సిడైసింగ్ వినియోగదారులు, సహజంగానే పంపిణీ సంస్థల నుంచి కాకుండా వేరే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతారు. దానివల్ల పంపిణీ సంస్థలు క్రాస్ సబ్సిడీ రూపంలో వస్తున్న ఆదాయాలను కోల్పోతారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని, కేంద్ర విద్యుత్ చట్టం ఈ స్వేచ్ఛకు కొన్ని పరిమితులు విధించింది. అనగా వేరే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసే సబ్సిడైసింగ్ వినియోగదారులు (వీరిని ఓపెన్ యాక్సెస్ వినియోగదారులు అంటారు), పంపిణీ సంస్థలకు విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయించిన క్రాస్ సబ్సిడీ ఛార్జీలను చెల్లించాలనే నిబంధన విధించారు. ఈ క్రాస్ సబ్సిడీ ఛార్జీలు వేరే వారి నుండి విద్యుత్ కొనుగోలు చేస్తున్న సబ్సిడైసింగ్ వినియోగదారుల బిల్లులలో కనిపిస్తాయి. వినియోగదారుల బిల్లులలో 50 పైసల కంటే తక్కువ ఉన్న మొత్తాన్ని సున్నా పైసాగా, 50 పైసల కన్నా ఎక్కువ ఉన్న మొత్తాన్ని రూపాయిగా సరి చేస్తారు. దీనినే 'లాస్/గెయిన్' అంటారు. ఇది అన్ని తరగతుల వినియోగదారులకు వర్తిస్తుంది. ఇక్కడ పేర్కొన్న ఛార్జీలలో లేనివి 'అదర్ ఛార్జీ'ల కిందకు వస్తాయి.

విద్యుత్ టారీఫ్ లకు సంబంధించి వినియోగదారులు గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ధరల పెరుగుదల బొగ్గు, సహజ వాయువు, స్టీల్, సిమెంట్, విద్యుత్ పరికరాలు వంటి వాటి ధరల పెరుగుదల మీద ఆధార పడి ఉంటుంది. ఈ ధరలను నియంత్రించే అధికారం విద్యుత్ నియంత్రణ సంస్థలకు లేదు. దీని వల్ల విద్యుత్ టారీఫ్‌లు సహజంగానే పెరుగుతుంటాయి. ఈ సహజ పెరుగుదలను విద్యుత్ నియంత్రణ సంస్థలు ఆపలేవు. వారి పరిధిలో ఉన్నది, విద్యుత్ ధర పెరుగుదలను పైన చెప్పిన అంశాల పెరుగుదలను మించకుండా ఉండేటట్లు చూడడం మాత్రమే.

వ్యాసకర్త హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షులు.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

టమోటా కూరొచ్!



ఇప్పుడే మా పనిమనిషి మా ఇంటికి కిలో టమోటాలు తెచ్చాడు. అతడు నణుగుతూ, 'దీదీ (అక్క), దీనికంటే చికెన్ తెచ్చుకునివుంటే బాగుండేది కదా' అన్నాడు. టమోటా కిలో రూ.250. చికెన్ కిలో రూ.240.

– హనా మొహిసిన్ ఖాన్, పైలట్

రెండూ ఇవ్వాలి!



మీరు ఎవరికైనా ఏదైనా చేయాలన్న బాధ్యతను మాత్రమే అప్పగించి, అది నిర్వర్తించడానికి తగిన అధికారం ఇవ్వకపోతే ఉపయోగం ఏముంది! అలా చేస్తే... అతడిని మీరు ముందే విఫలం చేస్తున్నట్టు!

– మార్క్ క్యూబన్, వ్యాపారవేత్త

మీరు సరితూగరు!



ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్, ప్రొఫెసర్ రొమిల్లా థాపర్ ఇద్దరూ తమ తొంభయ్యో పడిలో ఉన్నప్పటికీ చురుగ్గా ఉన్నారు. హిందూత్వ భ్రమల కల్పన యుగంలో దాన్ని అడ్డుకునేలా ముఖ్యమైన పాండిత్య పటిమను చూపుతున్నారు. వాళ్ళు దేశం వదలాలని కోరుకునే హిందూత్వ రచయితలు కేవలం శుష్కమైన మాటలతో వారి జ్ఞానానికి సరితూగలేరు.

– మణిముగ్ధ శర్మ, జర్నలిస్ట్

మీ లైన్లో లేకపోతే...



ఆర్.సి.మజుందార్ సంగతేమిటి? 11 భాగాల 'ద హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ఇండియన్ పీపుల్', మూడు భాగాల 'హిస్టరీ ఆఫ్ ద ఫ్రీడమ్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా' – ఇవన్నీ భారత చరిత్ర మీద పనిచేసే ఏ పండితుడికైనా మూలాధారాలు కదా? కేవలం నెహ్రూ 'అబుల్ ఫజల్' కావడానికి నిరాకరించినందున ఆయన్ని పక్కనపెట్టారు.

– జగదీశ్ ఉపాసనే, సంపాదకుడు

సోమరితనమే సుఖం



10 నిమిషాల జాగింగ్ చేస్తే, 8 నిమిషాల ఆయుఃప్రమాణం పెరుగుతుందన్నారు. కానీ ఒక సందేహం. నిజంగా నేను దేన్ని పెంచాలనుకుంటున్నాను? ఆయుః ప్రమాణాన్నా? జాగింగ్ చేయకుండా ఉండే కాలాన్నా? రెండోదే కావాలనుకుంటే, నేను జాగింగ్ చేయకూడదు. ఎందుకంటే, ప్రతి పదినిమిషాలకు నేను నా 2 నిమిషాల జాగింగ్ చేయకుండా ఉండే కాలాన్ని నష్టపోతాను.

– కౌశిక్ బాసు, ఆర్థికవేత్త

జై హనుమాన్



2023 ఆసియన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్ అధికారిక చిహ్నంగా హనుమంతుడిని ఎంచుకుంది థాయ్‌లాండ్. "ప్రభువు హనుమంతుడు బలం, శక్తి, వివేకం చూపుతారు," అని అధికారిక ప్రకటన వెల్లడించింది. ఒక క్రీడల పోటీకి ఇండియా ఇదే పని చేసివుంటే, మనల్ని ఫాసిస్టు హిందూ రాజ్యంగా విమర్శించేవాళ్లు.

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' కన్సల్టింగ్ ఎడిటర్

ఒక్కసారిగా వదిలితే...



ఇండియాలో వరదల ప్రమాదానికి ముఖ్య కారణం కేవలం భారీ వానలు మాత్రమే కాదు. డ్యాముల్లోంచి నీటిని ఉన్నట్టుండి విడుదల చేయడం! ఇది విధ్వంసక ప్రభావాన్ని చూపుతున్నది. నిజమైన ప్రమాదం నీటిని ఆయుధంగా వాడటంలో పొంచి ఉంది. దీనికి మనం జలవనరుల అధికారులను జవాబుదారీగా నిలబెట్టాలి.

– మనన్ భట్, నేవీ వెటరన్

అసలు కావలిసింది 'ఉమ్మడి ఆర్థిక స్మృతి!'

అభిప్రాయం



రంగనాయకమ్మ

'ఒకే ఇంట్లో వున్న ఇద్దరు వ్యక్తులకు రెండు వేరు వేరు చట్టాలు వుంటే, ఆ కుటుంబం సవ్యంగా సాగుతుందా, చెప్పండి?' అని ప్రధాని మోదీ, బీజేపీ కార్యకర్తల్ని అడిగిన వార్త, పది రోజులుగా ఒక చర్చనీయాంశం అయింది! అన్ని మతాల వారినీ ఒకే రకపు పౌరులుగా చేయాలనే ప్రయత్నంతో, 'ఉమ్మడి పౌర స్మృతి' అనే విధానం ఎంత అవసరమో చెప్పడానికి మోదీ తమ పార్టీ కార్యకర్తలకు ఇచ్చిన ఉపన్యాసం అది! దేశంలో, ఐదు రాష్ట్రాలలో, త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని, అన్న బోధనగా ఆ మాటల్ని అర్థం చేసుకోవచ్చు. ముస్లిం ఓటర్ల ఓట్లు బీజేపీకి ఎలానూ రావని ఆ పార్టీకి తెలుసు. కాబట్టి, హిందూ ఓటర్లలో అత్యధికుల్ని తన వైపు తిప్పుకోవడానికే బీజేపీ చేసే ప్రయత్నం అది. ఆ విధంగా భారత దేశ ప్రజలందర్నీ పౌరులుగా కాక, హిందువులుగా, ముస్లిములుగా, విభజించడానికే మోదీ వేసిన ఎత్తుగడ అది– అని కొన్ని ప్రతిపక్షాలు సరిగానే విమర్శిస్తున్నాయి.

'ఉమ్మడి పౌర స్మృతి' అనే విధానపు మంచి చెడ్డల గురించి చెప్పుకోవాలంటే, ముందు అది ఏమిటో కనీసంగా తెలియాలి. ఒక దేశంలోనే కాదు, ప్రపంచం లోనే వున్న ఆడా, మగా పౌరులందరికీ, మతం, కులం, ప్రాంతం వంటి తేడాలు లేకుండా, పౌరుల వ్యక్తిగత జీవితాల్నీ, కుటుంబ జీవితాల్నీ శాసించే, ఒకే రకమైన చట్టం ('స్మృతి') ఉండవలసిందే! ఎందుకంటే, ఉదాహరణకి, ఒకటి రెండు మతాల్లో, పురుషులకు ఎక్కువ మంది స్త్రీలతో పెళ్ళిళ్ళు! ఇంకో మతంలో, పెళ్ళయిన వాళ్ళు విడిపోవడంలో స్త్రీలకే కాదు, పురుషులకు కూడా అసాధ్యమైనంత కష్టం! మతాల్లో, ఆస్తి హక్కులు ఆడవాళ్ళకీ, మగవాళ్ళకీ వేరు వేరుగా! మొగవాడి దృష్టిలో ఆడది తక్కువ! ఆడదాని దృష్టిలో మొగవాడు ఎక్కువ! ఈ విధంగా, పెళ్ళీ, విడాకులూ, దత్తతా, ఆస్తి హక్కూ, వంటి విషయాల్లో, వేరు వేరు మతస్తుల ఆచారాలూ, నియమాలూ, వేరు వేరే! ఎందుకూ? భారత్‌లో, మతాల గురించీ, కులాల గురించీ, సమానత్వాల బోధనలతో మాట్లాడే వాళ్ళు, అసలు బ్రతుకు తెరువుకి పునాది కారణం అయిన ఆదాయాల్లో తేడాల గురించి ఎందుకు ఎత్తరు?

'ఉమ్మడి పౌర స్మృతి' కోసం ప్రయత్నించాలని, భారత



రాజ్యాంగంలో కూడా ఒక చోట చెప్పారని తెలుస్తుంది! కానీ, దాన్ని సాధించడానికి సరైన పునాదిగా ఏ పరిస్థితులు ఏర్పడాలో భారత రాజ్యాంగం చెప్పదు! ఎవరి మతాచారాల్ని వారు ఆచరించే హక్కులు ఉండవచ్చని ఒక వేపు చెపుతూనే, 'మతాలతో నిమిత్తం లేకుండా' పౌరులందరికీ, వ్యక్తిగత, కుటుంబ జీవితాలకు సంబంధించి ఒకే చట్టం ఉండాలని ఇంకో పక్క సూచిస్తుంది. ఎంత గడుసు రాజ్యాంగం! ఒకటి 'ప్రాథమికమైన హక్కు'! రెండోది కేవలం 'సూచన'! సూచన, నిబంధనగా ఎప్పటికీ అవదు. ఉమ్మడి పౌర స్మృతి కూడా నిజానికి సూచన వంటిదే! కానీ, దాన్ని చట్టంగా నిలబెట్టాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి ఇప్పుడు.

మోదీని, బీజేపీ కార్యకర్తలు ఈ తర్కంతో అడగాలి: అయ్యా! తమరు ఉమ్మడి పౌర స్మృతి పేరుతో పౌరులందరికీ ఒకే చట్టం ఉండాలంటున్నారు! ఆ స్మృతి, కేవలం వ్యక్తిగత, కుటుంబ జీవితాలకు మాత్రమే కదా? మరి, పౌరులందరూ ఆర్థికంగా ఒకే స్థితిలో లేరు! 'ఆర్థికంగా' అంటే, 'రూపాయి నోట్ల' పరంగా కాదు, శ్రమలు చేయడాల పరంగా, ఉత్పత్తి కార్యాల పరంగా! దేశ పౌరుల్లో, కొందరికి భారీ భారీ ఆస్తులున్నాయి! కొందరికి రెక్కల కష్టం తప్ప వేరే మార్గం లేదు. దేశంలో భూములు ఎన్ని? అవి ఉమ్మడిగానే వుంటున్నాయా? దేశంలో, ఉత్పత్తి రాసుల్ని కురిపించే పరిశ్రమల్లో పౌరులందరూ సమానులేనా? సమస్త రవాణా సాధనాలనూ నిర్మించడానికీ, నడపడానికీ, కోట్ల కోట్ల డబ్బు రాసుల రాబడులకూ కారకులు ఎవరు? వాటి యాజమాన్యాలు ఎవరివి? ఆస్తి హక్కులకు కారణాలు ఏమిటి? పాకీ దొడ్లు తుడిచే అట్టడుగు కులాల శ్రామికులకు దేనిమీద యాజమాన్యం వుంది? దేశంలో, నిత్యం, 24 గంటలూ, ఉత్పత్తుల కార్యాలలో మునిగి బ్రతికే శ్రామికులకు, సుఖ శాంతుల్లో ఉమ్మడితనం వుందా? ఆడవాళ్ళ గృహ కార్యాలలో, పిల్లల పెంపకాల్లో, వృద్ధుల సంరక్షణల్లో, పురుషుల ఉమ్మడి పాత్ర వుందా? శ్రామిక జనంలో, మేధా శ్రామికులు వేరూ, శారీరక శ్రమల వారు వేరూ! శ్రమలు చేయడాల్లో ఉమ్మడితనం లేకపోతే, పౌరులుగా సమానులా?

ఈ రకంగా ఆర్థిక అసమానతల గురించి స్పష్టంగా గ్రహిస్తూ, మోదీ వంటి నాయకుల్ని అడగవలిసిన ప్రశ్న ఏమిటి? వ్యవసాయంలో, పరిశ్రమల్లో, రవాణాల్లో, సమస్త శ్రమల్లోనూ కాదా; ఏ ఒక్క శ్రమలో అయినా వేలు పెట్టని పౌరులకూ, రాత్రింబవళ్ళూ డ్యూటీలతో సతమతమయ్యే పౌరులకూ మధ్య ఉమ్మడితనం ఉన్నట్టా? ఇది వుందో లేదో ప్రశ్న లేకుండా, పెళ్ళికో, విడాకులకో, దత్తతకో, దీనికో, దానికో ఉమ్మడి చట్టాలా? హక్కులే సమానంగా, ఉమ్మడిగా లేనప్పుడు, ఉమ్మడి పౌర స్మృతి గురించి ఉపన్యాసం ఇస్తున్నారేమీ మహాశయా?– అని మోదీని ప్రజలందరూ ప్రశ్నించలేరా? ఎన్నికల ముచ్చట్లలోనూ, నాయకుల ఆరాధనల్లోనూ మునిగిపోయిన ఏ పార్టీ ప్రజలకైనా, ఏ ప్రశ్నలూ రావు.

'ఉమ్మడి పౌర స్మృతి' అనేది నిజంగా ఎప్పుడు సాధ్యం? 'ఉమ్మడి ఆర్థిక స్మృతి' అనేది ఉన్నప్పుడు! ఉమ్మడి ఆర్థిక స్మృతి అంటే: మానవుల మనుగడకు ఆధారమైన భూములూ, గనులూ, అడవులూ, పరిశ్రమలూ, రవాణా సాధనాలూ వంటి ఉత్పత్తి సాధనాలు, పౌరులందరి ఉమ్మడి ఆస్తిగా, అంటే, 'సమాజపు ఆస్తి' గా ఉన్నప్పుడు! అలా ఉంచే చట్టమే ఉమ్మడి ఆర్థిక స్మృతి! చిన్న పిల్లలూ, వృద్ధులూ, అనారోగ్యంతో వున్నవారూ తప్ప, ఇతర స్త్రీ–పురుషులందరూ, వేరు వేరు విలువలు కలిగిన, ఉత్పత్తి కార్యాలలో బాధ్యతలు కలిగి వుండే విధానమే ఉమ్మడి ఆర్థిక స్మృతి! ఆ విధానమే ఉమ్మడి పౌర స్మృతికి దారితీయగలదు!

శ్రమ దోపిడీని అనుమతించే వర్గ భేదాల రాజ్యాంగ పాలన వున్న చోట, తర్క రహిత మతాచారాలు జీవితాల్ని శాసిస్తూ వుంటాయి. సమానత్వం లేని శ్రమ విభజన వల్ల తలెత్తిన కుల వ్యవస్థ ఉన్నంతవరకూ, కుల కట్టుబాట్లూ, కులాచారాలూ, సమస్త కులాల పౌరుల్నీ ఎంతగానో లొంగదీస్తాయి! ఉమ్మడి ఆర్థిక వ్యవస్థ లేని సమాజంలో, దుర్భరమైన దారిద్ర్యం కారణంగా, స్త్రీలని భోగ్య వస్తువులుగా కొనడాలూ, అమ్మడాలూ వంటి 'వృత్తులు' పుట్టుకొచ్చి సాగుతున్నాయి. కేవలం ఉమ్మడి పౌర స్మృతి వల్ల, మతం గానీ, కులం గానీ, వ్యభిచారం వంటి 'వృత్తులు' గానీ మాయం అవుతాయా? ఉన్న అసమానతల మీద సంస్కరణలు కొంత ఉపశమనాన్ని ఇస్తాయి. నిజమే! కానీ, మౌలికమైన మార్పులు అత్యవసరమైన సమాజంలో, చిట్టి పొట్టి సంస్కరణలు స్థిరపడతాయా?


'ఉమ్మడి పౌర స్మృతి'ని వ్యతిరేకించే వారు, ముస్లిం ఆడకూతుర్లకూ ('ముసల్మాన్ బేటియా'), ముస్లింలలో వెనకబడ్డ 'పాస్మండా' కులాలకూ ద్రోహం చేస్తున్నారు– అని వాపోయింది ప్రధాని కరుణా హృదయం! మరి, మొన్న బిల్కిస్ బానోనీ, ఇతర ముస్లిం స్త్రీలనీ అత్యాచారాలకు గురిచేసిన నేరస్తుల్ని, బీజేపీ ప్రభుత్వం విడుదల చేయడం 'ముస్లిం బేటీయా'లకు ద్రోహం చేయడం అవలేదా?

వ్యాసకర్త సుప్రసిద్ధ రచయిత్రి

పక్కన పెట్టాలి!

ఓ సమస్య మనకు ఎదురైనప్పుడు, ఆ సమస్యను మనసులోనే పెట్టుకుంటే బుర్ర వేడెక్కిపోతుంది. దాని గురించే ఆలోచిస్తూనే కూర్చుంటే ఇక మెదడు మొద్దుబారిపోతుంది. కనుక వీలైనంత మేరకు సమస్యను అతిగా పట్టించుకోకుండా ఉండటం మనసుకూ, శరీరానికీ మంచిది. దీన్నే ఒక గురువుగారు తన శిష్యులకు పాఠంగా చెప్పారు.

గురువు ముందున్న బల్ల మీద ఓ గాజు పాత్ర ఉంది. అది ఖాళీది. దాన్ని పైకెత్తి 'దీని బరువెంతో చెప్పగలరా' అని శిష్యులను అడిగారు. ఓ విద్యార్థి ఒక జవాబు చెప్పాడు. మరో విద్యార్థి మరొక జవాబు ఇచ్చాడు. 'నా ప్రశ్న అది కాదు' అంటూ గురువు తన మాటలు కొనసాగించారు.



'దీన్ని నా అరచేతిలో ఓ అరగంటపాటు పెట్టుకుంటే ఏమవుతుంది?'

'ఏమీ అవదు' అని అందరూ ముక్త కంఠంతో చెప్పారు.

'ఓ గంట పాటు అలానే పెట్టుకుంటే?'

'చేయి నొప్పెడుతుంది' అన్నారు విద్యార్థులు.

'ఈ రెండు సందర్భాల్లోనూ దీని బరువు ఏదన్నా మారిందంటారా?' అని అడిగారు గురువు.

విద్యార్థులకు విషయం అర్థమైపోయింది. 'నా చేయి నొప్పెట్టకుండా ఉండటానికి ఏం చేయాలి?' అని గురువు అడగ్గానే, 'వెంటనే కింద పెట్టెయ్యాలి' అని జవాబిచ్చారు.

అదీ విషయం! ఓ సమస్యను పక్కన పెడితే తానుగా అది సరైపోతుందని వివరించారు గురువు.

– యామిజాల జగదీశ్

'ఈఈఎస్ఎల్' దక్షిణాది రాష్ట్రాల సలహాదారుగా చంద్రశేఖరరెడ్డి



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)కు సీనియర్ సలహాదారుగా ఎ.చంద్రశేఖరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్‌కపూర్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు చంద్రశేఖరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. పదేళ్ల పాటు రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈవోగా పనిచేసి ఈ ఏడాది మే 31న పదవీ విరమణ చేశారు. అంతకు ముందు రాష్ట్రంలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఏపీ ఎస్ఈసీఎం సీఈవోగా 5 సార్లు జాతీయ స్థాయిలో ఇంధన పొదుపు అవార్డులను గెలుచుకున్నారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య హయాంలో దాదాపు 9 ఏళ్ల పాటు ముఖ్యమంత్రి కార్యాలయంలో చీఫ్ పీఆర్వో, ప్రెస్ సెక్రటరీ టు చీఫ్ మినిస్టర్‌గా వ్యవహరించారు. కాగా హైదరాబాద్ కేంద్రంగా దక్షిణ భారతంలో తన కార్యకలాపాలను ఈఈఎస్ఎల్ నిర్వహించనుంది. ఈ కార్యాలయంలో నుంచి దక్షిణ భారతదేశంలో ఈఈఎస్ఎల్ చేపడుతున్న కార్యక్రమాలు, వ్యాపారాలను పర్యవేక్షించడంతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్-నికోబార్ దీవులలో కొత్త వ్యాపారాలు చేసేందుకు అవకాశాలను చంద్రశేఖరరెడ్డి పరిశీలించాల్సి ఉంటుంది. కాగా, ఏపీ విద్యుత్తు రంగంలో సేవలందించి కేంద్ర పదవిని పొందేలా తనను ప్రోత్సహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

'అసైన్డ్' హక్కుల నిర్ణయం హర్షణీయం

1,018వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకి చ్చిన 63,191.84 ఎకరాల అసైన్డ్, లంక భూముల విషయంలో 66,111 మందికి పూర్తి హక్కులు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,018వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధ వారం పలువురు మాట్లాడారు. పేదలకు సంక్షేమం అందించడంలో సీఎం వైఎస్ జగన్‌ను మించిన వారు ఎవరూ ఉండరని చెప్పారు. సీఆర్‌డీఏలో 47 వేల ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నుంచి వచ్చిన క్లియరెన్స్‌తో రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సీఎంకు పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వలంటీర్ వ్యవస్థ గురించి మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్‌కు పిచ్చెక్కిందని, వలంటీర్ వ్యవస్థలో 60 శాతం మంది మహిళలే ఉన్నారనే నిజం తెలియకుండా మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్‌కు తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. కేబినెట్ భేటీ సందర్భంగా సచివాలయానికి అటుగా వెళుతున్న సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల దీక్షా శిబిరం వద్ద వాహనాన్ని వేగం తగ్గించి చిరు మందహాసంతో ముకుళిత హస్తాలు జోడించి బహుజన పరిరక్షణ సమితి నాయకులకు అభివాదం చేశారు. నాయకులు ఇందుపల్లి సుభాషిణీ, పులి దాసు, మాదిగాని గురునాథం, న్యాయవాది పెరికే వరప్రసాద్, బి.సాంబయ్య పాల్గొన్నారు.

● తెలంగాణ

తుది ఉత్తర్వుల మేరకే ఎంబీబీఎస్ సీట్లు

సాక్షి, హైదరాబాద్: కొత్త మెడికల్ కాలేజీల్లో రిజర్వేషన్ల అంశంపై తుది తీర్పునకు లోబడే సీట్ల కేటాయింపు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతానికి పిటిషనర్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది. అలాగే వారి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించాలని అధికారులకు చెప్పింది. అయినా విభజన జరిగిన తర్వాత ఏపీ విద్యార్థులకు తెలంగాణలో రిజర్వేషన్ ఎలా ఇస్తారని న్యాయస్థానం సందేహం వ్యక్తం చేసింది. ఏదేమైనా పూర్తి వాదనలు విన్న తర్వాత తేలుస్తామని చెప్పింది. కొత్త మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జూలై 3న ఇచ్చిన జీవో 72ను కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

అద్దంకి పొలం.. ఖర్జూర 'ఫలం'

బాపట్ల జిల్లాలో 6.8 ఎకరాల్లో ఖర్జూరం సాగు

- దుబాయ్ నుంచి మొక్కల కొనుగోలు
- నాలుగో ఏటనుంచి 40 ఏళ్ల పాటు దిగుబడి
- అద్దంకి, బల్లికురవ, కొరిశపాడు మండలాలు సాగుకు అనుకూలం

పోషకాలు మెండుగా ఉండి చూడగానే నోరూరించే ఖర్జూరం అంటే ఇష్టపడనివారు ఎవరూ ఉండరు. ఎడారి పంట అయిన ఈ ఖర్జూరాన్ని మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికా దేశాల్లో ఎక్కువగా సాగు చేస్తారు. మనదేశంలో రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఖర్జూరం సాగుచేస్తున్నప్పటికీ మనం వినియోగించే ఖర్జూరంలో మెజారిటీ వాటా దిగుమతులే. దుబాయ్, సౌదీ, ఒమన్, ఖతర్, బహ్రెయిన్ వంటి దేశాలనుంచి భారత్ ఖర్జూరం దిగుమతి చేసుకుంటుంది. అయితే ఖర్జూరం పంటలో లాభదాయకతను గుర్తించిన దేశంలోని వివిధ ప్రాంతాల రైతులు ఇప్పుడిప్పుడే దీని సాగుపై మక్కువ చూపిస్తుండటంతో సాగు విస్తీర్ణం క్రమేపీ పెరుగుతోంది. మన రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో వాణిజ్య ప్రాతిపదికన ప్రారంభమైన ఖర్జూరం సాగు ప్రస్తుతం బాపట్ల జిల్లాకు విస్తరించింది.

అద్దంకి: బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, కొరిశపాడు మండలాల్లో సుమారు 6.8 ఎకరాల్లో రైతులు ఖర్జూరం పంట సాగు చేస్తున్నారు. అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో ఉప్పుటూరి చిరంజీవి అనే రైతు 2.5 ఎకరాల్లో నాణ్యమైన బర్హీరకం సాగుచేస్తున్నాడు. దుబాయ్ నుంచి మొక్కలు తెచ్చి విక్రయించే తమిళనాడు వ్యాపారి నిజాముద్దీన్ దగ్గర మొక్కలు కొనుగోలుచేసినట్లు చిరంజీవి చెప్పారు. వ్యవసాయంలో వినూత్న ప్రయోగాలు చేస్తేనే లాభం ఉంటుందని భావించి ఖర్జూరం సాగువైపు మొగ్గు చూపినట్లు తెలిపారు. చిరంజీవి తోట తోట ప్రస్తుతం నాలుగేళ్ల వయసులో ఉంది.



అనుకూలమైన నేలలివే..

సారవంతమైన తువ్వ (తెల్ల) నేల, గరప, నల్ల నేల, బంక నేలలతోపాటు, పీహెచ్ విలువ 8 నుంచి 10 వరకు ఉన్న చౌడు భూముల్లోనూ ఖర్జూరం సాగు చేసుకోవచ్చు. నీరు నిల్వ ఉండే నేలలు ఈ పంటకి అనుకూలంకాదు. ఖర్జూరం వేసవిలో కాపుకి వస్తుంది. ఉష్ణోగ్రత 25 నుంచి 40 డిగ్రీల వరకు ఉంటే మంచి దిగుబడి వస్తుంది. అధిక వర్షాలు, చలిగాలులు ఖర్జూరం పంటకు ఇబ్బందికరం. దీనివల్ల మొక్కలు తెగుళ్ల బారిన పడే అవకాశం ఉంటుంది.

నాటిన మూడేళ్లకు కాపు

ఈత జాతికి చెందిన ఖర్జూరం మొక్క నాటిన మూడేళ్లకు కాపుకి వస్తుంది. ఇందులో ఆడ, మగ మొక్కలు ఉంటాయి. 10 ఆడ మొక్కలకు ఒక మగ మొక్క అవసరం. సాలుకు సాలుకు మధ్య మొక్కకు మొక్కకు మధ్య 24 అడుగుల ఎడంతో ఎకరాకు 78 మొక్కలు నాటుకోవచ్చు. మగ మొక్కలు తోటకు చుట్టూ అంచు వరుసలో నాటుతారు. మగ మొక్కలు కండెకు వచ్చిన తరువాత ఆ పుప్పొడిని భద్రపరుస్తారు. ఖర్జూరం మొక్క డిసెంబర్‌లో పూతకు వస్తుంది. ఆడ మొక్కలు పూతకు రాగానే ఆ పూతపై మొగ మొక్కల నుంచి సేకరించిన పుప్పొడిని చల్లుతారు. పూసిన మూడు నుంచి నాలుగు నెలలకు కాయలు పక్వానికి వస్తాయి. ఐదు నెలలకు గెలలను కోసి విక్రయించుకోవచ్చు. ఖర్జూరం సాగుకు ఎకరాకు రూ.4 లక్షల వరకు వ్యయం అవుతుంది. మూడో ఏడాది నుంచి 40 ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. తొలి నాలుగేళ్ల దిగుబడి తక్కువగా ఉంటుంది. ఖర్జూరం మొక్కలు నాటిన నుంచి ఏడేళ్ల వరకు అంతరపంటలుగా పప్పు ధాన్యాలు, పశువుల మేత వంటివి సాగుచేసుకోవచ్చు. గుంటూరుకు చెందిన వ్యాపారి బర్హీ రకం కాయలను కిలో రూ.250 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు రైతు చిరంజీవి చెప్పారు. ఈ రకం ఖర్జూరాన్ని ప్రాసెస్ చేయకుండానే తినవచ్చని తెలిపారు.



తిమ్మాయపాలెం గ్రామంలో సాగు చేస్తున్న కర్జూరం

ఒక్కో మొక్క రూ.4,500

అద్దంకి ప్రాంతానికి బాగా అనుకూలమైన రకం బర్హీ. ఇందులో పసుపు, ఎరుపు రకాలు బాగా తియ్యగా ఉంటాయి. వీటిని తమిళనాడుకు చెందిన నిజాముద్దీన్ దుబాయ్ నుంచి తెప్పిస్తాడు. నెల పాటు తన వద్ద మొక్కలను పెంచి ఒక్కో మొక్క రూ.4,500 చొప్పున విక్రయిస్తాడు. అదే విధంగా రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల నుంచి కూడా మొక్కలు తెప్పించుకోవచ్చు. మొక్కల సంఖ్య, నాటే విధానం వివరాలు నర్సరీ నిర్వాహకుల నుంచి తెలుసుకోవచ్చు.



అనంతపురం రైతును స్ఫూర్తిగా తీసుకున్నా..



సంప్రదాయ వ్యవసాయ సాగులో ఏటా నష్టాలు వస్తున్నాయి. ఖర్జూరం సాగులో ఒక్కసారి పెట్టుబడి పెడితే నాలుగో సంవత్సరం నుంచి నలభై సంవత్సరాల వరకు ఎటువంటి దిగులు ఉండదు. అయితే ఖర్జూరం మొక్కలను మన దేశంలో టిష్యూ కల్చర్ చేయకపోవడంతో ఇతర దేశాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. దీంతో మొక్కల కొనుగోలుకు అధిక ఖర్చు అవుతోంది. ఉపాధి హామీ ద్వారా ఉద్యాన శాఖ పరిధిలో మొక్కలు ఇస్తే ఖర్జూరం సాగు మరింత పెరిగే అవకాశం ఉంది.

– చిరంజీవి, రైతు, తిమ్మాయిపాలెం

అధిక ఉష్ణోగ్రతలు అనుకూలం



ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఖర్జూరం సాగు చేసుకోవచ్చు. వేసవిలో వర్షాలు పడితే కాపు రాదు. బాపట్ల జిల్లాలో ఇప్పుడిప్పుడే కొంతమంది రైతులు ఖర్జూరం సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే మగ మొక్కల నుంచి పుప్పొడి సేకరించి, ఆడ మొక్కల పూతపై వేసే సాంకేతిక నైపుణ్యం ఉన్న వాళ్ల అవసరం. లేకపోతే రైతే ఆ పని నేర్చుకోవాల్సి ఉంటుంది. వాతావరణం అనుకూలిస్తే ఖర్జూరం సాగులో మంచి లాభాలు వస్తాయి.

– దీప్తి, అద్దంకి డివిజన్, ఉద్యానశాఖ అధికారి, బాపట్ల జిల్లా

'సురక్ష' శిబిరాల్లో 30.98 లక్షల వినతుల పరిష్కారం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాల్లో బుధవారం వరకు విద్యార్థులకు వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ సహా మొత్తం 30,98,697 వినతులను అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన వారు మిగిలి పోకూడదనే లక్ష్యంతో ప్రభుత్వమే వలంటీర్ల ద్వారా ఇంటింటా జల్లెడపడుతూ సర్వే నిర్వహించి, వారికీ పథకాలు అందజేసేందుకు జగనన్న సురక్ష పేరుతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పాఠశాల విద్య నుంచి పీహెచ్‌డీ వంటి వాటివరకు వివిధ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు జరిగే ఈ సమయంలో విద్యార్థులకు అవసరమయ్యే ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల నుంచి తీసుకునే 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఈ శిబిరాల్లో అప్పటికప్పుడే సర్వీసు చార్జీలు లేకుండా అందజేస్తున్నారు. జూలై 1న మొదలు పెట్టిన ఈ శిబిరాలు సచివాలయాల వారీగా ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇప్పటివరకు.. ఆదివారాలు మినహా 10 రోజులు 6,997 గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఈ శిబిరాలు నిర్వహించినట్లు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ అధికారులు వెల్లడించారు. ఈ శిబిరాల్లో మొత్తం 34,39,585 సర్వీసులకు సంబంధించి అధికారులకు వినతులు అందాయని తెలిపారు. వాటిలో 90 శాతానికి పైగా.. 30.98 లక్షల వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కారించారని పేర్కొన్నారు. వీటిలో హౌస్ హోల్డు జాబితాలో మార్పులు–చేర్పులతో పాటు విద్యార్థులకు ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల జారీ, కౌలు రైతులకు సీసీఆర్సీల జారీ వంటివి పెద్దసంఖ్యలో ఉన్నట్టు వివరించారు.

ఒక్కరోజే.. 5,54,009 వినతుల పరిష్కారం

ఇప్పటివరకు నిర్వహించిన శిబిరాల్లో మంగళవారం ఒక్కరోజే అత్యధికంగా 5,54,009 వినతులను అధికారులు పరిష్కరించారు. బుధవారం 573 గ్రామ, వార్డు సచివాలయాల వద్ద జరిగిన శిబిరాల్లో 2,44,582 మంది వినతులు పరిష్కరించారు.

సంస్కృతంతోనే భారతీయ సంస్కృతి మనుగడ

- కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్
- సంస్కృతమే ఆధునిక తరానికి దిక్సూచి: అసోం గవర్నర్ కటారియా
- తిరుపతిలో ప్రారంభమైన జాతీయ సంస్కృత సమ్మేళనం



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: సంస్కృత భాష ద్వారానే నేటికీ భారతీయ సంస్కృతి మనుగడ సాగిస్తోందని కేరళ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్ఎస్‌యూ)లో బుధవారం నుంచి శుక్రవారం వరకు 3 రోజుల పాటు జాతీయ సంస్కృత సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. మైసూరుకు చెందిన సంస్కృత ఫౌండేషన్, ఎన్ఎస్‌యూల సౌజన్యంతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, సాహిత్య అకాడమీ–న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి వేదికగా తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత ఎన్ఎస్‌యూ విరాజిల్లుతోందని, ఇక్కడ జాతీయ సంస్కృత సమ్మేళనాన్ని నిర్వహించడం సముచితమేనన్నారు. ఆదిశంకరాచార్యులు భారత్‌లోని నలుదిక్కులా 4 మఠాలను స్థాపించి తద్వారా సంస్కృత జ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేశారన్నారు. అంతకుముందు వర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను తిలకించారు. మధ్యాహ్నం నిర్వహించిన సంస్కృత భాష అష్టావధానానికి అసోం గవర్నర్ గులాబ్ చాంద్ కటారియా హాజరయ్యారు. భారతీయ సంస్కృతికి మూలం సంస్కృతమేనని, సంస్కృత భాషా అధ్యయనం అంటే భారతీయ సంస్కృతిని అధ్యయనం చేయడమేనన్నారు. సంస్కృత భాషని ఆధునిక తరానికి దిక్సూచిగా అభివర్ణించారు. సంస్కృత విద్వాంసులు అభిరాజ రాజేంద్ర మిశ్రా అధ్యక్షతన సంస్కృత భాషలో నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు, వర్సిటీ చాన్సలర్ గోపాలస్వామి, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి ఉమా నందూరి, అదనపు కార్యదర్శి రంజనా చోప్రా, టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, సాహిత్య అకాడమీ డిప్యూటీ కార్యదర్శి సురేష్‌బాబు, ఎన్ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, అవధాని మాడుగుల నాగఫణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మప్రచారకులు దండి స్వాములు ఇకలేరు



దండి స్వాములు (ఫైల్)

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ప్రముఖ హిందూ ధర్మ ప్రచారకులు, స్థానిక అష్టలక్ష్మీ పీఠం వ్యవస్థాపకులు దండి నిర్మలా నందగిరి స్వాములు(దండి స్వాములు) కన్నుమూశారు. పెదకాకాని మండలం నంబూరు కాశీ ఆశ్రమంలో బుధవారం తెల్లవారుజామున బ్రహ్మ ఐక్యం పొందారు. వీరి పార్థివ దేహాన్ని తెనాలి తరలించారు. ముందుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కుమార్ పంప్స్ ఆవరణలో కొంతసేపు ఉంచారు. భక్తుల సందర్శన అనంతరం కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయానికి తరలించారు. ఆలయం వెలుపల ప్రత్యేక వేదికపై ఉంచారు. వివిధ ఆశ్రమాలకు చెందిన స్వామీజీలు, పట్టణ పరిసరాలకు చెందిన భక్తులు దండి స్వాములకు శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం ఉదయం ఏడుగంటల నుంచి దండి స్వాములకు అభిషేకాల అనంతరం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమాధి స్థలి వద్ద అంతిమ సంస్కారాలు జరుగుతాయని శ్రీఅష్టలక్ష్మి ఆలయం ధర్మకర్త కొత్త సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రముఖ భగవద్గీతోపన్యాసకులుగా, వేదవేదాంగ పండితులుగా గుర్తింపును పొందిన దండి స్వాములు స్వస్థలం తెనాలి సమీపం వేమూరు నియోజకవర్గంలోని బోడపాడు. 1942లో ఆయన జన్మించారు. అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. 1957లో ఏర్పేడు వ్యాసాశ్రమ స్థాపకులు మలయాళ స్వాములు ఆధ్యాత్మిక ప్రచారం చేస్తూ.. ఆ గ్రామంలో మూడురోజులు బస చేశారు. ఆ సందర్భంగా వీరు స్వామివారిని సందర్శించారు. ఆయన అనుమతితో తన 15వ ఏట మంత్రదీక్షను స్వీకరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో భగవద్గీత ఉపన్యాసాలు చేశారు. 1974లో తెనాలి వచ్చి, గీతాప్రచార కార్యక్రమంలో స్థిరపడ్డారు. 1995 మార్చి 13న స్థానిక కొత్తపేటలో శ్రీఅష్టలక్ష్మీ దేవాలయానికి శంకుస్థాపన చేశారు. 1998 మార్చి 13న శ్రీచక్రసహిత, అష్టలక్ష్మి మూర్తులను ప్రతిష్ఠ చేశారు. ధర్మప్రచారమే లక్ష్యంగా జీవయాత్ర సాగించారు.

కాలుష్య రహిత భారతావని నిర్మాణమే లక్ష్యం

- గ్రీన్ హైడ్రోజన్ ఇంధనానిదే భవిష్యత్
- ఒక్కరోజే 3 లక్షల మొక్కలు నాటాం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



మొక్క నాటుతున్న కేంద్రమంత్రి గడ్కరీ, పక్కన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు

రేణిగుంట: కాలుష్య రహిత భారతావని నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ చెప్పారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కొత్తపాలెం పరిధిలోని జాతీయ రహదారి–71 పక్కన బుధవారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో గడ్కరీ మాట్లాడుతూ.. దేశంలో వాహనకారక కాలుష్యం 40 శాతం ఉందన్నారు. కాలుష్య నియంత్రణ భారతావని నిర్మాణం దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అన్నిరకాల కాలుష్యాలను నియంత్రించేందుకు బయో డీజిల్‌ను వాడుకలోకి తీసుకొస్తున్నట్టు స్పష్టం చేశారు. బయోడీజిల్ వాడకాన్ని పెంచేందుకు కార్యాచరణ సిద్ధమైందన్నారు. ఈ ఏడాది ఆగస్ట్‌లో బెంగళూరు నగరంలో ప్రయోగాత్మకంగా 'ఫ్లెక్స్–ఇంజిన్' విధానం ద్వారా పూర్తిగా బయోడీజిల్‌తో నడిచే వాహనాలను ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో బయోడీజిల్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామన్నారు. గ్రీన్ హైడ్రోజన్‌దే భవిష్యత్ అని పేర్కొన్నారు.

ఒక్కరోజే 3 లక్షల మొక్కలు

బుధవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల వెంబడి 300 ప్రాంతాల్లో 3 లక్షల మొక్కలు నాటినట్టు కేంద్రమంత్రి గడ్కరీ చెప్పారు. జాతీయ రహదారుల వెంబడి విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచడంతోపాటు కాలుష్యాన్ని నియంత్రించే అన్ని మార్గాలను ఉపయోగించుకుంటామన్నారు. నరికివేసిన ప్రతి చెట్టుకు రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్టు చెప్పారు. భారత జాతీయ రహదారుల సంస్థ పర్యావరణ సుస్థిరత, ఇంధన సంరక్షణ, కాలుష్య నియంత్రణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో తొమ్మిదేళ్ల స్వల్ప వ్యవధిలో జాతీయ రహదారులు రెట్టింపయ్యాయన్నారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ.. ఏపీలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.17 వేల కోట్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి నగరానికి మల్టీ ఫెసిలిటీ బస్‌స్టేషన్ మంజూరు అంశం పరిశీలించాలన్నారు. మంత్రి దాడిశెట్టి రాజా, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆర్ అండ్ బీ కార్యదర్శి ప్రద్యుమ్న పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు

- దర్శి ప్రమాద బాధితులకు ఆర్టీసీ ఎండీ పరామర్శ

పొదిలి: ప్రకాశం జిల్లా దర్శి వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల పరిహారం అందజేస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. పొదిలిలో బుధవారం ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షలతో పాటు క్షతగాత్రులకు పూర్తిస్థాయి వైద్య సేవలకు అయ్యే ఖర్చును అందజేస్తామని చెప్పారు.

17న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

తిరుమల: శ్రీవారి ఆలయంలో జూలై 17న సాలకట్ల ఆణివార ఆస్థానాన్ని నిర్వహించనున్నారు. ఆ రోజున ఉదయం బంగారువాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామిని గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై శ్రీవిష్వక్సేనులవారిని దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు పూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తిరుమల పెద్దజీయర్ స్వామి పెద్ద వెండితట్టలో 6 పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువస్తారు. వీటిలో నాలుగింటిని మూలమూర్తికి, ఒకటి మలయప్ప స్వామికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాద వస్త్రంతో 'పరివట్టం' (చిన్న పట్టు గుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరిస్తారు. ఆ తరువాత అర్చకులు పెద్ద జీయర్ స్వామికి, చిన్న జీయ్యర్ స్వామికి, టీటీడీ తరపున ఈవోకి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచుతారు. ఆణివార ఆస్థానం సందర్భంగా సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి పుష్పపల్లకీపై ఊరేగుతారు. ఈ కారణంగా జూలై 17న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

తిరుపతి మీదుగా పలు రైళ్ల రద్దు, మళ్లింపు

- తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ నేపథ్యంలో..

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఆధునీకీకరణ పనులు జరుగుతుండటంతో గురువారం నుంచి పలు రైళ్లు ఆగస్టు 12 వరకు రద్దు చేశారు. పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయగా..మరికొన్నింటికి రూట్ మార్పు చేసినట్లు రైల్వే వాణిజ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఖాజీపేట–తిరుపతి, తిరుపతి–చెన్నై సెంట్రల్, చెన్నై సెంట్రల్–సుబ్రహ్మణ్యంధాన్, అరక్కోణం–తిరుపతి రైళ్లు రద్దు చేసినట్లు చెప్పారు. హైదరాబాద్–తిరుపతి, కడప–విశాఖ, తిరుపతి–పాండిచ్చేరి, చెన్నై సెంట్రల్–తిరుపతి, చామరాజానగర్–తిరుపతి, రామేశ్వరం–తిరుపతి, కదిరి దేవరపల్లె–తిరుపతి, తిరుపతి–గుంతకల్లు, తిరుపతి–ఎస్ఎస్ఎస్‌హుబ్లీ, విల్లుపురం–తిరుపతి, పూర్ణ–తిరుపతి, భువనేశ్వర్–తిరుపతి, హౌరా–తిరుపతి రైళ్లను తాత్కాలికంగా తిరుపతి, పాకాల, రేణిగుంట, కాట్పాడి స్టేషన్ల మీదుగా వెళ్లవని వివరించారు. కాచిగూడ–మధురై, తిరువనంతపురం–హజరత్‌నిజాముద్దీన్, ఎర్నాకులం–హజరత్‌నిజాముద్దీన్, హతియా–ఎస్ఎంవీటీ బెంగళూరు రైళ్లు తిరుపతి, చిత్తూరు, పాకాల స్టేషన్లలో స్టాపింగ్ లేకుండా డైవర్ట్ చేశామని, తిరుపతి, పాకాల, చిత్తూరు ప్రయాణికులు కాట్పాడి, రేణిగుంట స్టేషన్లల్లో పై రైళ్లను ఎక్కాలని వివరించారు.

బీమా జ్యువెలరీస్‌లో 'డైమండ్'లపై ఆఫర్లు

● తెలంగాణ

పాలమూరుకు 'పర్యావరణ' కష్టాలు!

- అనుమతుల జారీ మళ్లీ వాయిదా
- మదింపు కమిటీ సమావేశం మినిట్స్ విడుదల
- పర్యావరణ పునరుద్ధరణకు ఇప్పటికే రూ.142 కోట్లు కేటాయించామన్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్ఓపీ ఆధారంగా మళ్లీ లెక్కలు వేయాలన్న కమిటీ

సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతుల జారీ ప్రక్రియ మళ్లీ వాయి దా పడింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని నిపుణుల మదింపు కమిటీ గత నెల 27న సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన మినిట్స్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం.. పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు చేపట్టడం వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని చక్కదిద్దడానికి (పర్యావరణ పునరుద్ధరణకు) రూ.142 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినట్టు రాష్ట్ర నీటిపారుదల శాఖ నివేదించింది. అయితే నష్ట నివారణ వ్యయాన్ని లెక్కించడంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను నీటిపారుదల శాఖ అనుసరించలేదని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. పర్యావరణానికి జరిగిన నష్టం విలువ, నష్ట నివారణ చర్యల వ్యయం, సామాజిక ప్రభావ నివారణ చర్యల వ్యయాలను ఎస్ఓపీ ఆధారంగా మళ్లీ లెక్కించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కాగా రూ.55,086.57 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు, ఇప్పటికే రూ.21,200 కోట్లు ఖర్చు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ శాఖకు తెలియజేసింది. ప్రాజెక్టు ద్వారా 6 జిల్లాల్లోని 70 మండలాల పరిధిలో మొత్తం 8,83,945 హెక్టార్లకు సాగునీరు అందుతుందని, సత్వరం పర్యావరణ అనుమతులు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది.

గత నవంబర్‌లోనే ఉల్లంఘనల నిర్ధారణ

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం..పర్యావరణ ప్రభావం మదింపు (ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్/ఈఐఏ) నోటిఫికేషన్ 2006ను ఉల్లంఘించినట్టు గతేడాది నవంబర్ 14న జరిగిన సమావేశంలో కమిటీ నిర్ధారించింది. వాస్తవానికి ఇలాంటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల జారీ విషయంలో అనుసరించాల్సిన ఎస్ఓపీని 2021లో కేంద్ర పర్యావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ప్రతిపాదనలను సైతం ఎస్ఓపీ ఆధారంగా మదింపు నిర్వహించాలని అప్పట్లో నిపుణుల కమిటీ నిర్ణయించింది. దీంతో ఎస్ఓపీ అమలులో భాగంగా.. అనుమతులు లేకుండా పనులు చేపట్టడంతో పర్యావరణానికి జరిగిన నష్టాన్ని చక్కదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.6124.36 కోట్లతో పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ)ని సిద్ధం చేసింది. అందులో రూ.142.49 కోట్లను పర్యావరణ పునరుద్ధరణకు కేటాయించింది. అయితే వీటిని లెక్కించే విషయంలో ఎస్ఓపీని పాటించలేదని నిర్ధారించిన నిపుణుల కమిటీ మళ్లీ కొత్తగా అంచనాలు రూపొందించాలని ఆదేశించింది. పర్యావరణ అనుమతులు లేకుండా 90 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంపై గతంలో ఎన్జీటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రూ.528 కోట్లను పర్యావరణ పరిహారంగా కృష్ణా బోర్డుకు చెల్లించాలని అప్పట్లో ఆదేశాలివ్వగా దీనిపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది.

42.76 లక్షల ఎకరాల్లో పంటల సాగు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలంలో 42.76 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, 42.76 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వాస్తవంగా గతేడాది వానాకాలం సీజన్లో ఇదే సమయానికి 53.79 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే ఏకంగా 11 లక్షల ఎకరాలు తక్కువగా ఈసారి పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. సీజన్ ఆలస్యం కావడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 31.91 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.95 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఇక పప్పుధాన్యాల సాధారణ విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.88 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 3.19 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.68 లక్షల ఎకరాల్లో సాగైంది.

క్లుప్తంగా...

తూర్పు నిజాముద్దీన్‌లో రాహుల్ ఇల్లు, ఆఫీసు!

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్నేయ ఢిల్లీలోని తూర్పు నిజాముద్దీన్ ప్రాంతంలో తన నివాసం, కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. నివాసం, కార్యాలయం ఒకే ప్రాంగణంలో ఉంటాయని తెలిపాయి. రాహుల్ ప్రస్తుతం తన తల్లి సోనియా గాంధీ అధికారిక నివాసమైన 10, జన్‌పథ్‌లో ఉంటున్నారు. పరువు నష్టం వ్యాజ్యాల కేసులో జైలు శిక్ష పడడం, తద్వారా లోక్‌సభ సభ్యత్వం కోల్పోవడంతో 12, తుగ్లక్ లేన్‌లోని ఇంటిని ఆయన ఖాళీ చేయాల్సి వచ్చింది.

బెంగాల్ స్థానిక ఎన్నికల్లో తృణమూల్ హవా

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) ఘన విజయం దిశగా దూసుకుపోతోంది. 63,229 గ్రామ పంచాయతీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, టీఎంసీ ఇప్పటిదాకా 34,913 సీట్లు గెలుచుకుంది. మరో 607 స్థానాల్లో ముందంజలో ఉంది. ప్రతిపక్ష బీజేపీ 9,722 సీట్లు సాధించింది. కాంగ్రెస్‌కు 2,543, సీపీఎంకు 2,937 సీట్లు లభించాయి. టీఎంసీ 6,430 పంచాయతీ సమితి సీట్లు కైవసం చేసుకుంది. మరో 195 సీట్లలో లీడింగ్‌లో ఉంది. అలాగే 674 జిల్లా పరిషత్ స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. ఓట్ల లెక్కింపు ఇంకా పూర్తి కాలేదు. స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు సందర్భంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో హింస చోటుచేసుకుంది.



ప్రఖ్యాత జేమ్స్ వెబ్ అంతరిక్ష టెలిస్కోప్ పంపిన నక్షత్రాల ఆవిర్భావం తాలూకు తాజా చిత్రమిది. రోహో ఒఫియోకీగా పిలిచే ఈ ప్రాంతానికి సంబంధించి ఇప్పటివరకు తీసిన అత్యంత స్పష్టమైన ఫొటో ఇదే. ఈ ప్రాంతం భూమికి 390 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. జేమ్స్ వెబ్ పని చేయడం మొదలై బుధవారానికి ఏడాది పూర్తైంది.

ప్రభుత్వాన్నే ముంచేసిన.. వలసల వరద..

నెదర్లాండ్స్ ప్రభుత్వ పతనం యూరప్ రాజకీయాల్లో కీలక మలుపు

వలసలే కేంద్రంగా కొత్త రూపు సంతరించుకుంటున్న రాజకీయాలు



నెదర్లాండ్స్‌లోకి వలసలను కట్టడి చేసేందుకు ప్రధాని మార్క్ రుట్టె ప్రతిపాదించిన కఠినతరమైన వలసల విధానం చివరికి ఆయన ప్రభుత్వానికే ఎసరు తెచ్చింది. పాలక సంకీర్ణంలోని మిగతా మూడు భాగస్వామ్య పార్టీలూ ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతో రుట్టె రాజీనామా చేశారు. అయితే, భాగస్వాముల మాటకు తలొగ్గి రాజీ పడేకంటే దీర్ఘకాలిక స్వీయ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్న దూరదృష్టి ఆయన నిర్ణయంలో ప్రతిఫలించిందని పరిశీలకులు భావిస్తున్నారు. అంతేగాక యూరప్‌లో వలసల సమస్య నానాటికీ ఎంత తీవ్రతరంగా మారుతోందో, అక్కడి రాజకీయాలను ఎంతగా ప్రభావితం చేస్తోందో, దీన్ని రైట్ వింగ్ పార్టీలు సొమ్ము చేసుకోకుండా ఆపడం ప్రధాన పార్టీలకు ఎంత కష్టతరంగా పరిణమిస్తోందో ఈ ఉదంతం మరోసారి తేటతెల్లం చేసిందని చెబుతున్నారు.



యూరప్‌లోని అత్యంత ధనిక దేశాల్లో నెదర్లాండ్స్‌ది నాలుగో స్థానం

నెదర్లాండ్స్‌లోకి వలసల సంఖ్య గతేడాది ఏకంగా మూడో వంతు పెరిగి 47 వేలు దాటేసింది! దాంతో ప్రధాని రుట్టె కట్టడి చర్యలను ప్రతిపాదించాల్సి వచ్చింది.

ఈసారి దేశంలోకి శరణార్థుల సంఖ్య ఏకంగా 70 వేలు దాటొచ్చని అంచనా.

వలసదారుల దెబ్బకు చాలా యూరప్ దేశాల్లో మాదిరిగానే నెదర్లాండ్స్‌లో కూడా ఇళ్ల ధరలు, అద్దెలు అందుబాటులో లేకుండా పోతున్నాయి.

ఇదేగాక పెరుగుతున్న వలసల వల్ల అనేకానేక సమస్యలతో నెదర్లాండ్స్ సతమతమవుతోంది.

నవంబర్‌లో జరుగుతాయని భావిస్తున్న ఎన్నికల్లో అన్ని పార్టీలకూ ఇది అది పెద్ద ప్రచారాంశంగా మారినా ఆశ్చర్యం లేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

ఇప్పుడిక నెదర్లాండ్స్ రాజకీయంగా ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

రుట్టె కేంద్రంగా...



- నెదర్లాండ్స్‌లో వలసలపై నెలకొన్న తాజా సంక్షోభం ప్రధాని రుట్టె సంప్రదాయ వైఖరి కారణంగానే ముదురు పాకాన పడింది.
- 13 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న రుట్టె, దీన్ని కూడా అందివచ్చిన అవకాశంగానే మలచుకుని వెంటనే రాజీనామా చేశారు.
- ఇటీవల బలం పుంజుకుంటున్న రైట్‌వింగ్ పార్టీల దూకుడుకు అడ్డుకట్ట వేయడంతో పాటు దేశ ప్రయోజనాలు కాపాడేందుకు అధికారాన్ని కూడా తృణప్రాయంగా వదులుకున్నారన్న ఇమేజీ సాధించి ఒక్క దెబ్బకు రెండు పిట్టలు కొట్టే లక్ష్యంతోనే ఆయన రాజీనామా చేసినట్టు కనిపిస్తోంది.
- రైట్ వింగ్ పార్టీలతో ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రశ్నే లేదని కుండబద్దలు కొట్టడం ద్వారా రుట్టె తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పారు.
- అంతేగాక రాజీనామా ద్వారా యూరప్ యవనికపై వలసల కట్టడి కోసం గళమెత్తుతున్న బలమైన నేతగా రుట్టె ఆవిర్భవించారు.
- యూరప్‌లోకి వలసల కట్టడికి సంయుక్త ఈయూ బోర్డర్ ఏజెన్సీ వంటివాటి ఏర్పాటును కూడా కొంతకాలంగా ఆయన ప్రతిపాదిస్తున్నారు. అయితే రాజీనామా ద్వారా దేశ ప్రయోజనాల కంటే స్వీయ రాజకీయ ప్రయోజనాలకే ఆయన పెద్దపీట వేసుకున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి!

> 'కేవలం ప్రతిపాదిత వలస విధానంపై విభేదాల వల్ల ఏకంగా పాలక సంకీర్ణమే కుప్పకూలడం నమ్మశక్యం కాని నిజం! ఏదేమైనా రాజీనామా నిర్ణయం ప్రధాని రుట్టె రాజకీయ చతురతకు అద్దం పట్టింది'
> - మార్సెల్ హనెగ్రాఫ్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, యూనివర్సిటీ ఆఫ్ ఆమ్‌స్టర్‌డామ్

ఏమిటీ ప్రతిపాదిత విధానం...

ప్రధానంగా, నెదర్లాండ్స్‌లో నివసిస్తున్న వలసదారుల పిల్లలకు వలసదారులుగా గుర్తింపు ఇచ్చేందుకు కనీసం రెండేళ్ల వెయిటింగ్ పీరియడ్ ఉండాలని ప్రధాని రుట్టె ప్రతిపాదించారు. దీన్ని సంకీర్ణ భాగస్వాములు తీవ్రంగా వ్యతిరేకించారు.


యూరప్‌కు పెనుభారంగా వలసలు...

- ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం తదితర కారణాలతో యూరప్ దేశాలకు కొన్నేళ్లుగా వలసలు భారీగా పెరుగుతున్నాయి.
- 2015లో సిరియా నుంచి శరణార్థులు వెల్లువెత్తిన నాటి నుంచీ ఈ ధోరణి నానాటికీ పెరుగుతూనే ఉంది.
- కానీ ద్రవ్యోల్బణం తదితరాలతో అసలే ధరాభారం, జీవన వ్యయం నానాటికీ పెరిగిపోతున్న సమయంలో ఈ వలసలు క్రమంగా యూరప్ దేశాలకు తలకు మించిన భారంగా మారుతున్నాయి.
- దీన్ని అవకాశంగా మలచుకుంటూ పలు యూరప్ దేశాల్లో రైట్ వింగ్ పార్టీలు శరణార్థుల పక్షం వహిస్తుండటంతో యూరప్ రాజకీయాలే కీలకమైన, అనూహ్యమైన మలుపు తిరుగుతున్నాయి. చాలా దేశాల్లో ఇప్పటికే రాజకీయాలను నిర్దేశించే స్థాయికి చేరుకున్నాయి కూడా.
- ఏళ్లుగా పాతుకుపోయిన సంప్రదాయ పార్టీలకు ఈ రైట్ వింగ్ పార్టీల ఎదుగుదల పెను సవాలుగా మారుతోంది.
- జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, హంగరీ మొదలుకుని చిన్నా పెద్దా యూరప్ దేశాలన్నింట్లోనూ ఇదే పరిస్థితి!
- దాంతో రైట్ వింగ్ పార్టీలకు ముకుతాడు వేసేందుకు సంప్రదాయ పార్టీలన్నీ చేతులు కలుపుతున్న కొత్త ధోరణి కూడా కొన్ని దేశాల్లో ఇప్పటికే మొదలైంది.

-సాక్షి, నేషనల్ డెస్క్

నేటి నుంచి ఫ్రాన్స్‌లో...
ప్రధాని మోదీ పర్యటన

పలు కీలక ఆయుధ ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేటి నుంచి రెండు రోజులపాటు ఫ్రాన్స్‌లో పర్యటించనున్నారు. అధికారిక పర్యటన వివరాలు బుధవారం వెల్లడయ్యాయి. పారిస్ నగరంలో జూలై 14వ తేదీన జరిగే బాస్టిల్ డే పరేడ్‌లో ప్రధాని మోదీ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. ఈ కవాతులో భారత త్రివిధ దళాలకు చెందిన బృందం పాల్గొననుంది. ప్రధాని అయ్యాక మోదీ ఫ్రాన్స్‌లో పర్యటించడం ఇది ఐదోసారి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు మోదీ అక్కడ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మాక్రాన్ మోదీకి ఫ్రాన్స్ అధికార విందుతోపాటు ప్రత్యేక ఆతిథ్య విందు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఇరుదేశాల అగ్రనేతలు విస్తృతస్థాయి అంశాలపై చర్చలు జరపనున్నారు. తర్వాత ఫ్రాన్స్ సెనేట్, నేషనల్ అసెంబ్లీ అధ్యక్షులనూ మోదీ కలుస్తారు. అక్కడి భారతీయులనుద్దేశించి ప్రసంగిస్తారు. ఫ్రాన్స్ పారిశ్రామికవేత్తలు, భారతీయ సీఈవోలు, అక్కడి ప్రముఖులను కలుస్తారు. 'ఇండియా–ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆరంభమైన ప్రధాని మోదీ పర్యటన ఇరుదేశాల భిన్నరంగాల భాగస్వామ్యాన్ని కొత్త పుంతలు తొక్కించనుంది' అని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. సాంస్కృతిక, శాస్త్రీయ, విద్య, ఆర్థిక, రక్షణ రంగాల్లో పరస్పర భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ' నేవీ వేరియంట్ 26 రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలుతోపాటు ఇరుదేశాలు సంయుక్తంగా విమాన ఇంజిన్‌ను భారత్‌లో తయారుచేసే ఒప్పందం ఖరారుకావచ్చు' అని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ ఖ్వాత్రా చెప్పారు. ఫ్రాన్స్ గణతంత్ర వేడుకలుగా భావించే బాస్టిల్ డే కవాతులో పాల్గొనేందుకు ఇప్పటికే 269 మంది సభ్యుల త్రివిధ దళ బృందం సీ–17 గ్లోబ్‌మాస్టర్ యుద్ధ సరుకు రవాణా విమానంలో పారిస్‌కు చేరుకుంది. ఛాంప్స్ ఎలీసెస్ చారిత్రక ప్రాంత గగనతలంలో ఫ్రెంచ్ యుద్ధవిమానాలకు తోడు భారత రాఫెల్ ఫైటర్‌జెట్‌లు ఫ్లైపాస్ట్‌లో పాల్గొననున్నాయి.

తిరుగుప్రయాణంలో యూఏఈలో పర్యటన

ఫ్రాన్స్ పర్యటన తర్వాత తిరుగుప్రయాణంలో జూలై 15వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో పర్యటించనున్నారు. యూఏఈ అధ్యక్షులు, అబుదాబీ పాలకుడు అయిన షేక్ మొహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌తో ఈ సందర్భంగా మోదీ భేటీ కానున్నారు. సంస్కృతి, ఇంధనం, ఆహార భద్రత, రక్షణ, ఫిన్‌టెక్, విద్య, ఆరోగ్య రంగాల్లో ద్వైపాక్షిక ఒప్పందాలను మరింత పటిష్టం చేసుకోవడంపై ఇరుదేశాధినేతలు చర్చించనున్నారు. 'కాప్–28కు యూఏఈ, జీ20కి భారత్ సారథ్యం వహిస్తున్న ఈ తరుణంలో అగ్రనేతలు అంతర్జాతీయ అంశాలపైనా చర్చలు జరపనున్నారు' అని భారత విదేశాంగ శాఖ తెలిపింది.

సబ్సిడీ ధరలకు టమాటాలు

విక్రయించనున్న కేంద్రం
- ఢిల్లీసహా పలు నగరాల్లో రిటైల్‌గా అమ్మకం
- వినియోగదారులకు సాయపడనున్న కేంద్రం
- ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి టమాటాల సేకరణ

సాక్షి, న్యూఢిల్లీ: వంట గదిలో టమాటా ధరల నిప్పు రాజేస్తున్న తరుణంలో ప్రజలకు కాస్తయినా ఉపశమనం కల్పించాలని మోదీ సర్కార్ భావిస్తోంది. ఇందులోభాగంగా టమాటాలను భారీ ఎత్తున సేకరించి పలు పట్టణాల్లో తక్కువ ధరకు రిటైల్‌గా అమ్మాలని నిర్ణయించింది. ఇలా తొలిసారిగా దేశరాజధానిలో రిటైల్‌గా విక్రయాలు మొదలుకానుండటం విశేషం. ఇందుకోసం తక్షణం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి టమాటాలను కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య(నాఫెడ్), జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య(ఎన్‌సీసీఎఫ్)లను కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ శుక్రవారం నుంచి ఢిల్లీ–దేశ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్)లో రిటైల్ కేంద్రాల ద్వారా తక్కువ ధరలకు విక్రయిస్తారు. అఖిల భారత స్థాయి ధరల సూచిక సగటుకు మించి గత నెల రోజులుగా ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరోజు రేటుకు కనీసం 30 శాతం డిస్కౌంట్ ధరకు టమాటాలను విక్రయిస్తారు. 'ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్‌లలో విక్రయాలు మొదలుకానున్నాయి. పట్నా, వారణాసి, కాన్పూర్, కోల్‌కతాలో సొంత రిటైల్ కేంద్రాలు లేదా స్థానిక ఒప్పందాల ద్వారా విక్రయిస్తాం' అని వినియోగదారుల శాఖ కార్యదర్శి రోహిత్ సింగ్ చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లె (చిత్తూరు) నుంచి సహేతుకమైన పరిమాణంలో టమాటా వస్తోంది. గుజరాత్, మధ్యప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలకు టమాటా మహారాష్ట్రలోని సతారా, నారాయణగావ్, నాసిక్ నుంచి సరఫరా అవుతోంది. కొత్త పంట దిగుబడి నేపథ్యంలో త్వరలోనే ధరలు దిగొస్తాయని అధికారులు హామీ ఇస్తున్నారు.



ప్రపంచంలోనే అత్యంత భారీ పుష్పమిది. దీని పేరు అమోర్‌ఫోఫాలస్ టైటానియం. ఫ్రాన్స్‌లోని విల్లెర్స్ లెస్ నాన్సీ నగరంలో ఇటీవల ఈ పుష్పం దాదాపు రెండు మీటర్ల ఎత్తు పెరిగి వికసించి చూపరులను ఆకట్టుకుంటోంది. దగ్గరికెళితే కుళ్లిపోయిన మాంసం వాసన కంపు కొడుతోంది.



ఢిల్లీలో ముంపు ప్రాంతం నుంచి ఫ్లైఓవర్ మీదకు చేరుకుంటున్న స్థానికులు



హిమాచల్‌లోని మండీలో పూర్తిగా ధ్వంసమైన వంతెన

యమున ఉధృతి

ఢిల్లీలో 207.71 మీటర్లకు చేరిన నీటిమట్టం
- నగర చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు
- జల దిగ్బంధంలో సమీప ప్రాంతాలు
- ఉత్తరాదిన వర్ష బీభత్సం

న్యూఢిల్లీ: ఢిల్లీలో జల ప్రళయం కొనసాగుతూనే ఉంది. ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో యమునా నది మరింత ఉధృతరూపం దాల్చింది. నదిలో నీటిమట్టం బుధవారం 207.71 మీటర్లకు చేరింది. ఢిల్లీ చరిత్రలో ఇదే ఆల్‌టైమ్ రికార్డు. 1978లో 207.49 మీటర్ల నీటిమట్టం నమోదైంది. నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఢిల్లీ నీటి పారుదల, వరద నియంత్రణ విభాగం సూచించింది. బుధవారం నది సమీపంలోని ప్రాంతాలు నీట మునిగాయి. ప్రభుత్వ అధికారులు వేలాది మందిని సురక్షిత ప్రాతాలకు తరలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రత దృష్ట్యా ఢిల్లీ ప్రభుత్వం 144 సెక్షన్ విధించింది.

అమిత్ షాకు కేజ్రీవాల్ లేఖ

ఢిల్లీలో వరద ఉధృతి పెరుగుతోందని, యమునలో నీటిమట్టం మరింత పెరగకుండా చర్యలు తీసుకొనే విషయంలో సహకారం అందించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశ రాజధానిలో భీకర వరదలు రావడం ప్రపంచానికి మంచి సందేశం కాదని చెప్పారు. జీ–20 సదస్సుకు త్వరలో ఢిల్లీ ఆతిథ్యం ఇవ్వబోతోందని గుర్తుచేశారు. ఈ మేరకు ఆయన బుధవారం కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. హరియాణాలోని హత్రీకుండ్ బ్యారేజీ నుంచి నీటి విడుదలను తగ్గిస్తే ఢిల్లీలో వరదలు తగ్గుముఖం పడతాయని సూచించారు. ఢిల్లీ ప్రజలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. యమునా నదిలో నీటిమట్టం 207.72 మీటర్లకు చేరే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అంచనా వేసిందని తెలిపారు. అదే జరిగితే భారీ నష్టం వాటిల్లుతుందని కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న జల ప్రవాహమే ఇందుకు కారణమని ఆయన ట్వీట్ చేశారు.

హిమాచల్‌లో 88 మంది మృతి

హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నంకల్లా రాష్ట్రంలో వర్షాలు, వరదల వల్ల మృతి చెందినవారి సంఖ్య 88కి చేరింది. మరో 16 మంది గల్లంతయ్యారు. 100 మంది క్షతగాత్రులయ్యారు. పెద్ద సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. పశువుల కొట్టాలు కూలిపోయాయి. మరోవైపు పంజాబ్, హరియాణాలో మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలు కొంత తగ్గుముఖం పట్టాయి. రెండు రాష్ట్రాల్లో మృతుల సంఖ్య 18కు చేరుకుంది. హరియాణాలో చాలా ప్రాంతాలు జలమయంగా మారాయి. పంజాబ్‌లో 10,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లో వర్షాల కారణంగా గత 24 గంటల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

తైవాన్ దిశగా చైనా నౌకలు, యుద్ధ విమానాలు

తైపీ: తైవాన్‌పై కన్నేసిన డ్రాగన్ దేశం చైనా దుందుడుకు చర్యలకు పాల్పడుతోంది. మంగళవారం, బుధవారం పెద్ద సంఖ్యలో నావికాదళం నౌకలను, ఫైటర్ జెట్లు, బాంబర్లతో కూడిన యుద్ధ విమానాలను తైవాన్ దిశగా పంపించింది. ఈ విషయాన్ని తైవాన్ రక్షణ శాఖ వెల్లడించింది. చైనా తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శత్రువుల దండయాత్ర నుంచి తనను తాను కాపాడుకోవడమే లక్ష్యంగా తైవాన్ ప్రతిఏటా నిర్వహించే సైనిక విన్యాసాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో చైనా తన నౌకలను, యుద్ధ విమానాలను తైవాన్ దిశగా నడిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా ప్రజా విముక్తి సైన్యం(పీఎల్ఏ) మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం వరకూ 38 యుద్ధ విమానాలను, 9 నౌకలను తైవాన్ వైపు మళ్లించింది. అంతేకాకుండా మరో 30 విమానాలు దూసుకొచ్చాయి. ఇందులో జె–10, జె–16 ఫైటర్ జెట్లు కూడా ఉన్నాయి. ఇందులో కొన్ని విమానాలు చైనా–తైవాన్ మధ్య జలసంధిలో అనధికారిక సరిహద్దు అయిన మిడ్‌లైన్‌ను దాటి ముందుకెళ్లినట్లు సమాచారం. చైనాకు చెందిన హెచ్–6 బాంబర్లు కూడా దక్షిణ తైవాన్ సమీపంలో సంచరించినట్లు తెలుస్తోంది. తైవాన్ తమ దేశంలో అంతర్భాగమేనని డ్రాగన్ చెబుతోంది. ఎప్పటికైనా కలిపేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

నియంత్రించాం.. నష్టపోతున్నాం: స్టాలిన్

చెన్నై: దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణతో ఆయా రాష్ట్రాలు నియోజకవర్గాలను కోల్పోతున్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. స్టాలిన్ తాజాగా 'ది వీక్' వార్తాసంస్థతో ప్రత్యేకంగా మాట్లాడారు. ' దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలుచేస్తూ దేశానికి మేలుచేస్తున్నాయి. కానీ అదేసమయంలో ఈ ప్రాంతంలో జనాభా క్షీణించడంతో నియోజకవర్గాల సంఖ్య తగ్గుతోంది. ఈ పరిణామం దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద నష్టం. ఉత్తరాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పథకాలను సరిగా అమలుచేయలేక చేతులెత్తేశాయి. అయినాసరే ఎక్కువ లోక్‌సభ స్థానాలను దక్కించుకోనున్నాయి. తమకు ఓటు వేయని దక్షిణాది రాష్ట్రాలపై పగ తీర్చుకునేందుకు ఈ 'జనాభా ప్రాతిపదికన సీట్లు' విధానాన్ని అమలుచేయాలని బీజేపీ భావిస్తోంది. ఈసారి ఎన్నికల్లో గెలిస్తే దీనిని అమలుచేసేందుకు బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. అయినాసరే ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీల మధ్య బేదాభిప్రాయాలు తుడిచిపెట్టుకుపోతాయి. ప్రతిపక్షానికి ఏకైక నిర్వచనంగా కాంగ్రెస్ అవతరిస్తుంది. దేశానికి సరికొత్త నమ్మకంగా రాహుల్ గాంధీ నిలిచారు' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

విపక్షాల రెండో సమావేశానికి 24 పార్టీలు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు ఒక్కతాటిపైకి వస్తున్నాయి. ప్రతిపక్ష కూటమి మరింత విస్తరిస్తోంది. భాగస్వామిగా చేరేందుకు మరిన్ని పార్టీలు ముందుకొస్తున్నట్లు తెలుస్తోంది. విపక్ష నేతలు జూన్ 23న బిహార్ రాజధాని పట్నాలో సమావేశమయ్యారు. ఈ భేటీలో 15 పార్టీల నాయకులు పాల్గొన్నారు. ప్రతిపక్షాల రెండో కీలక సమావేశం ఈ నెల 17, 18 తేదీల్లో బెంగళూరులో జరుగనుంది. ఈ సమావేశానికి హాజరు కావాలంటూ 24 పార్టీల నాయకులకు నిర్వాహకులు ఆహ్వానం పంపారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ హాజరుకానున్నారు. విపక్షాల రెండో సమావేశంలో ఎండీఎంకే, కేడీఎంకే, వీసీకే, ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్(జోసెఫ్), కేరళ కాంగ్రెస్(మణి) తదితర పార్టీల నాయకులు పాల్గొంటారని సమాచారం. ఆహ్వానం అందుకున్న 24 పార్టీలకు లోక్‌సభలో ప్రస్తుతం 150 మంది సభ్యులు ఉన్నారు.

రష్యా లెఫ్టినెంట్ జనరల్ మృతి

కీవ్: ఉక్రెయిన్ సైన్యం దాడిలో రష్యాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉక్రెయిన్ సేనల క్షిపణి దాడిలో రష్యా లెఫ్టినెంట్ జనరల్ ఒలెగ్ యూరివిజ్ త్సొకోవ్ మరణించారు. ఉక్రెయిన్‌లోని బెర్డియాన్స్క్ నగరంలో తాజాగా ఈ ఘటన జరిగింది. బ్రిటన్ సరఫరా చేసిన స్ట్రామ్ షాడో క్షిపణిని ప్రయోగించి రష్యా సైనిక ఉన్నతాధికారిని అంతం చేయడం గమనార్హం. బెర్డియాన్స్క్ ఎ ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉంది. సిటీలోని ఓ హోటల్‌లో రష్యా సైనిక కమాండర్లు ఉంటున్నారు. ఉక్రెయిన్ క్షిపణి దాడిలో ఈ హోటల్ నేలమట్టమైనట్లు సమాచారం. ఇక్కడికి సమీపంలోనే రష్యాకు చెందిన యాంటీ మిస్సైల్ డిఫెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ క్షిపణి దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉ.కొరియా క్షిపణి కవ్వింపులు

సియోల్: అమెరికా, దక్షిణ కొరియాలను హెచ్చరిస్తూ ఉత్తరకొరియా మరోమారు ఖండాతర క్షిపణిని పరీక్షించింది. తమ భూభాగంపై గగనతల నిఘా కార్యకలాపాలు కొనసాగిస్తే ఆ విమానాలను కూల్చేస్తామని అమెరికాను ఉ.కొరియా హెచ్చరించిన రెండ్రోజులకే ఇలా ఖండాతర క్షిపణి(ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్–ఐసీబీఎం)ని ప్రయోగించడం గమనార్హం. ఉ.కొరియా గత మూడు నెలల్లో ఐసీబీఎంను పరీక్షించడం ఇదే తొలిసారి. కాగా బుధవారం ప్రయోగించిన క్షిపణి అధునాతనమైనదిగా రక్షణరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో హవసాంగ్–18 క్షిపణిలో ద్రవ ఇంధనం వాడగా ఈసారి ఘన ఇంధనం వాడినట్లు తెలుస్తోంది. ప్రయోగించాక జాడ గుర్తించడంగానీ, మార్గమధ్యంలో అడ్డుకోవడంగానీ కష్టమని నిపుణులు హెచ్చరించారు.

42 చట్టాల్లో సవరణలకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: 19 మంత్రిత్వ శాఖలకు చెందిన 42 చట్టాలకు సంబంధించి 183 నిబంధనల్లో సవరణలు చేయడానికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలియజేసింది. వీటిలో జన విశ్వాస్(అమెండ్‌మెంట్ ఆఫ్ ప్రొవిజన్స్) బిల్లు–2023 ఉంది. ఈ బిల్లు ప్రకారం చిన్నచిన్న నేరాలను ఇక నేరాలుగా పరిగణించరు. సవరణలు ప్రతిపాదించిన చట్టాల్లో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్–1940, ఫార్మసీ యాక్ట్–1948, కాపీరైట్ యాక్ట్–1957, సినిమాటోగ్రఫీ యాక్ట్–1952, మోటార్ వెహికల్స్ యాక్ట్–1988 ఉన్నాయి.

పార్లమెంట్‌లో వ్యూహ రచనపై కాంగ్రెస్ భేటీ!

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అధికార బీజేపీని ఇరుకునపెట్టేందుకు, దేశంలో నెలకొన్న సమస్యలపై నిలదీసేందుకు పార్టీ అనుసరించాల్సిన వ్యూహాల తుది ఖరారు కోసం కాంగ్రెస్ పార్టీ 15వ తేదీన ఢిల్లీలో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, నిరుద్యోగం, మణిపూర్‌లో కొనసాగుతున్న హింస, బాలాసోర్‌లో ఘోర రైలు ప్రమాదం, రెజ్లర్ల ఆందోళన వంటి అంశాలను ప్రధానంగా లేవనెత్తి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సోనియాగాంధీ నివాసంలో జరిగే ఈ భేటీలో లోక్‌సభ, రాజ్యసభలో పక్షనేతలు, పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పాల్గొననున్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
గురువారం । 13 । జూలై । 2023

కామన్ సివిల్ కోడ్ యాక్ట్‌కు డీఎంకే వ్యతిరేకం

- న్యాయ కమిషన్‌కు మంత్రి దురై మురుగన్ లేఖ

సాక్షి, చెన్నై: కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న కామన్ సివిల్ కోడ్ చట్టానికి డీఎంకే పూర్తిగా వ్యతిరేకమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురగన్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర న్యాయ కమిషన్‌కు ఆయన లేఖ రాశారు. యూనిఫాం సివిల్ చట్టాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ చట్టం కారణంగా అనేక కొత్త సమస్యలు దేశంలో ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే దేశం ఒకే మతం, ఒకే భాష అన్నట్టుగా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలగడం తథ్యమని, ఈ చట్టానికి ఎట్టిపరిస్థితుల్లో అనమతి ఇవ్వకూడదని న్యాయ కమిషన్‌ను కోరారు.

న్యూస్‌రీల్

క్రీడా రాజధానిగా మార్చడమే లక్ష్యం



సైకిల్ థాన్ జెర్సీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

కొరుక్కుపేట: తమిళనాడును క్రీడా రాజధానిగా మార్చడమే లక్ష్యంగా సీఎం స్టాలిన్ ముందుకు సాగుతున్నారని రాష్ట్ర క్రీడల శాఖామంత్రి ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు సైకిల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ) పర్యవేక్షణలో హెచ్‌సీఎల్ కార్పొరేషన్ తరపున అక్టోబర్ 8న హెచ్‌సీఎల్ సైకిల్‌థాన్‌ను నిర్వహించనుంది. ఈ పోటీ ల్లో పాల్గొనే వారు సెప్టెంబర్ 20లోపు ఆసక్తి కలిగిన రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్వాహకులు ప్రకటించారు. విజేతలకు రూ. 30 లక్షల నగదు బహుమతులను అందిస్తామన్నారు. బుధవారం చెన్నైలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఉదయనిధి స్టాలిన్, ప్రత్యేక అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రటరీ డాక్టర్ అతుల్యా మిశ్రా, స్పోర్ట్స్ సెక్రటరీ మేగనాథ్ రెడ్డి పాల్గొని సైకిల్‌థాన్ పోటీలకు సంబంధించి జెర్సీని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందన్నారు. అంతర్జాతీయ క్రీడలకు తమిళనాడు వేదికగా నిలుస్తూ క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎల్ ఫౌండేషన్ స్ట్రాటజీ ప్రెసిడెంట్ సుందర్ మహాలింగం తదితరులు పాల్గొన్నారు. సైకిల్ థాన్ పోటీల్లో పాల్గొనే వారు www.hclcyclothon.com వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

స్కూల్ వ్యాన్ బోల్తా

- విద్యార్థి మృతి
- 20 మందికి గాయాలు


అన్నానగర్: మానామదురై సమీపంలో మంగళవారం సాయంత్రం స్కూల్ వ్యాన్ బోల్తాపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. మరో 20 మంది విద్యార్థులు గాయపడ్డారు. వివరాలు.. శివగంగై జిల్లా మానామదురై సమీపంలోని పెరియ కొట్టైలో మెట్రిక్ పాఠశాల నడుస్తోంది. ఇందులో చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు విద్యార్థులను స్కూల్ వ్యాన్‌లో తీసుకు వస్తున్నారు. మంగళవారం సాయంత్రం విద్యార్థులను ఇళ్లకు తరలిస్తుండగా మానామదురై పక్కనే ఉన్న సిరుగనెందల్ సమీపంలో ఆ వ్యాన్ గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వెంబత్తూరుకు చెందిన 7వ తరగతి చదువుతున్న హరివేలన్ (13) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 20 మంది విద్యార్థులు గాయపడ్డారు. వారిని రక్షించి అంబులెన్స్‌లో శివగంగై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెంథిల్ రిమాండ్ పొడిగింపు

సాక్షి, చెన్నై: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన మంత్రి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను ఈనెల 26వ తేదీ వరకు పొడిగించారు. ఆయన రిమాండ్ కాలం 12 వతేదీ(బుధవారం)తో ముగిసింది. కావేరి ఆస్పత్రి నుంచి ఆయన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై మొదటి మేజిస్ట్రేట్ కోర్టు ముందు పుళల్ జైలు అధికారులు హాజరు పరిచారు. అనంతరం న్యాయమూర్తి రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

టాస్మాక్ పని వేళల్లో మార్పులు తగవు

- ఎండీఎంకే తీర్మానం



ప్రసంగిస్తున్న వైగో

సాక్షి, చెన్నై: టాస్మాక్ మద్యం దుకాణాల పని వేళల్లో మార్పు చేయవద్దని ప్రభుత్వానికి డీఎంకే మిత్ర పక్షం ఎండీఎంకే విజ్ఞప్తి చేసింది. బుధవారం ఆ పార్టీ సమావేశంలో తీర్మానం కూడా చేశారు. ఎగ్మూర్‌లోని తాయగంలో బుధవారం ఉదయంఎండీఎంకే రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో రాష్ట్రంలోని పరిస్థితులు, గవర్నర్ చర్యలు, సివిల్ చట్టం తదితర అంశాల గురించి చర్చించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ ప్రిసీడియం చైర్మన్‌గా అర్జున్‌రాజ, కోశాధికారి సెంథిల్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి దురై వైగో, సంయుక్త కార్యదర్శి మల్లై సత్య తదితర నేతలు హాజరయ్యారు. సెప్టెంబరు 15వ తేదీన ఎండీఎంకే మహానాడును మదురై వేదికగా నిర్వహించేందుకు తీర్మానించారు. మహానాడు జయప్రదం చేయడమే లక్ష్యంగా కమిటీలను నియమించారు. మేఘదాతులో డ్యాం నిర్మాణానికి కర్ణాటక చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ మరో తీర్మానం చేశారు. సివిల్ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నట్టుగా మద్యం దుకాణాల పని వేళలు అలాగే ఉంచాలని, ఇందులో మార్పు చేయవద్దని ప్రభుత్వానికి సూచిస్తూ తీర్మానం చేశారు.

చెన్నై సమీపంలో.. మెగా క్రీడా నగరం



నుంగంబాక్కం టెన్నిస్ స్టేడియం



అంతర్జాతీయ క్రీడానగరం నమూనా

మహానగరం శివార్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో మెగా క్రీడా నగరం రూపు దిద్దుకోనుంది. ఇందుకోసం మూడు ప్రాంతాల్లో స్థలాలను ఎంపిక చేశారు. ఇక్కడ భారీ నిర్మాణాలకు అవసరమైన ప్రణాళికతో కూడిన నివేదిక ప్రభుత్వానికి సీఎండీఏ (చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ) వర్గాలు అందజేశాయి. అలాగే ఉత్తర చెన్నైలో బాక్సింగ్ అకాడమీ ఏర్పాటుకూ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

- రాజధాని శివారు ప్రాంతాల్లో మూడు ప్రదేశాల ఎంపిక
- ప్రభుత్వానికి చేరిన నివేదిక
- ఉత్తర చెన్నైలో బాక్సింగ్ అకాడమీ
- నియోజకవర్గాల్లో క్రీడా మైదానాల ఏర్పాటు పనులు వేగవంతం

సాక్షి, చెన్నై: ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ప్రపంచ స్థాయి చెస్, స్క్వాష్ పోటీలను చెన్నై వేదికగా దిగ్విజయంగా నిర్వహించారు. అలాగే క్రీడాభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం స్టాలిన్ చర్యలు చేపడుతున్నారు. క్రీడల శాఖ మంత్రిగా తనయుడు ఉదయనిధి స్టాలిన్‌ను నియమించి అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేశారు. నియోజకవర్గానికి ఓ క్రీడా మైదానం, ప్రధాన నగరాలలో మినీ స్టేడియాల ఏర్పాటు, అత్యుత్తమ శిక్షణకు తగ్గ చర్యలపై దృష్టి పెట్టారు. ఉత్తమ సేవలను, వివిధ పోటీలలో రాణించే క్రీడాకారులను సత్కరించే విధంగా ప్రోత్సాహకాలను ప్రకటిస్తున్నారు. అలాగే పేద విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు సిద్ధమయ్యారు. ప్రతిభ ఉన్నా ప్రోత్సహించే వారు లేరనే ఆవేదనలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తాము ఉన్నామనే భరోసా ఇవ్వాలని నిర్ణయించారు. క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడలలో రాణించే సత్తా ఉన్నా, శిక్షణకు సరి పడ్డ స్తోమత లేక మౌనంగా ఉన్న విద్యార్థుల భుజం తట్టి అండగా నిలిచేందుకు క్రీడాశాఖ చర్యలు తీసుకుంది. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పతకాలను కైవసం చేసుకుని తమిళ ఖ్యాతిని ఎలుగెత్తి చాటాలనే ఆకాంక్షతో సీఎం ఉన్నారు. ఇప్పటికే పలువురు క్రీడాకారులు పతకాల వేటలో ఉన్నా, ఈ సంఖ్యను మరింతగా పెంచాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నారు. అలాగే, ప్రపంచ దేశాలకు, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు చెన్నైను వేదికగా తీర్చిదిద్దే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఆగస్టులో చెన్నైలోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియం వేదికగా హాకీ టోర్నీకి సన్నాహకాలు చేస్తున్నారు.

మరింతగా..

చెన్నైలో క్రికెట్ నిర్వహణకు ఎంఏ చిదంబరం స్టేడియం ఉంది. నెహ్రూ ఇండోర్ స్టేడియం అథ్లెటిక్స్‌కు, రాజరత్నం స్టేడియం, మేయర్ రాధాకృష్ణన్ స్టేడియం, నుంగంబాక్కం స్టేడియం ఇతర క్రీడలకు ఆతిథ్యమిస్తున్నాయి. వీటితో పాటు చెన్నైలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడనగరం ఏర్పాటు చేయాలని కొద్ది రోజుల క్రితం సీఎం స్టాలిన్ ఆదేశించారు. ఈపనులకు సంబంధించి చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ కసరత్తులు పూర్తి చేసింది. చెన్నై శివార్లలోని సెమ్మంజేరి, కుందంబాక్కం, వండలూరులలో స్థలాలను పరిశీలించారు. ఈ మూడు ప్రదేశాలు అంతర్జాతీయ క్రీడా నగరం రూపకల్పనకు అనువైన ప్రాంతాలుగా గుర్తించారు. అన్ని రకాల అథ్లెటిక్స్‌లకు ఒకే వేదికగా క్రీడా నగరం ఉండే విధంగా నిర్మాణాలకు నమూనాను తీర్చిదిద్దారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులకు శిక్షణ, బస తదితర అన్ని రకాల వసతులు ఇక్కడ ఉండే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ క్రీడా నగరంలో స్విమ్మింగ్ పూల్, బ్యాట్మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, జిమ్నాస్టిక్, తదితర పోటీలకు ప్రత్యేక వేదికలు, రన్నింగ్ తదితర 20కు పైగా క్రీడలకు ప్రత్యేక వేదికలను తీర్చిదిద్దనున్నారు. క్రీడాకారులు ఈ నగరంలోకి వస్తే చాలు అన్ని రకాల వసతులు వారికి ఉండే విధంగానే కాకుండా, ప్రేక్షకుల కోసం ఫుట్ కోట్‌లు తదితర ప్రత్యేక ఏర్పాట్లకు నిర్ణయించారు. పుణెలోని చత్రపతి శివాజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పాటియాలలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ తదితర స్టేడియాలు, మరికొన్ని ప్రైవేటు అకాడమీలలోని సౌకర్యాలు, నిర్మాణాలను పరిశీలించి వాటిని తలదన్నే విధంగా చెన్నైలోక్రీడా నగరం ఏర్పాటుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి సీఎండీఏ అందజేసినట్లు తెలిసింది.

ఉత్తర చెన్నైలో..

ఉత్తర చెన్నైకు బాక్సింగ్‌కు మధ్య అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇక్కడ ఒకప్పుడు బాక్సింగ్‌లో సత్తా చాటే విధంగా అనేక గ్రూపులు ఉండేవి. ఈ విషయంపై అనేక సినిమాలు కూడా తెరకెక్కాయి. ప్రస్తుతం కూడా వారసత్వంగా అనేకమంది బాక్సింగ్‌పై దృష్టి పెడుతున్నా, పూర్తిస్థాయిలో వారికి సహకారం అందడం లేదు. ఇక్కడి యువకుల్లో అనేక మంది జాతీయ స్థాయిలో జరిగే దేహదారుఢ్య పోటీలలో రాణిస్తూ, బాక్సింగ్‌పై కూడా దృష్టి పెడుతున్నారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రూ. 10 కోట్లతో ఉత్తర చెన్నై బాక్సింగ్ అకాడమీతో పాటు జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ప్రత్యేక వేదిక రూపకల్పనకు నిర్ణయించింది. అలాగే చెన్నై, శివారు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో తలా రూ. 3 కోట్లతో మినీ స్టేడియం, క్రీడా మైదానాల ఏర్పాటుకు నిధులను కేటాయించింది. ఈ నిధులతో పనులను వేగవంతం చేయనుంది. తమిళ క్రీడాకారులు ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీలలో రాణించి పతకాల సాధనే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ, అవసరమైన ఏర్పాట్లకు ప్రస్తుతం రూ. 25 కోట్లతో ఒలింపిక్ బంగారాల పేరిట కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. తద్వారా రాష్ట్ర క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని క్రీడా నిపుణులు అంచనా వేస్తున్నారు.



బాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

దీపావళి రైళ్లు.. క్షణాల్లో ఫుల్!

- ఇకపై ప్రత్యేక రైళ్లే దిక్కు

సాక్షి, చెన్నై : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వగ్రామాలకు వెళ్లేందుకు ముందస్తు రిజర్వేషన్ల కోసం బుధవారం ఉదయం రైల్వే కౌంటర్ల వద్ద జనం క్యూ కట్టారు. రిజర్వేషన్ కౌంటర్లు తెరిచారో లేదో, క్షణాల్లో హౌస్‌ఫుల్ అనే బోర్డులు ప్రత్యక్షమయ్యాయి. ఇక, ప్రత్యేక రైళ్లు ఎప్పుడే అని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాలు.. రాజధాని నగరంలో ఉద్యోగాలు, ఇతర పనుల నిమిత్తం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో నివాసం ఉంటున్న విషయం తెలిసిందే. వీరంతా పండుగ సమయాల్లో తమ స్వస్థలాలకు బయలు దేరి వెళ్లడం సర్వసాధారణం. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సుల్ని ప్రభుత్వం నడిపినా, ముందస్తుగా రైళ్ల రిజర్వేషన్ మీద దృష్టి పెట్టే వారు ఎక్కువ. ఇందుకు కారణం, బస్సు చార్జీల కన్నా, రైలు టికెట్టు ధర తక్కువ కావడమే. ఈ ఏడాది దీపావళి పండుగ నవంబర్ 12న రానుంది. నవంబర్ 9 వ తేదీ నుంచి జనం స్వస్థలాలకు వెళ్లడం జరుగుతుంది. దీంతో తిరుచ్చి, దిండుగల్, మదురై, విరుదునగర్, తిరున్వేలి, కన్యాకుమారి, తూత్తుకుడి, విల్లుపురం, కడలూరు, నాగపట్నం, తంజావూరు, ఈరోడ్, సేలం, కోయంబత్తూరు తదితర ప్రాంతాలకు చెందిన వారు ముందస్తు రైల్వే రిజర్వేషన్‌పై దృష్టి పెట్టారు. ఆయా ప్రాంతాల మీదుగా సాగే రైళ్లలో 120 రోజులకు ముందే రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. దీంతో బుధవారం దీపావళి రైళ్ల ముందస్తు రిజ్వేషన్లు ప్రారంభమయ్యాయి.



కౌంటర్ల వద్ద రద్దీ

హౌస్‌ఫుల్..

ఉదయాన్నే రిజర్వేషన్లు ఆరంభం కాగానే, కొన్ని నిమిషాల వ్యవధిలో టికెట్లన్నీ అయిపోయాయి. చెన్నై సెంట్రల్ నుంచి, ఎగ్మూర్ నుంచి, తాంబరం నుంచి నడిచే అన్ని రైళ్ల టికెట్లు హౌస్‌ఫుల్ కావడం గమనార్హం. కొందరు రైల్వే రిజర్వేషన్ కౌంటర్లకు వచ్చి క్యూలో నిలబడి నిరాశతో వెను దిరిగారు. అత్యధిక శాతం టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వాళ్లే అధికం. ఈసారి బల్క్ బుకింగ్‌లు మరీ ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. ఎగ్మూర్, సెంట్రల్, తాంబరంల నుంచి ఆయా మార్గాల గుండా సాగే సాధారణ రైళ్లన్నీ హౌస్‌ఫుల్ కావడంతో, ఇక ప్రత్యేక రైళ్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. కాగా, తాము క్యూలో గంటల కొద్ది నిలబడి, కౌంటర్ల వద్దకు వెళ్లేలోపు టికెట్లు హౌస్‌ఫుల్ కావడం తీవ్ర నిరాశ కలిగించిందని అనేక మంది ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్ల అభివృద్ధికి రూ. 6,034 కోట్లు

- భద్రతకు మరో రూ. 150 కోట్లు విడుదల
- ఉత్తర్వులు జారీ

సాక్షి, చెన్నై: ఈ ఏడాది రాష్ట్రంలో రహదారులు, రోడ్ల అభివృద్ధికి రూ. 6034 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. రోడ్డు భద్రతే లక్ష్యంగా చేపట్టాల్సిన పనుల కోసం మరో రూ. 150 కోట్లు మంజూరు చేసింది. వివరాలు.. రాష్ట్రంలో జాతీయ రహదారులు 4,974 కిలో మీటర్లు, రాష్ట్ర రహదారులు 11,594 కిలో మీటర్లు, జిల్లా రోడ్లు 11,289 కిలో మీటర్లు, ఇతర రోడ్లు 34,160 కిలో మీటర్లు ఉన్నాయి. రాష్ట్ర రహదారుల శాఖ పరిధిలోని ఈ రోడ్లలో వాహనాల రద్దీ క్రమంగా పెరుగుతోంది. దీంతో ఈ రోడ్ల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను ఏటా కేటాయిస్తున్నాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది రూ. 6,034 కోట్లతో రోడ్లు, రహదారుల అభివృద్ధి ప్రనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి ప్రదీప్ యాదవ్ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో ప్రమాదాల కట్టడే లక్ష్యంగా, రోడ్డు భద్రత చర్యల కోసం ప్రత్యేకంగా రూ. 150 కోట్లు కేటాయించారు. అలాగే ప్రమాదాల కట్టడికి విదేశీ సాంకేతికతను వాడుకునేందుకు రూ. 100 కోట్ల అదనంగా ఇచ్చారు. రవాణా పరంగా ఆటంకాలు లేకుండా ఉండడం కోసం ప్రత్యేక చర్యల్లో భాగంగా రూ. 787 కోట్లతో 273 వంతెనల నిర్మాణానికి నిర్ణయించారు. అలాగే 'మీ నియోజకవర్గంలో స్టాలిన్' పథకం కింద ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు 234 నియోజకవర్గాలలో రోడ్లు అభివృద్ధి కి రూ. 1స093 కోట్లను కేటాయించారు.



రహదారి

బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో 10 వేల ఉద్యోగాల కల్పనకు చర్యలు

సాక్షి, చెన్నై : బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసు, బీమా (బీఎఫ్ఎస్ఐ) సెక్టార్‌లో 10 వేల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు చేపట్టాలని తమిళనాడు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్(టీఎన్ఎస్‌డీసీ) నిర్ణయించింది. బుధవారం స్థానికంగా జరిగిన టీఎన్ఎస్‌డీసీ, బీఎఫ్ఎస్ఐ నిపుణుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఈమేరకు తీర్మానించారు. పట్టభద్రులైన యువత, కళాశాలలోని విద్యార్థుల కోసం ప్రభుత్వ సహకారంతో నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలకు నిర్ణయించారు. పాఠ్యాంశాల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ ,ప్రయోగాత్మక మార్గదర్శకత్వాలకు సహకారం అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంపై టీఎస్ఎస్‌డీసీ, బీఎఫ్ఎస్ఐ ప్రతినిధులు ఎం. జయ ప్రకాషన్, సాయిరెడ్డి పేర్కొంటూ నాన్ మొదల్వన్ పథకం మేరకు 2022–23లో 800 కు పైగా కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థలలో 16 లక్షల మందికి పైగా విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణ కల్పించామన్నారు. బీఎఫ్ఎస్ఐ సెక్టారులోనూ 10వేల మందికిపైగా విద్యార్థులు వివిధ నైపుణ్యాల కోర్సులను అభ్యసించారని పేర్కొన్నారు. కళాశాల స్థాయిలోనే విద్యార్థులకు నైపుణ్యం ఆధారిత కోర్సులను చేయాలని సూచిస్తున్నామన్నారు. కోర్సుల లక్ష్యాలు, ఫలితాలు, నైపుణ్యాలపై ఎక్కువ ఆసక్తిని కలిగిస్తాయని, తద్వారా మరింత ఉపాధి పొందేందుకు వీలుందని వివరించారు. భవిష్యత్‌లో ఉద్యోగాల కల్పనకు మరింతగా ప్రాధాన్యమిస్తామన్నారు.

సీనియర్ నిర్మాత రాజ్‌కన్ను కన్నుమూత



ఎస్ఏ రాజ్‌కన్ను (ఫైల్)

తమిళసినిమా: సీనియర్ సినీ నిర్మాత ఎస్ఏ రాజ్‌కన్ను (77) మంగళవారం రాత్రి చెన్నైలో గుండె పోటుతో కన్నుమూశారు. రాజ్‌కన్ను అమ్మన్ క్రియేషన్స్ పతాకంపై కమలహాసన్, రజనీకాంత్ ,శ్రీదేవిలతో 16 వయదినిలే వంటి ఘనవిజయం సాధించిన చిత్రాన్ని నిర్మించడంతో పాటు ఆ చిత్రం ద్వారా భారతీరాజాను దర్శకుడిగా పరిచయం చేశారు. అదే విధంగా కిళక్కు పోగుం రైయిల్ చిత్రం ద్వారా నటి రాధికను పరిచయం చేసిన ఘనత ఈయనదే. అదే విధంగా నటుడు కె.భాగ్యరాజ్ విలన్‌గా నటించిన కన్ని పరువత్తిలే, కార్తీక్, రాధ జంటగా భారతీరాజా దర్శకత్వంలో వాలిభమే వావా, పటుడు పాండియన్, రేవతి జంటగా నటించిన పొన్ను పుడిచ్చిరిక్కు, కె.భాగ్యరాజ్ దర్శకత్వంలో ఎంగ చిన్న రాసా వంటి పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. ఈయన మృతిక నటుడు కమలహాసన్, నటి రాధిక, దర్శకుడు భారతీరాజా మొదలగు పలువురు సినీ ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. కాగా రాజ్‌కన్ను భౌతిక కాయానికి బుధవారం మధ్యాహ్నం చెన్నై క్రోంపేటలో అంత్యక్రియలు నిర్వహించారు.

ధరల కట్టడికి సత్వర చర్యలు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్ బోర్డు కాలనీలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



సీఎం స్టాలిన్‌తో క్రీడాకారులు

- కేంద్ర మంత్రికి సీఎం లేఖ
- 10 వేల మెట్రిక్ టన్నుల గోధుమ, పప్పులను కేటాయించాలని విజ్ఞప్తి

సాక్షి, చెన్నై : నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయని, వీటి కట్టడికి చర్యలు విస్తృతంగా చేయాలని కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు సీఎం ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన కేంద్రమంత్రికి లేఖ రాశారు. ఇందులో అనేక రాష్ట్రాలలో ఆహార వస్తువుల ధరలు అమాంతం పెరుగుతున్నారన్న ఆయన, వినియోగదారులపై పడుతున్న ప్రభావాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించాలని కోరారు. బియ్యం, గోదుమలు, పప్పు ధాన్యాలు వంటి వాటితో పాటుగా కూరగాయల ధరలు అమాంతంగా పెరిగి ఉన్నాయని వివరించారు. ఈ ధరల కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై అదనపు భారం పడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ధరల కట్టడికి విస్తృతంగా చర్యలు తీసుకోకుంటే, ప్రజలు మరింత కష్టాల భారీన పడటం ఖాయమని హెచ్చరించారు. అలాగే తమిళనాడు కేంద్రం ప్రభుత్వం నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల గోధుమ, పప్పులను కేటాయించాలని కోరారు.

పలు భవనాలకు ప్రారంభోత్సం

అంతకుముందు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం స్టాలిన్ పలు ప్రారంభోత్సవాలు చేశారు. తమిళనాడు హౌసింగ్ బోర్డు నేతృత్వంలో రూ. 276.15 కోట్లతో కోయంబత్తూరు, విరుదునగర్, నీలగిరి, తేని, చెన్నైలో నిర్మించిన గృహాలను, వాణిజ్య సముదాయాలను ప్రారంభించారు. అలాగే రూ. 56.31 లక్షలతో నిర్మించిన డివిజనల్ కార్యాలయాల భవనాలను కూడా సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ముత్తుస్వామి, రఘుపతి, అన్బరసన్, సీఎస్ శివదాస్ మీన పాల్గొన్నారు. అలాగే తమిళనాడు పట్టణాభివృద్ధి సంస్థ నేతృత్వంలో రూ,. 358 కోట్లతో బహుళ అంతస్తుల తరహాలో నిర్మించిన 301 ఫ్లాట్‌లను లబ్ధిదారులకు పంపిణీకి శ్రీకారం చుట్టారు. తొలి విడతగా 902 మంది లబ్ధిదారులకు ఫ్లాట్‌లను కేటాయించారు. ఇక, అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన 90 మంది క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా సీఎం స్టాలిన్ రూ. 5.9 కోట్ల ప్రోత్సాహక నిధిని అందజేశారు. కార్యక్రమంలో మంత్రి ఉదయ నిధి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. ఇక, సైదాపేటలోని ఎంసీ రాజ కళాశాల ఆవరణలో రూ. 44.50 కోట్లతో 10 అంతస్తులతో నిర్మించన్ను ఆదిద్రావిడ విద్యార్థుల హాస్టల్ భవన నిర్మాణ పనులకు శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఎం. సుబ్రమణియన్, కయల్ వెలి సెల్వరాజ్, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

16న డచెస్ ట్రెజర్ హంట్ కారు ర్యాలీ



అతిథులతో నీనారెడ్డి

కొరుక్కుపేట: సేవా, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న డచెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ డచెస్ ట్రెజర్ హంట్ కారు ర్యాలీ 2023ను ఈనెల 16వ తేదీ నిర్వహించనున్నట్లు డచెస్ క్లబ్ నిర్వాహకురాలు నీనా రెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 23వ వార్షిక ట్రెజర్ హంట్ కారు ర్యాలీని ఈనెల 16 తేదీ ఉదయం 8 గంటలకు సవేరా వద్ద ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సినిమా సినిమా అనే థీమ్‌తో కుటుంబాలు, స్నేహితులను గెట్ టు గెదర్‌గా ఈ కారు ర్యాలీ సాగనుందని అన్నారు. ఈనెల 15 తేదీలోపు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 98412 88631ను సంప్రదించాలని కోరారు.

ఈ ఏడాది 4,200 కొత్త బస్సులు

కొరుక్కుపేట: ఈ ఏడాది 4,200 కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నట్లు మంత్రి శివశంకర్ తెలిపారు. చెన్నైలోని పల్లవన్ హౌస్‌లోని ప్రభుత్వ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ వర్క్ షాప్‌లో శతాబ్ది ఉత్సావాల సందర్భంగా ప్రభుత్వ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ఉద్యోగులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి శివశంకర్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖను మరింత అభివృద్ధి చేస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలను అందించేందుకు ఈ ఏడాది కొత్తగా 4200 బస్సులను కొనుగోలు చేయనున్నామని తెలిపారు. కొత్త డ్రైవర్లు, కండక్టర్ల నియామకం కాగానే కాంట్రాక్టు కార్మికులను తీసుకోనున్నామని చెప్పారు. మరణించిన కార్మికులు ఐదుగురికి కుటుంబ సభ్యుల్లో కారుణ్య ప్రాతిపదికన అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. 14వ వేతన సంఘం చర్చల మేరకు బకాయిలతో కూడిన వేతనాలు పెంచామని వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

నంది నదిపై బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం

- పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చంద్రన్
- 20 గ్రామాలకు తీరనున్న రవాణా కష్టాలు



పూజ చేసి బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: నంది నదిపై రూ. 6.98 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే చంద్రన్ బుధవారం భూమి పూజల చేశారు. ఆర్కేపేట యూనియన్ అయ్యనేరి సమీపంలోని నందినదిలో వర్షాకాలంలో వరద ప్రవాహంతో చుట్టుపక్కల 20 గ్రామాలకు చెందిన విద్యార్థులు, గ్రామస్తులు నది దాటలేక రాకపోకలకు కష్టాలు ఎదుర్కొనేవారు. బ్రిడ్జి నిర్మించాలని చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. గ్రామీణుల రవాణా కష్టాలు తీర్చే విధంగా హైవే శాఖ ద్వారా నబార్డు పథకంతో పాటు గ్రామీణ రోడ్ల ఆధునీకరణ పథకం ద్వారా రూ. 6.98 కోట్లు కేటాయించారు. దీంతో బ్రిడ్జి పనులను ప్రారంభించారు. ఏడాదిలో పనులు పూర్తి చేస్తామని.. తద్వారా అయ్యనేరి, అమ్మనేరి, జ్ఞానకొల్లితోప్పు, టీసీ.కండ్రిగ సహా 20 గ్రామాలకు చెందిన ప్రజలకు రాకపోకలకు సౌకర్యాలు ఏర్పడుతాయని హైవే శాఖ అధికారులు తెలిపారు. యూనియన్ చైర్‌పర్సన్ రంజిత, వైస్ చైర్‌పర్సన్ తిలకవతి, హైవేశాఖ సహాయ ఎక్సిక్యూటివ్ ఇంజినీర్ కలైయరసి, సహాయ ఇంజినీర్ జ్ఞానఅరుల్‌రాజ్, డీఎంకే మండల కార్యదర్శులు పళని, షణ్ముగం, శ్రీనివాసన్, బీడీఓలు పాల్గొన్నారు.

చెన్నై - నెల్లై మధ్య వందేభారత్ రైలు



సాక్షి, చెన్నై : చెన్నై -తిరునల్వేలి(నెల్లై) మధ్య వందే భారత్ రైలు సేవలకు రైల్వే యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం చెన్నై నుంచి బెంగళూరు మీదుగా మైసూర్‌కు, చెన్నై నుంచి కోయంబత్తూరుకు రెండు వందేభారత్ రైలు సేవలు అందుతున్న విషయం తెలిసిందే. ఈ సేవాల విస్తరణలో భాగంగా చెన్నై – తిరుపతి మధ్య వందే భారత్ రైలు నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అదే సమయంలో చెన్నై నుంచి దక్షిణ తమిళనాడులోని తిరుచ్చి – మదురై నగరగాలను కలుపుతూ తిరునల్వేలికి ఓ రైలు నడిపేందుకు కసరత్తు చేపట్టారు. ప్రస్తుతం చెన్నై ఎగ్మూర్‌నుంచి దక్షిణ తమిళనాడు వైపుగా పదుల సంఖ్యలో రైళ్లు నడుస్తున్నాయి. ఇవన్నీ కిక్కిరిసి ఉంటాయి. చెన్నై నుంచి తిరునల్వేలికి సుమారు 10 గంటల ప్రయాణ సమయం పడుతుంది. ఈ మార్గంలో అత్యధిక శాతం మంది రైళ్ల మీదే ఆధార పడి ఉన్నారు. ఏసీ బోగీలలో సీట్లు హాట్ కేకుల్లా బుక్ అవుతుంటాయి. ఇక్కడ అన్ని రైళ్ల సేవలు సాయంత్రం తర్వాతే దక్షిణ తమిళనాడు వైపుగా చెన్నై నుంచి బయలు దేరుతాయి. దీని పరిగణనలోకి తీసుకున్న రైల్వే యంత్రాంగం ఉదయం వేళల్లో వందే భారత్‌ను పట్టాలెక్కించేందుకు కసరత్తు చేస్తున్నారు. 600 కిలోమీటర్ల దూరం మేరకు ఉన్న చెన్నై – నెల్లై మధ్య ఈ రైలు నడపడం ద్వారా ప్రయాణ సమయం కనీసం రెండు గంటలు తగ్గే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఈ రైలు ఉదయం 6 గంటలకు నెల్లైలో బయలు దేరి మధ్యాహ్నం 2 గంటలకు చెన్నైకు వచ్చే విధంగా, మూడు గంటలకు ఇక్కడ బయలుదేరి రాత్రి 10.30 గంటలకు నెల్లై చేరే విధంగా ప్రయాణ సమయాన్ని పరిశీలిస్తున్నారు. ఈనెలాఖరులో లేదా ఆగస్టు మొదటి వారంలో రైలును పట్టాలెక్కించేందుకు దక్షిణ రైల్వే వర్గాలు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిసింది.

మలేషియా వాసి అనుమానాస్పద మృతి

అన్నానగర్: తిరుచ్చిలో బుధవారం మలేషియా వాసి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు.. మలేషియాకు చెందిన ముత్తువేల్ (69). ఇతను గత 8వ తేదీన తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో బస చేశాడు. బుధవారం ముత్తువేల్ బంధువు విజయసారథి సెల్‌ఫోన్‌లో సంప్రదించాడు. అయితే పదేపదే ఫోన్ చేసినా తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన విజయసారథి హోటల్ మేనేజర్ ముత్తువేల్ ఉంటున్న గదికి వెళ్లి తలుపు తట్టాడు. కానీ తలుపు తెరవలేదు. ఆ తరువాత మరో తాళంతో గది తలుపులు తెరిచి చూసేసరికి ముత్తువేల్ మంచంపై శవమై పడివున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ పోలీసులు అక్కడికి చేరుకుని ముత్తువేల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తదుపరి విచారణలో ముత్తువేల్ మలేషియాలోని ఓ రాజకీయ పార్టీతో కలిసి పని చేస్తున్నట్లు తేలింది. దీనిపై కేసు నమోదుచేసి ముత్తువేల్ గుండెపోటుతో మృతి చెందాడా? లేక మరేదైనా కారణమా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పడవలో 300 కిలోల గంజాయి స్వాధీనం

అన్నానగర్: తూత్తుకుడి సముద్రంలో పడవ ద్వారా బుధవారం వేకువజామున అక్రమంగా తరలిస్తున్న 300 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తూత్తుకుడి సముద్రంలో బుధవారం వేకువజామున 80 మైళ్ల దూరంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పడవను తూత్తుకుడి కోస్ట్‌గార్డ్ పెట్రోలింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. అనంతరం తీరప్రాంత రక్షక దళం బోటును తనిఖీ చేయగా అందులో గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం బోటులోని సుమారు 300 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృతి

అన్నానగర్: అరియలూరులో బుధవారం తెగిపడిన కరెంటు తీగ తగిలి రెండు ఆవులు మృతి చెందాయి. అరియలూరు కన్నుపిళ్లై వీధికి చెందిన హంసవల్లి, రాజకుమారి. వీరు మేపుతున్న ఆవులను యథావిధిగా బుధవారం అరియలూరు ఆర్డీఓ కార్యాలయం వెనకాల మేతకు వదిలారు. సాయంత్రం వరకు ఆవులు రాకపోవడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. అప్పుడు కిందపడిన విద్యుత్ తీగను తొక్కడంతో రెండు ఆవులు మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో విద్యుత్ బోర్డుకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో విద్యుత్ బోర్డు అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కరెంటు నిలిపి వేశారు.

పొగాకు పదార్థాలు స్వాధీనం

అన్నానగర్: పన్రుటిలోని ఓ ఇంట్లో దాచిన రూ.3 లక్షల విలువైన పొగాకు పదార్థాలను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. కడలూరు జిల్లా పన్రుటి సమీపంలోని ఒరయూరులో ఉన్న ఓ ఇంటికి తరచూ వాహనాలు వస్తున్నాయని, అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నాయని పుదుపేట పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీని ఆధారంగా ఇన్‌స్పెక్టర్ నందకుమార్ నేతృత్వంలో పోలీసులు బుధవారం వేకువజామున ఇంటి వద్దకు వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఒక గదిలో 35 కట్టల పొగాకు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. కోయతోపుకు చెందిన కలియపెరుమాళ్ కుమారుడు ప్రభాకరన్ (35) పన్రుటి అండికుప్పానికి చెందిన మహ్మద్ అన్సారీ (50)లను అరెస్టు చేసి విచారిస్తున్నారు.

హామీలను నెరవేర్చాలని ఉద్యోగుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

వేలూరు: డీఎంకే ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెలవేర్చాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం వేలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జోషి అధ్యక్షత వహించగా జాక్టో జియో రాష్ట్ర ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు, వృత్తి విద్యా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్దనన్ మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన డీఎంకే ఇంత వరకు తమ సమస్యలను పరిష్కరించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పత పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ శాఖలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారిని రెగ్యూలర్ చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి పోరాటాలు చేసేందుకు సిద్ధఃగా ఉన్నామన్నారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాలో తమిళనాడు రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి దీనదయాళన్, జిల్లా రచయితల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసన్ పాల్గొన్నారు.

సందర్శన



ప్రపంచస్థాయిలో శస్త్ర చికిత్స పరిజ్ఞానం, నైపుణ్యాలు, ప్రమాణాల అభివృద్ధిలో దూసుకెళ్తున్న ది రాయల్‌కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్‌ఎడిన్ బర్గ్‌కు చెందిన వైద్యనిపుణుల బృందం బుధవారం చెన్నైలోని సవీత దంత వైద్య కళాశాలను సందర్శించింది. దంత వైద్య విద్య, పరిశోధనలు, విభిన్న శస్త్ర చికిత్సల గురించి అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా పరస్పరం దంత వైద్య రంగంలో సహకారాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. - సాక్షి, చెన్నై

శ్రీలంక తమిళుల ఇతివృత్తంతో పిర్ల్ ఇన్ ది బ్లెడ్



నటుడు సంపత్‌రామ్

తమిళసినిమా: శ్రీలంకలోని తమిళులపై ఆ దేశ సైన్యం జరిపిన యుద్ధ కాండ గురించి ఇప్పటికే పలు చిత్రాలు రూపొందాయి. వాటికి మరో కోణంలో తెరకెక్కిన చిత్రం పిర్ల్ ఇన్ ది బ్లెడ్. దీన్ని దర్శకుడు కెన్ కందయ్య రూపొందిస్తున్నారు. లండన్‌లో నివశిస్తున్న శ్రీలంక తమిళుడైన ఈయన ఇంతకు ముందు రోమియో రొమాన్స్ అనే ఆంగ్ల చిత్రానికి దర్శకత్వం వహించారు. దీనికి ఉత్తమ దర్శకుడు, ఉత్తమ విదేశీ చిత్రం, ఉత్తమ రొమాంటిక్ డ్రామా కేటగిరీలో అమెరికా దేశ అవార్డులను గెలుచుకుందని దర్శకుడు చెప్పారు. కాగా పిర్ల్ ఇన్ ది బ్లెడ్ చిత్రం గురించి ఆయన మాట్లాడుతూ.. శ్రీలంకలో తమిళుల ఊచకోత గురించి ఇంతకు ముందు చాలా చిత్రాలు రూపొందాయన్నారు. వాటిలో కొన్ని విజయవంతం అయినా, చాలా చిత్రాలు విడుదలే కాలేదని అన్నారు. కారణం అనేక రకాల సమస్యలేనని అన్నారు. తాను తెరకెక్కించిన పిర్ల్ ఇన్ ది బ్లెడ్ చిత్రం ఇంతకు ముందు ఎవరూ టచ్ చేయని అంశాలతో ఉంటుందన్నారు. ఇది శ్రీలంకలోని తమిళ ప్రజల వేదనలను ఆవిష్కరించే కథాంశంతోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న జాతి సమస్యలను తెలిపే కథా చిత్రంగా ఉంటుందన్నారు. అక్కడ జరిగే వైట్‌వ్యాన్ స్టోరీని ఈ చిత్రంలో చెప్పినట్లు తెలిపారు. అర్ధరాత్రుల్లో ఎలాంటి నెంబర్లు లేని అనధికారిక వ్యానుల్లో దుండగులు వచ్చి శ్రీలంకలోని తమిళ ప్రజలను తీసుకుపోయి కర్కశంగా చంపే సంఘటనలే వైట్‌వ్యాన్ స్టోరి అని తెలిపారు. వారు ఎవరూ? ఎందుకు కిడ్నాప్ చేస్తున్నారు? వంటివి ఎక్కడా నమోదు కావన్నారు. ఇందులో నటుడు సంపత్‌రామ్ శ్రీలంక మిలటరీ అధికారిగా నటించారని, ఆయనే ఈ చిత్రానికి బలం అని పేర్కొన్నారు. అదే విధంగా నటుడు జయసూర్య ముఖ్య పాత్రలో నటించినట్లు చెప్పారు. కాగా సెవెన్‌హిల్ పిక్చర్స్ యూనివర్శల్ మూవీ టోన్ పతాకంపై ఈయన నిర్మించి దర్శకత్వం వహించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో ఒక ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది.

కోలీవుడ్ టాక్స్



లాల్‌సలాం చిత్ర యూనిట్

లాల్ సలాంను పూర్తి చేసిన తలైవా

తమిళసినిమా: తలైవా తాజాగా నటిస్తున్న జైలర్ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు ముమ్మరంగా జరుపుకుంటోంది. సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో తమన్నా, రమ్యకృష్ణ, బాలీవుడ్ నటుడు జాకీష్రాఫ్, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, తెలుగు నటుడు సునీల్ వంటి పలువురు ప్రముఖ నటీనటులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నెల్సన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 10వ తేదీన తెరపైకి రానుంది.ఇక పోతే రజనీకాంత్ నటిస్తున్న మరో క్రేజీ చిత్రం లాల్ సలాం .ఆయన అతిథిగా మోయిదీన్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్న ఇందులో విష్ణువిశాల్, విక్రాంత్ కథానాయకులుగా నటిస్తున్నారు. నటి జీవిత కీలక పాత్రతో చాలాకాలం తరువాత ఈ చిత్రం ద్వారా కోలీవుడ్‌కు రీం ఎంట్రీ అవుతున్నారు. క్రికెట్ క్రీడ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి రజనీకాంత్ పెద్ద కూతురు ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. లైకా సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్. రెహ్మాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా ఈ చిత్ర షూటింగ్‌ను పుదుచ్చేరి, తిరువణ్ణామలై ప్రాంతాల్లో చిత్రీకరించారు. కాగా లాల్‌సలాం చిత్రంలో రజనీకాంత్‌కు సంబంధించిన షూటింగ్ మంగళవారంతో పూర్తయ్యింది. దీంతో చిత్ర యూనిట్ కేక్ కట్ చేసి సంతోషంగా రజనీకాంత్‌ను సాగనంపారు. ఇక తలైవా తన తాజా చిత్రంపై దృష్టి సారిస్తారన్న మాట. ఆయన నటించే తదుపరి చిత్రానికి జైభీమ్ చిత్రం ఫేమ్ జ్ఞానవేల్ దర్శకత్వం వహించనున్నారు. దీన్ని లైకా సంస్థ నిర్మించనున్న విషయం తెలిసిందే.

విజయ్‌సేతుపతి 50వ చిత్రం మహారాజా



విజయ్‌సేతుపతి



నటి మమతామోహన్‌దాస్

తమిళసినిమా: బహుభాషా నటుడు విజయ్‌సేతుపతి ఇప్పుడు అర్ధ సెంచరీని టచ్ చేశారు. తమిళం, తెలుగు, మలయాళం, హిందీ అంటూ ఇండియన్ సినీ నటుడిగా పేరుగాంచిన విజయ్‌సేతుపతి తాజాగా నటిస్తున్న చిత్రానికి మహారాజా అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దీన్ని ఫ్యాషన్ స్టూడియోస్, సుదన్‌సుందరం సంస్థలు నిర్మిస్తున్నాయి. పాన్ ఇండియన్ చిత్రంగా రూపొందుతున్న ఇందులో బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్, నటి మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. కాగా నటి మమతామోహన్‌దాస్ చాలా గ్యాప్ తరువాత తమిళంలో నటిస్తున్న చిత్రం ఇది. దీనికి అజినీష్ లోక్‌నాథ్ సంగీతాన్ని, ధినేశ్ పురుషోత్తమన్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. షూటింగ్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోందని నిర్మాతలు తెలిపారు. చిత్ర ట్రైలర్, ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు వారు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విజయ్‌సేతుపతి నటిస్తున్న 50వ చిత్రం కావడంతో మహారాజాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

త్వరలో తెరపైకి మిషన్ చాప్టర్- 1



మిషన్ చాప్టర్ -1 చిత్రంలో అరుణ్ విజయ్, ఎమీజాక్సన్

తమిళసినిమా: నటుడు అరుణ్ విజయ్, ఎమీజాక్సన్ జంటగా నటించిన చిత్రం మిషన్ చాప్టర్ -1. నటి నిమీషా సజయన్,అభిహాసన్, భరత్ బొపనా, బేబీ ఇయల్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించిన ఈ చిత్రానికి విజయ్ దర్శకుడు. జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని, సందీప్ కే విజయ్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్, శ్రీ శిరిడీ సాయి మూవీస్ సంస్థలు నిర్మించాయి. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు విజయ్, కథానాయకుడు అరుణ్ విజయ్ మంగళవారం చెన్నైలో విలేకులతో ముచ్చటించారు. మిషన్ చాప్టర్– 1 కమర్షియల్ అంశాలతో కూడిన యాక్షన్ ఓరియన్‌టెడ్ కథా చిత్రంగా ఉంటుందని నటుడు అరుణ్ విజయ్ తెలిపారు. చిత్రంలోని యాక్షన్ సన్నివేశంలో నటిస్తుండగా ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. దీంతో నెల రోజుల పాట కేరళలో వైద్య చికిత్సలు పొంది మళ్లీ షూటింగ్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. దర్శకుడు విజయ్ మాట్లాడుతూ నటుడు అరుణ్ విజయ్ చాలా రిస్కీ సన్నివేశాల్లో డూప్ లేకుండా నటించినట్లు చెప్పారు. ఆయన ఒక ఖైదీగా నటించినట్లు చెప్పారు. నటి ఎమీజాక్సన్ జైలు అధికారిగా చాలా పవర్‌ఫుల్ పాత్రను పోషించినట్లు చెప్పారు. ఈమె ఫైట్ సన్నివేశాల్లో శిక్షణ పొంది నటించినట్లు చెప్పారు. చిత్ర కథ లండన్‌లో జరుగుతుండటంతో ఎక్కువ భాగం షూటింగ్‌ను అక్కడే నిర్వహించినట్లు చెప్పారు. కొంత భాగాన్ని చెన్నైలో రూ.5 కోట్లు వ్యయంతో భారీ సెట్ వేసి చేసినట్లు తెలిపారు. తుపాన్ కారణంగా ఈ సెట్ రెండు సార్లు కూలిపోయ్యిందనీ,మళ్లీ సెట్ వేయడంతో ఖర్చు మూడింతలు ఎక్కువ అయ్యిందనీ చెప్పారు. చిత్రంలో మూడు పాటలు ఉంటాయనీ, జీవీ.ప్రకాశ్ కుమార్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనీ, ఆయన నేపథ్య సంగీతం చిత్రానికి అదనపు బలంగా ఉంటుందని చెప్పారు. మిషన్ చాప్టర్– 1 అనగానే హాలీవుడ్ చిత్రాల తరహాలో ఊహించుకుంటారనీ, అయితే అంత బడ్జెట్‌తో కాకున్నా, ఆ స్థాయి క్వాలిటీతో చిత్రాన్ని రూపొందించినట్లు చెప్పారు.

నాన్న సిఫార్సుతో కాదు..!



అదితి శంకర్

తమిళసినిమా: అందం, తెలివి, చలాకీతనం ఉన్న నటి అదితిశంకర్. ప్రముఖ దర్శకుడు శంకర్ వారసురాలు, విద్యావంతురాలు, గాయని అన్నవి అదనపు అర్హతలు..ఈమె వైద్య వృతి చదివి నటిగా పరిచయం అయిన విషయం తెలిసిందే. విరుమాన్ చిత్రం ద్వారా కథానాయకిగా రంగప్రవేశం చేసి తొలి చిత్రంతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రథమ చిత్రంతో పాస్ అయిన అదితిశంకర్ ఇప్పుడు ద్వితీయ విఘ్నాన్ని అధికమించడానికి సిద్ధమయ్యారు. ఈమె నటుడు శివకార్తికేయన్‌కు జంటగా నటించిన మావీరన్ చిత్రం రేపు తెరపైకి రానుంది. మండేలా చిత్రం ఫేమ్ మడోన్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శాంతి పిక్చర్స్ పతాకంపై అరుణ్ నిర్మించారు. ఇందులో నటి అదితి శంకర్ పాత్రికేయరాలిగా చురుకైన పాత్రలో నటించినట్లు ఇటీవల ఓ భేటీలో దర్శకుడు తెలిపారు. కాగా నటి అదితి శంకర్ గురించి మీడియాలో ఒక విషయం వైరల్ అవుతోంది. అదేమిటంటే ఈమెకు తన తండ్రి శంకర్ సిఫార్సుతోనే అవకాశాలు వస్తున్నాయని.. దీనిపై స్పందించిన అదితి శంకర్ ఆ ప్రచారంలో నిజం లేదన్నారు. ఇంత వరకూ నాన్న ద్వారా ఒక్క చిత్రం కూడా రాలేదని చెప్పారు. అదితి చేయగలదని భావించి కథలతో దర్శక నిర్మాతలు వస్తున్నారనీ,తాను మొదట కథ విన్న తరువాత నాన్నకు చెబుతానన్నారు. ఆయన అనుమతితోనే ఆ చిత్రంలో నటించే విషయం గురించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తనకు నాన్న సపోర్టు ఉంటుందని పేర్కొన్నారు. మీ నాన్న పెద్ద దర్శకుడు ఆయన దర్శకత్వంలో నటిస్తారా? అన్న ప్రశ్నకు అలాంటి ఆశ తనకూ ఉందని చెప్పారు. దర్శకత్వం వహించే ఆలోచన ఉందా? అన్న ప్రశ్నకు లేదని స్పష్టం చేశారు. అయితే మ్యూజిక్ ఆల్బం చేయాలన్న ఆలోచన ఉందని చెప్పారు. కాగా ఈ బ్యూటీ తదుపరి విష్ణువర్ధన్ దర్శకత్వంలో నటించనున్నట్లు చెప్పారు.అయితే ఆమె చిత్రానికి తీసుకుంటున్న పారితోషికం ఎంతో తెలుసా? కేవలం రూ. 25 లక్షలు మాత్రమేనట. దీనిపై కొందరు ఆమేకేంటి తండ్రి కోట్లు సంపాదిస్తున్నారు అంటూ కామెంట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

పెళ్లయిన పది రోజులకే నవవధువు ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న అను (ఫైల్)

పళ్లిపట్టు: ఏం జరిగిందో ఏమో తెలియదు కాని నూరేళ్ల బంధం పది రోజులకే ముగిసింది. నవవధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. పళ్లిపట్టు యూనియన్ రామసముద్రం పంచాయతీ వీజీఆర్ కండ్రిగ దళితవాడకు చెందిన రవి కుమారుడు ముత్తు(25) జేసీబీ డ్రైవర్. ఇతనికి అదే గ్రామానికి చెందిన సమీప బంధువు రాజేంద్రన్ కుమార్తె అను(22)తో జూన్ 29న గ్రామంలోని వరుడు ఇంట్లో వివాహం జరిగింది. పది రోజుల వ్యవధిలో ఏం జరిగిందో కానీ మంగళవారం రాత్రి భర్త నిద్రిస్తున్న గదిలో అను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వేకువజామున లేచిన ముత్తు భార్య ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని కుటుంబీకులకు తెలిపాడు. పొదటూరుపేట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా వివాహమైన పది రోజులకే నవవధువు ఆత్మహత్యకు సంబంధించి తిరుత్తణి ఆర్డీఓ విచారణ చేపట్టారు.

గంజాయి విక్రేత అరెస్ట్


అరెస్టయిన దేవరాజ్

తిరువళ్లూరు: కర్ణాటక నుంచి గంజాయిని తీసుకొచ్చి రెడ్ హిల్స్‌లో విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూరు జిల్లా రెడ్ హిల్స్‌లో గంజాయి విక్రయం జోరుగా సాగుతున్నట్టు పోలీసులకు రహస్య సమాచారం అందింది. పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. అనుమానాస్పదంగా బ్యాగుతో బస్టాండులో సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పట్టుబడిన వ్యక్తి మైసూరుకు చెందిన శివరాజు కుమారుడు దేవరాజ్(32)గా గుర్తించారు. ఇతను కర్ణాటక నుంచి గంజాయి తీసుకొచ్చి రెడ్‌హిల్స్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఉద్యోగం పేరిట రూ. 90 లక్షలు మోసం


అరెస్టయిన మహ్మద్ ఆరీఫ్ రెహ్మన్

తిరువళ్లూరు: గల్ఫ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి 49 మంది వద్ద సుమారు రూ. 90 లక్షల వరకు వసూలు చేసి ఉడాయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కడలూరు జిల్లా భువనగిరి తాలుకా పరంగిపేటకు చెందిన ఇబ్రహీం కుమారుడు మహ్మద్ ఆరీఫ్ రెహ్మన్(32), ఆవడికి చెందిన మీనాజుద్దీన్‌తో కలిసి టూర్స్ అండ్ ట్రావెల్స్‌ను నిర్వహిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. వీటిని నమ్మి కడలూరుకు చెందిన వైరకన్ను కుమారుడు శైలేష్(31)తో సహా 49 మంది రూ. 90 లక్షలు చెల్లించారు. అయితే ఇంత వరకు ఉద్యోగం ఇప్పించకపోగా, డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు.

నాలుగేళ్ల బాలుడి కిడ్నాప్

- లైంగిక వేధింపులు
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

కొరుక్కుపేట: ఇడప్పాడిలో నాలుగేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సేలం జిల్లా ఇడప్పాడి ప్రాంతానికి చెందిన 4 ఏళ్ల బాలుడు తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. కొంత సేపటి తర్వాత కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రులు చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకుండా పోయింది. దేవూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం వెల్లాలపాళెం వద్ద కావేరి ఒడ్డున పొదల్లో పడవ నడిపే వ్యక్తి బాలుడిని చూశాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. విచారణలో వెల్లలపాళెం గ్రామానికి చెందిన లక్ష్మణన్ (43) బాలుడిని అపహరించినట్లు తేలింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. బాలుడికి మెరుగైన చికిత్స కోసం సేలం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మలద్వారం వద్ద గాయాలు ఉన్నట్లు గుర్తించారు. చిన్న కర్ర ఉండడంతో తొలగించి చికిత్స అందించారు. లక్ష్మణన్‌ను విచారించగా.. చిన్నారిని లైంగికంగా హింసించినట్లు అంగీకరించాడు. నిందితుడిని రాత్రికి రాత్రే కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

ఆస్పత్రిలో రూ.7 లక్షలు చోరీ

తిరువొత్తియూరు: మదురైలోని ఓ ఆస్పత్రిలో రూ.7 లక్షలు చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మదురై కేకేనగర్‌లో డాక్టర్ సుధీర్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. సంఘటన రోజున ఎప్పటిలాగే రాత్రి ఆస్పత్రికి తాళం వేసి ఉద్యోగులు వెళ్లారు. మరుసటి రోజు వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. డాక్టర్ గదిలో ఉంచిన రూ.6.99 లక్షల నగదు అదృశ్యమైంది. దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

చిదంబరంలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీ-కారు ఢీ
- ముగ్గురి దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు


ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు, రోడ్డుపై మృతదేహం

అన్నానగర్: చిదంబరంలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ-కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు మృతి చెందారు. వివరాలు.. నాగై జిల్లా అక్కరాయపేటలోని కుప్పం ప్రాంతానికి చెందిన కార్తికేయన్, వరమతి (30) దంపతులకు కుమారుడు హరిహరన్ (10), కుమార్తె నికల్య (3 నెలలు) ఉన్నారు. కార్తికేయన్ పని నిమిత్తం బహ్రెయిన్ వెళ్లాలని నిర్ణయించుకుని మంగళవారం ఇంటి నుంచి బయలుదేరాడు. వరమతి, నికల్య, హరిహరన్, వరమతి చెల్లెలు వనిత (29), ఆమె ఆరు నెలల కుమారుడు విక్రాంత్, వరమతి తల్లి వనిల్లా (60) సెండ్‌ఆఫ్ ఇవ్వడానికి కారులో చెన్నై విమానాశ్రయానికి వెళ్లారు. కారును కీళపెరుంపళ్లం మేళా వీధికి చెందిన సత్యశీలన్ (38) నడిపాడు. కార్తికేయను విమానాశ్రయంలో వదలి రాత్రి కారులో నగరానికి తిరుగు ప్రయాణమయ్యారు. కడలూరు జిల్లా చిదంబరం సమీపంలోని కొత్తట్ట వద్ద వెళుతుండగా చిదంబరం నుంచి కడలూరు వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యశీలన్, నికల్య, విక్రాంత్ అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న వనిత, వనిల్లా, వరమతి, హరిహరన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం చిదంబరం రాజా ముత్తయ్య వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. పుదుచత్తారం పోలీసు ఇన్‌స్పెక్టర్ వినోద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ టెంపో బోల్తా.. డ్రైవర్ మృతి

-ఇద్దరికి తీవ్ర గాయాలు


రోడ్డుపై పడిన ఆయిల్ టిన్‌లు

వేలూరు: వేలూరు నుంచి ఆంబూరుకు నూనె ప్యాకెట్లు, టిన్‌లతో వెళుతున్న టెంపో బుధవారం తోటాలం వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. వాహనం అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలైన వారిని స్థానికులు బయటకు తీసి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వాహనం ఢీకొన్న ధాటికి రోడ్డు మధ్యలో ఉన్న ఐదు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. వాహనంలోని నూనె ప్యాకెట్లు, టిన్‌లు రోడ్డుపై చెల్లాచెదరుగా పడ్డాయి. జాతీయ రహదారిపై రెండు వైపులా వాహనాలు అక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆంబూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సరి చేశారు. విచారణలో మృతుడు రాణిపేట జిల్లా ఆర్కాడుకు చెందిన డ్రైవర్ శివకుమార్(38)గా గుర్తించారు. వేలూరుకు చెందిన బాలాజీ, శ్రీనివాసన్‌లకు తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: కులశేఖరపట్టణంలో బుధవారం యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణం అన్నాపిల్‌లై ప్రాంతానికి చెందిన రాజేంద్రన్ కుమారుడు రాజేష్ (24) చెన్నైలోని మేడవాక్కంలో పాత పేపర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. కొద్ది నెలలుగా డిప్రెషన్‌తో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో రాజేష్ 7వ తేదీ కులశేఖర పట్టణం వచ్చాడు. మంగళవారం అమ్మమ్మ ఇంటికి వెళ్లి కావాల్సిన సామాన్లు కొఇచ్చి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కులశేఖరపట్టణం సబ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రన్, పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుచెందూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పత్రాలతో బ్యాంకు రుణం

-కేసు నమోదు

తిరువళ్లూరు: స్వయం ఉపాధి పేరిట నకిలీ పత్రంతో రుణం తీసుకున్న మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా మనవాలనగర్ కపిలన్‌నగర్‌కు చెందిన షణ్ముగం కుమార్తె శరణ్య. ఈమె తిరువళ్లూరు పట్టణంలో ప్రెస్‌మ్యాక్స్ ప్రింటింగ్ ప్రెస్‌ను చూపించి సంస్థ పేరుపై రుణం ఇవ్వాలని కెనరా బ్యాంకు తిరువళ్లూరు బ్రాంచ్ అధికారులను ఆశ్రయించింది. బ్యాంకు అధికారులు ఆమెకు రూ. 9.43 లక్షల రుణం మంజూరు చేశారు. అయితే ఆమె వాయిదాలు చెల్లించకపోవడంతో అధికారులు ప్రింటింగ్ ప్రెస్‌కు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందన లేకపోవడంతో విచారణ చేశారు. ప్రింటింగ్ ప్రెస్ శరణ్యకు చెందినది కాదని, ఈకాడుకు చెందిన విల్సన్‌ది అని తెలిసింది. దీంతో షాక్‌కు గురైన బ్యాంకు అధికారులు పోలీసులను ఆశ్రయించారు. బ్యాంకు సిబ్బందిని తప్పదారి పట్టించి బ్యాంకులో లోన్ పొందిన శరణ్యతో పాటు ఆమెకు సహకరించిన విల్సన్‌పై ఫిర్యాదు చేశారు. తిరువళ్లూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణం ముట్టడి


గొల్లకుప్పంలో మద్యం దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

తిరుత్తణి: మద్యం దుకాణం తొలగించాలని మహిళలు బుధవారం ధర్నా చేశారు. తిరువలంగాడు యూనియన్ పొన్పాడి చెక్‌పోస్టు సమీపంలోని టాస్మాక్ మద్యం దుకాణం మూసివేయాలని మంగళవారం గొల్లకుప్పం మహిళలు ఆందోళన చేశారు. బుధవారం రెండో రోజు 150 మంది మహిళలు టాస్మాక్ మద్యం దుకాణం ముట్టడించి నిరసన తెలిపారు. దీంతో టాస్మాక్ దుకాణం తాత్కాలికంగా మూసివేసారు. తాగుబోతులతో తమకు ఇబ్బందిగా మారిందని, రాత్రి సమయాల్లో స్వేచ్ఛగా గ్రామ వీధుల్లో సైతం తిరగలేకపోతున్నామని, తమ పంట పొలాలు సైతం నాశనమవుతున్నట్లు ఆరోపించారు. పోలీసులు రంగప్రవేశం చేసి మహిళలతో మాట్లాడారు.

గ్రామీణులు టాస్మాక్ మద్యం దుకాణం మూసివేతకు సంబంధించి ఫిర్యాదు చేస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు నిరసన విరమించారు. అనంతరం పోలీసుల బందోబస్తుతో ప్రభుత్వ మద్యం షాపు తెరిచి విక్రయాలు చేపట్టారు.

హీరో విజయ్‌కు మరోసారి జరిమానా

తమిళసినిమా: హీరో విజయ్ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో అధికారులు బుధవారం రూ.500 జరిమానా విధించారు. వివరాలు.. నటుడు, విజయ్ ప్రజా సంఘం వ్యవస్థాపకుడు విజయ్ రవాణాశాఖాధికారులకు వరుసగా జరిమానాలు చెల్లిస్తూ ఆ శాఖకు బాధితుడిగా మారరనే చెప్పాలి. అంతకు ముందు ఖరీదైన కారును విదేశాల నుంచి దిగుమతి చేసుకుని లోకల్ టాక్స్ చెల్లించకపోవడంతో కేసులను ఎదుర్కొన్నారు. గత ఏడాది నవంబరులో తన కారు అద్దాలకు నలుపు రంగు కవరును అంటించిన కారణంగా రూ.500 జరిమానా చెల్లించారు. కాగా తాజాగా మరోసారి ట్రాఫిక్ అధికారులు ఆయనకు జరిమానా విధించారు. విజయ్ మూడు రోజుల పాటు తన ప్రజా సంఘం నిర్వాహకులతో చెన్నై, పనైయూర్‌లోని తన కార్యాలయంలో సమావేశం అయిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం విజయ్ స్థానిక నీలాంగరైలోని తన ఇంటి నుంచి పనైయూర్‌లోని తన కార్యాలయానికి కారులో వెళుతూ సంజంపాక్కమ్ ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి అతివేగంగా వెళ్లారు. దీంతో ట్రాఫిక్ అధికారులు ఆయనకు రూ. 500 జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని విజయ్ ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. కాగా విజయ్ రాజకీయ ప్రవేశంలో రాష్ట్రంలో ప్రస్తుతం జోరుగా ఊహాగానాలు సాగుతున్న వేళ.. ఆయనకు జరిమానా విధించడం చర్చనీయాంశంగా మారింది.

మహిళా ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

కొరుక్కుపేట: గూడువాంచేరిలో ప్రభుత్వ వైద్యురాలిని బెదిరించి రూ.12 లక్షలు లంచం డిమాండ్ చేసిన మహిళా ఇన్‌స్పెక్టర్ సస్పెండ్‌కు గురయ్యారు. ఒకే నెలలో ఇద్దరు మహిళా ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేయడం పోలీస్ అధికారుల్లో చర్చనీయాంశం అయ్యింది. తాంబరం మున్సిపల్ పరిధిలోని గూడువాంచేరిలో మహిళా పోలీస్‌స్టేషన్ ఉంది. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి నలుగురు మహిళా పోలీసులు గత జూన్ 3వ తేదీ రాత్రి మణిమంగళం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాతప్పాయి ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడ ఓ టీ దుకాణంలో గొడవకు దిగారనే ఫిర్యాదు మేరకు నలుగురిని సస్పెండ్ చేశారు. కాగా గూడువాంచేరిలో ఇన్‌స్పెక్టర్‌గా మహిత అన్నక్రిష్టి పనిచేస్తున్నారు. నందివరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 12వ తరగతి విద్యార్థిని గర్భం దాల్చిన కేసులో పల్లవరం త్రిశూలం ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ రంజిత్ (27)ను పోక్సో చట్టం కింద మహిత అరెస్టు చేశారు. సింగపెరుమాళ్ ఆలయ ప్రాంతంలో నివసిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలిని బెదిరించారు. బాలికకు అబార్షన్ చేశారని ఆరోపిస్తూ రూ. 12 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టిన హైకమిషనర్ అమల్‌రాజ్ గూడువాంచేరి మహిళా ఇన్‌స్పెక్టర్ మహితను సస్పెండ్ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

లంచం కేసులో రెవెన్యూ అధికారికి జైలు శిక్ష


అరెస్టయిన చంద్రశేఖరన్

తిరువళ్లూరు: క్వారీ నిర్వాహణకు రూ. 10 వేలు లంచంతో పాటు వాషింగ్‌మెషిన్, ఫ్రిడ్జ్ తీసుకున్న తిరుత్తణి డివిజన్ విశ్రాంత ఉద్యోగికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పును వెలువరించింది. వేలూరు జిల్లా అరక్కోణం తాలుకా బోడినాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన బాబు తన బావ శంకర్‌కు తిరుత్తణి తాలుకా కార్తికేయపురం గ్రామంలో భూమి ఉంది. సంబంధిత భూమిలో క్వారీని ప్రభుత్వ అనుమతితో బాబు ప్రారంభించాడు. అయితే క్వారీ నిర్వాహణకు లంచంగా మొదట వాషింగ్‌మెషిన్, తరువాత ఫ్రిడ్జ్ తదితర వస్తువులను రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖరన్ డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీంతో క్వారీ నిర్వాహకుడు బాబు ఆ వస్తువులను కొనుగోలు చేసి ఇంటికి డెలివరీ చేశాడు. అయితే అంతటితో తృప్తి చెందని చంద్రశేఖరన్ మరో రూ.10 వేలు లంచంగా ఇవ్వాలని లేనిపక్షంలో క్వారీకి అనుమతి రద్దు చేస్తానని హెచ్చరించాడు. దీంతో బాబు విజిలెన్స్ పోలీసులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు 2009 ఆగస్టు 10వ తేదీ లంచం ఇస్తుండగా విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ సంఘటనపై విచారణ తిరువళ్లూరు ప్రత్యేక కోర్టులో సాగింది. రుజువు కావడంతో చంద్రశేఖర్‌కు నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వేల్‌అరసు తీర్పును వెలువరించారు.

నూతన భవనం నిర్మించాల్సిందే


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

అన్నానగర్: తంజావూరులో శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్ భవనాన్ని కూల్చివేసి కొత్తది నిర్మించాలని బుధవారం కళాశాల విద్యార్థులు రాస్తారోకో చేశారు. తంజావూరు కొత్త బస్టాండ్ సమీపంలో రాజు సరబోజి ప్రభుత్వ కళాశాల ఉంది. ఇక్కడ 4 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. స్టూడెంట్ హాస్టల్, బ్యాక్‌వర్డ్ స్టూడెంట్స్ హాస్టల్ పని చేస్తున్నాయి. ఇందులో బీసీ హాస్టల్ భవనం 50 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని వర్షానికి ఉరుస్తోంది. దీంతో కొత్త హాస్టల్ భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. బుధవారం హాస్టల్ విద్యార్థులు భారతీయ విద్యార్థి సంఘం కార్యదర్శి అరవిందస్వామి ఆధ్వర్యంలో కొత్త బస్‌స్టేషన్ వద్ద రాస్తారోకో చేశారు. పోలీసులు, కళాశాల యాజమాన్యం ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

డిజిటల్ ప్రభావంపై వినూత్న పరిశోధన


చెన్నైలో చెత్త కుండీల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు

సాక్షి, చెన్నై: దైనందిన జీవితాలపై డిజిటల్ టెక్నాలజీ ప్రభావాన్ని పరిశీలించేందుకు చెన్నైలో ఓ సర్వేను బుధవారం ప్రారంభించారు. స్విమ్స్ ఆసుపత్రి ఈ ఆవిష్కరణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా నగరంలోని మెరీనా తీరం, కోయంబేడు బస్టాండ్, అరుంబాక్కం మెట్రో రైల్వే స్టేషన్, వడపళని తదితర ప్రముఖ ప్రదేశాలలో చెత్త కుండీల వద్ద శోధన, అన్‌లాక్, డౌన్‌లోడ్ బటన్‌లు వంటి బోర్డులను ఉంచి ప్రజల్ని ఆకర్షిస్తున్నారు. చెత్త డంప్‌ల నేపథ్యానికి వ్యతిరేకంగా ఈ బటన్‌ల సమ్మేళనం సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లో చర్చకు దారి తీసింది. ఈ విచిత్రమైన బటన్‌ల ప్రాముఖ్యత, అర్థానికి సంబంధించి, వ్యక్తులు ఆలోచనలు, ఊహాగానాల మార్పిడి, ఇంటర్నెట్, మొబైల్ టెక్నాలజీలోని పదాల ఆధారంగా డిజిటల్ పరికరాల నుంచి విరామం తీసుకోవడం లేదా డిజిటల్ సాంకేతికతతో పెద్ద మార్పును ప్రజలు ఆశిస్తున్నారా..? లేదా..? అనే అంశాన్ని పరిశీలించనున్నారు.

మరో 300 రేషన్ దుకాణాల్లో టమాట విక్రయాలు

- ఒక్కో కార్డుకు కిలో చొప్పున పంపిణీ


రేషన్ షాప్‌లో టమాట తీసుకుంటున్న మహిళలు

సాక్షి, చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా మరో 300 రేషన్ దుకాణాల్లో బుధవారం నుంచి టమాటా విక్రయాలకు శ్రీకారం చుట్టారు. ఒక్కో కార్డుదారుడికి కిలో మాత్రమే రూ. 60కు అందజేశారు. వివరాలు.. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా టమాటా ధర పైపైకి వెళ్తూ వస్తున్న విషయం తెలిసిందే. కట్టడి చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టినా, బయటి మార్కెట్‌లో ధర దిగి రావడం లేదు. టమాటాకు తోడు చిన్న ఉల్లి, అల్లం, వెల్లుల్లి, పచ్చి మిరప తదితర వాటి ధరలు అమాంతంగా పెరిగాయి. బుధవారం బయటి మార్కెట్‌లో కిలో టమాటా రూ. 110 నుంచి రూ.120. చిన్న ఉల్లి రూ. 200 . అల్లం రూ. 250కు పైగా ధర పలికాయి. పెద్ద ఉల్లి సైతం దిగుమతి తగ్గి ఉండడంతో ముున్ముందు కన్నీళ్లు తప్పదేమో. ఈ పరిస్థితుల్లో టమాటాను చౌక ధరకే ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తొలుత చెన్నైలో 82 చౌక దుకాణాలలో కిలో రూ. 60కు అందజేశారు. ఈ విక్రయాలను మరింతగా విస్తరిస్తూ రాష్ట్రంలో మరో 300 దుకాణాలలో బుధవారం నుంచి టమాటా పంపిణీ చేస్తున్నారు. ఇక రద్దీ భారీగా ఉండడంతో టోకెన్లను అందజేసి మరీ టమాటాలను డీలర్లు విక్రస్తున్నారు.

హౌసింగ్ బోర్డులో నిరుపేదలకు మరిన్ని సదుపాయాలు


హౌసింగ్ బోర్డును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: గుడియాత్తం నియోజక వర్గం పేర్నంబట్టు సమీపంలోని బత్తలపల్లిలో నిరుపేదల కోసం నిర్మించిన హౌసింగ్ బోర్డులో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ కుమరవేల్ పాండియన్ తెలిపారు. పేర్నంబట్టులో నీటి కాలువలు, చెరువు పోరంబోకు వంటి ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకున్న 304 మంది పేదలకు అన్ని వసతులతో కూడిన ఇళ్లను హౌసింగ్ బోర్డులో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటిని సీఎం స్టాలిన్ చెన్నై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించగా పేర్నంబట్టు నుంచి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం లబ్ధిదారులకు అందజేసేందుకు అవసరమైన అన్ని ఇల్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం మూడు అంతస్తులతో కూడిన ఏడు బిల్డింగ్‌లు నిర్మించడం జరిగిందన్నారు. వీటికి లబ్ధిదారులను ఎంపిక చేసి రూ. 2.41 లక్షలు డిపాజిట్ నగదును చెల్లించిన వారికి విడతల వారీగా ఇంటి తాళాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అములు, పేర్నంబట్టు యూనియన్ చైర్మన్ చిత్ర, వైస్ చైర్మన్ లలిత, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆలియార్ జూఫర్ అహ్మద్, తహసీల్దార్ వెంకట్రామన్ పాల్గొన్నారు.

కుటుంబంతో సహా డీఎంకే కౌన్సిలర్ బలవన్మరణం


భర్త అరుణ్ లాల్‌తో దేవిప్రియ (ఫైల్)

సేలం: రాశిపురం డీఎంకే మహిళా కౌన్సిలర్ దేవి ప్రియ (31) తన భర్త, కుమార్తెతో కలిసి బలన్మరణానికి పాల్పడింది. బుధవారం వారి ఇంట్లో వారు ఉరికి వేలాడుతుండటాన్ని గుర్తించిన పోలీసులు విచారణను వేగవంతం చేశారు. వివరాలు.. నామక్కల్ జిల్లారాశిపురం బొమ్మితేరు ప్రాంతానికి చెందిన అరుణ్‌లాల్(42) రెండు దశాబ్దాలుగా స్థానికంగా నగల దుకాణం నడుపుతున్నాడు. ఆయనకు భార్య దేవి ప్రియ(31), కుమార్తె మోనిక శ్రీ(18)తో పాటు మరో కుమార్తె ఉన్నారు. దేవిప్రియ రాశిపురం మునిసిపాలిటీ 13వ వార్డు డీఎంకే కౌన్సిలర్‌గా ఉన్నారు. మోనిశ్రీ ప్లస్-2 ఉత్తీర్ణత సాధించి ఉంది. పెద్దకుమార్తె బెంగళూరులోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తోంది. ఈ పరిస్థితులలో బుధవారం ఉదయం వీరి ఇంటి తలుపులు ఎంతకూ తెరుచుకోక పోవడంతో ఇరుగు పొరుగు వారు కిటికి గుండా లోనికి చూశారు. అరుణ్ లాల్, దేవి ప్రియ ఉరికి వేలాడుతుండటంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు పగల కొట్టి లోనికి వెళ్లారు. దంపతులు ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. చిన్న కుమార్తె మోనిక శ్రీకి విషం తాగి మరణించినట్లు తేలింది. ఎంతో ఆనందంగా ఉన్న కుటుంబం హఠాత్తుగా బలన్మరణానికి పాల్పడటం అనుమానాలకు దారి తీశాయి. వ్యాపారంలో ఏదైనా నష్టం వచ్చిందా..? లేదా మరేదేని కారణాలు ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వీరి మృతి విషయాన్ని బెంగళూరులోని పెద్దకుమార్తెకు పోలీసులు తెలియజేశారు.

విద్యుత్ కోతలపై ఆగ్రహం


కలెక్టరేట్‌ను ముట్టడించిన గ్రామస్తులు


పోలీసులతో వాగ్వాదం

తిరువళ్లూరు: నాలుగు రోజులుగా తమ గ్రామంలో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో చీకటిలో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నామని బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయాన్ని వీరరాఘవపురం గ్రామస్తులు ముట్టడించారు. తిరువళ్లూరు జిల్లా వీరరాఘవపురం గ్రామంలో సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. నాలుగు రోజుల క్రితం భారీ ఈదురు గాలితో కూడిన వర్షం పడింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సదుపాయం లేకపోవడంతో నాలుగు రోజులుగా గ్రామస్తులు చీకటిలోనే గడుపుతున్నారు. తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు ఏర్పడింది. గ్రామంలో ఏర్పడిన సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉన్నత అధికారులకు నాలుగు రోజుల నుంచి విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు బుధవారం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్‌ను పునరుద్ధరించి తాగునీటి సమస్య లేకుండా చూడాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తులతో చర్చలకు యత్నించారు.

ఆ సమయంలో గ్రామస్తులు పోలీసులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం నెలకొంది. పోలీసులు వారిని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లగా గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీష్ సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో వెనుదిరిగారు.

పారిశుధ్య కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

కొరుక్కుపేట: పారిశుధ్య పనులు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించవద్దంటూ కార్మికులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ క్రమంలో 500 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై కార్పొరేషన్‌లోని 4,5,6 జోన్‌లలో పారిశుధ్య పనులను ప్రైవేట్‌కు అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. దీనికి వ్యతిరేకంగా కమ్యూనిస్ట్ నాయకులతో కలిసి పారిశుధ్య కార్మికులు బుధవారం నిరసన చేపట్టారు. దీనిపై కార్పొరేషన్ మేయర్‌కు అధికారులు ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ వ్యక్తులకు పరిశుధ్య పనులు అప్పగించడం వల్ల కార్మిక కుటుంబాలు నష్ట పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పాలకులు తమ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం చెన్నై సెంట్రల్ స్టేషన్ సమీపంలోని రిబ్బన్ బిల్డింగ్ ఎదుట బైఠాయించారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రవేశ ద్వారాన్ని స్వల్పంగా మూసివేశారు. పారిశుధ్య కార్మికులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సెంట్రల్ స్టేషన్ నుంచి జీహెచ్ వరకు, అలాగే పెరియమేడు ప్రాంతంలో కూడా ట్రాఫిక్ స్తంభించింది. ఈ నిరసన కార్యక్రమంలో మహిళలు అధికంగా పాల్గొన్నారు. కార్పొరేషన్ ప్రైవేటీకరణను ఖండిస్తూ నినాదాలు చేశారు. ఇందులో యూనియన్ ప్రెసిడెంట్ కన్నన్ , మాజీ ఎమ్మెల్యే మహేంద్రన్ పాల్గొని పారిశుధ్య కార్మికులకు సంఘీభావం తెలిపారు.

క్లుప్తంగా...

విపత్తు నిధులు విడుదల చేసిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం విపత్తు స్పందన నిధులు విడుదల చేసింది. గతేడాది యుటిలైజేషన్ సర్టిఫికెట్లు అందజేయనప్పటికీ మార్గదర్శకాలు సడలించి ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.493.60 కోట్లు, తెలంగాణకు రూ.188.80 కోట్లు విడుదల చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,420.80 కోట్లు మంజూరు చేసింది.

గ్రామ స్థాయిలోనే 100% క్యాన్సర్ స్క్రీనింగ్

- వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు



తాడేపల్లి రూరల్: గ్రామ స్థాయిలో 100 శాతం క్యాన్సర్ స్క్రీనింగ్‌కు కార్యాచరణ రూపొందించామని, ఇప్పటికే అనకాపల్లిలో వంద శాతం క్యాన్సర్ స్క్రీనింగ్ చేసేందుకు విశాఖలోని హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి పైలట్ ప్రాజెక్ట్ కింద చేపడుతోందని వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు చెప్పారు. బుధవారం గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు వద్ద మణిపాల్ హాస్పిటల్‌లో మెదడు రుగ్మతలు, గుండె జబ్బుల్ని గుర్తించేందుకు అత్యాధునిక పాజిట్రాన్, ఎమిషన్ టోమోగ్రఫీ స్కాన్, త్రీడీ మోమోగ్రఫీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద గతేడాది రూ.600 కోట్లు ఖర్చు చేశామన్నారు. గ్రామస్థాయిలో నియమించిన సీహెచ్‌వో, ఏఎన్‌ఎం, ఆశాలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రతిఏటా 62 వేల నుంచి 70 వేల వరకు క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశంతో సమగ్ర క్యాన్సర్ నివారణా విధానాన్ని రూపొందించామన్నారు. మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి, మణిపాల్ ట్రూ టెస్ట్ ఆపరేషన్స్ హెడ్ ప్రెసిడెంట్ నీరజ అరోరా, సీనియర్ రేడియాలజిస్ట్ డాక్టర్ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పురందేశ్వరి బాధ్యతల స్వీకారం

16న బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 13న (గురువారం) బాధ్యతలు చేపట్టనున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ చేపట్టే కార్యకలాపాలపై చర్చించేందుకు ఈ నెల 16న రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కొత్త అధ్యక్షురాలి నియామకం తర్వాత తొలిసారి ఈ సమావేశం జరగనున్నట్లు తెలిపారు. సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ ఏపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి వి.మురళీధరన్, పార్టీ సంస్థాగత జాతీయ సహ సంఘటన కార్యదర్శి శివప్రకాష్ హాజరవుతారని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు సమావేశంలో పాల్గొంటారని వివరించారు.

వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లకు చర్యలు: జీవీఎల్



ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): రాష్ట్రంలో అనేక వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల కల్పనకు కృషి చేయనున్నట్లు బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు వెల్లడించారు. బుధవారం లాసన్స్ బే కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 142 బీసీ కులాలు ఉన్నాయన్నారు. అయితే చాలా కులాల వారు రిజర్వేషన్ల ఫలాలకు, ప్రభుత్వ గుర్తింపునకు దూరమవుతూనే ఉన్నారని చెప్పారు. ఉత్తరాంధ్రకు చెందిన కళింగ వైశ్యులు, శిష్టకరణలు, సొంది కులాల వారు ఇటీవల తనను కలిసి సమస్యను వివరించారని వెల్లడించారు. అయితే ఆయా వర్గాలన్నీ గతకొన్నేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించనున్నట్లు వెల్లడించారు. శిష్టకరణాలు, కళింగ వైశ్య నాయకులతో పాటు పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

చెరువులకు సాగునీరు అందిస్తా: లోకేశ్




కొండాపురం: యువగళం పాదయాత్ర బుధవారం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం చేరింది. అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సోమశిల ఉత్తర కాలువ ద్వారా మండలంలోని అన్ని చెరువులకు సాగునీరు అందిస్తామన్నారు. అంతకుముందు రామానుజపురంలో లోకేశ్‌కు ఉదయగిరి టీడీపీ ఇన్‌చార్జ్ బొల్లినేని రామారావు తదితరులు స్వాగతం పలికారు.

చందాదారుల చాటున పిటిషన్లు!

మార్గదర్శి చిట్ గ్రూపుల మూసివేతపై హైకోర్టులో పలు పిటిషన్లు

- దాఖలు చేసిన వేర్వేరు న్యాయవాదులు
- పేరాలతో సహా పిటిషన్లలో వివరాలన్నీ ఒకటే
- పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మీనాక్షి అరోరా వాదనలు
- ఖరీదైన న్యాయవాదిని సాధారణ చందాదారులు నియమించుకోవడంపై పలు సందేహాలు
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: భారీగా ఆర్థిక అక్రమాలు వెలుగు చూసిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కొన్ని చిట్ గ్రూపులను మూసివేసిన నేపథ్యంలో యాజమాన్యం తన చందాదారులను రంగంలోకి దించింది. చిట్ గ్రూపుల మూసివేతను సవాల్ చేస్తూ వారి ద్వారా హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లను దాఖలు చేయించింది. పిటిషన్లు దాఖలు చేసిన న్యాయవాదులు కూడా వేర్వేరు. పిటిషన్లు వేర్వేరు అయినప్పటికీ అందులో పేర్కొన్న వివరాలన్నీ దాదాపు ఒకే రకంగా ఉన్నాయి. పేరా నంబర్లు సైతం ఒకటే ఉన్నాయి. ఇదంతా ఒక ఎత్తు కాగా పిటిషనర్ల తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు ప్రముఖ సీనియర్ న్యాయవాదుల్లో ఒకరైన మీనాక్షి అరోరాను రంగంలోకి దించడం గమనార్హం. ఆమె ఒక్కో కేసుకు రోజుకు సగటున రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు (సుప్రీంకోర్టు వెలుపల వాదించే కేసుల్లో) తీసుకుంటారని సుప్రీంకోర్టు న్యాయవాదుల ద్వారా తెలిసింది. అంత పెద్ద మొత్తం తీసుకునే సీనియర్ న్యాయవాదిని నియమించుకునే సామర్థ్యం సాధారణ చందాదారులైన పిటిషనర్లకు ఉంటుందా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి.

చిట్ గ్రూపు చందాదారుల తరఫున బుధవారం వాదనలు వినిపించిన మీనాక్షి అరోరా పిటిషనర్ల తరఫున కంటే మార్గదర్శి గురించే ఎక్కువగా వాదించడం విశేషం. మార్గదర్శి చరిత్ర, టర్నోవర్, చందాదారుల వివరాలను నివేదించారు. ఇప్పటివరకు మార్గదర్శిపై చందాదారుల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని కోర్టుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ నిరంతరాయంగా మార్గదర్శిని వేధింపులకు గురి చేస్తున్నాయని చెప్పారు. సీఐడీ కేసులపై మార్గదర్శి యాజమాన్యం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి స్టే కూడా పొందిందని తెలిపారు. చందా తాలుకూ చెక్కు మొత్తాన్ని 7 రోజుల్లో చెల్లించాల్సి ఉండగా మార్గదర్శి యాజమాన్యం 30 రోజుల తరువాత చెల్లించిందని, ఇంత చిన్న కారణంతో చిట్ గ్రూపును మూసివేశారని పేర్కొన్నారు. ఎలాంటి నోటీసు, వాదనలు వినిపించుకునే అవకాశం ఇవ్వకుండా నేరుగా చిట్ గ్రూపు మూసివేత ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ సమయంలో న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య జోక్యం చేసుకుంటూ చిట్ గ్రూపు మూసివేత ఉత్తర్వులపై అప్పీల్ దాఖలు చేసుకునే ప్రత్యామ్నాయం ఉన్నప్పుడు దాన్ని ఉపయోగించుకోకుండా నేరుగా హైకోర్టును ఎలా ఆశ్రయిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నందున నేరుగా హైకోర్టును ఆశ్రయించామని మీనాక్షి అరోరా పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం ఉన్నా నేరుగా హైకోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు తీర్పులున్నాయని చెప్పారు. చిట్ గ్రూపుల మూసివేతకు బదులు అధికారులు జరిమానా విధించి వదిలేసి ఉండాల్సిందన్నారు. మీనాక్షి అరోరా వాదనలను ముగించడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

నల్ల'మార్గ'ం ఉక్కిరిబిక్కిరి!

▶ మొదటి పేజీ తరువాయి

ఇంకా కొనసాగుతోంది. ఇప్పటిదాకా 800 మందికిపైగా అక్రమ డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. డిపాజిట్ చేసిన మొత్తం ఎలా ఆర్జించారు? ఆదాయ మార్గాలను వెల్లడించాలని నోటీసుల్లో పేర్కొంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) నిబంధనలను పాటించారా? అనే వివరాలను వెల్లడించాలని మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను ఆదేశించింది. అంత భారీ మొత్తాన్ని జాతీయ బ్యాంకులు, కేంద్ర ఆర్థిక సంస్థల్లో కాకుండా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో దాచడం సాధారణ అంశం కాదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జాతీయ బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై 5 శాతం కంటే అధికంగా వడ్డీ చెల్లిస్తున్నాయి. మార్గదర్శి కేవలం 5 శాతం వడ్డీనే చెల్లించడం, అదికూడా ఓ రశీదు జారీ చేసి సరిపుచ్చుతున్నా భారీగా డిపాజిట్లు చేయడం వెనుక పెద్ద మతలబే ఉన్నట్లు స్పష్టమవుతోంది. జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలంటే ఆ ఆదాయం ఎలా వచ్చిందో చెప్పాలి. పాన్, ఆధార్ నంబర్ ఇతర వివరాలను సమర్పించాలి. ఆర్బీఐ, ఆదాయపన్ను, సీబీడీటీ అధికారుల దృష్టిలో పడుతుంది. ఆ వివరాలేవీ వెల్లడించేందుకు సుముఖంగా లేనివారు మాత్రమే ఇతర సంస్థల్లో డిపాజిట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే వారు డిపాజిట్ చేసేదంతా నల్లధనమే కాబట్టి.

ఇదే తరహా మోసంలో సహారా చైర్మన్‌కు జైలు శిక్ష

బడాబాబుల నల్లధనాన్ని గుట్టుచప్పుడు కాకుండా దాచేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఓ వేదికగా మారిందన్న వాదనకు తాజా పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. అక్రమ డిపాజిట్ల ద్వారా భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తెస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలోనూ మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు ఇలాంటి వ్యవహారాలనే సాగించినట్లు ఆర్థిక నిపుణులు గుర్తు చేస్తున్నారు. అక్రమ డిపాజిట్లు సేకరించిన సహారా పరివార్ లాంటి సంస్థలు తమ డిపాజిట్‌దారుల వివరాలను గోప్యంగా ఉంచటాన్ని ప్రస్తావిస్తున్నారు. సహారా ఇండియా అక్రమ డిపాజిట్ల వ్యవహారం గుట్టు రట్టు కావడంతో సంస్థ చైర్మన్ సుబ్రతోరాయ్‌కు న్యాయస్థానం జైలు శిక్ష విధించడం గమనార్హం. ఈ నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమ డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బుకాయించబోయి దొరికిన రామోజీ

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.కోటి కంటే ఎక్కువ మొత్తం డిపాజిట్ చేసిన వారికి సీఐడీ నోటీసులు జారీ చేయడంతో ఈ కేసులో ఏ–1గా ఉన్న సంస్థ చైర్మన్ రామోజీరావు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తమ డిపాజిట్‌దారులకు నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ పత్రికా ప్రకటన జారీ చేసింది. తాము చిట్‌ఫండ్స్ చట్టం, ఆదాయపన్ను చట్టాన్ని సక్రమంగా పాటిస్తున్నట్లు అందులో పేర్కొంది. అయితే ఆర్బీఐ, సీబీడీటీ నిబంధనలను పాటిస్తున్నట్లు ఎక్కడా పేర్కొనకపోవడం గమనార్హం. చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లు సేకరించడాన్ని ఆర్బీఐ అనుమతించడంలేదు. డిపాజిట్ల సేకరణపై సీబీడీటీ కింద పన్నులు చెల్లించాలి. అలా చెల్లించినట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎక్కడా చెప్పడం లేదు. ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకే ఆదాయపన్ను చట్టాన్ని పాటిస్తున్నట్లు మభ్యపుచ్చుతున్నట్లు స్పష్టమవుతోంది.

బీజేపీతో పొత్తుపై చులకన కాలేను

- ఎంపిక చేసిన అనుకూల మీడియాతో ఇష్టాగోష్టిలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: బీజేపీతో పొత్తు పెట్టుకునే విషయంపై ఇప్పుడు మాట్లాడి తాను చులకన కాదలచుకోలేదని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు చెప్పారు. బుధవారం ఎంపిక చేసిన మీడియా ప్రతినిధులతో మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీతో పొత్తుపై విలేకరుల ప్రశ్నలకు జవాబిస్తూ.. ఎవరెవరో మాట్లాడే వాటిపై తాను స్పందించనని అన్నారు. అవసరమైతే ఢిల్లీతో పోరాటం చేస్తామని చెప్పారు. రాష్ట్ర సమస్యలపై ప్రభుత్వం, ప్రజలు గట్టిగా ఉంటే కేంద్రం దిగి వస్తుందని, ఇందుకు జల్లికట్టు ఘటనే ఉదాహరణ అని అన్నారు. ఇటీవల బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి అమిత్ షా అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు గాశారు. ఆయనతో కొద్దిసేపు మాట్లాడి వచ్చారు. అనంతరం తెలుగుదేశం పార్టీతో పొత్తుకు బీజేపీ సిద్ధమైందంటూ ఎల్లో, సోషల్ మీడియాలో ఊదరగొట్టారు. అయితే, బుధవారం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తమను గందరగోళంలో పడేస్తున్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

వలంటీర్లను ప్రజా సేవకే పరిమితం చేస్తాం

తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను ప్రజా సేవకు మాత్రమే పరిమితం చేసే విషయాన్ని పరిశీలిస్తామని చంద్రబాబు చెప్పారు. పవన్ కళ్యాణ్ వలంటీర్లకు వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. వలంటీర్లు వ్యక్తిగత సమాచారం సేకరించడం ద్రోహమన్నారు. వలంటీర్ల సేవలను గౌరవిస్తామని, కానీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లా పనిచేస్తామంటే సహించేది లేదని అన్నారు. వైఎస్సార్‌సీపీ విధ్వంసం వల్ల టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సవాళ్లు ఉంటాయన్నారు. అయినా తనకున్న బ్రాండ్, పాలసీలతో వేగంగా సంపద సృష్టిస్తానని తెలిపారు. తాను చెప్పిన పూర్ టు రిచ్ విధానాన్ని అర్థం చేసుకోవడం కష్టమేనని, కానీ దానివల్ల అద్భుతాలు జరుగుతాయని చెప్పారు. తాము ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. ఈ నెల 14న పార్టీ కార్యాలయంలో మహాశక్తి కార్యక్రమంపై ప్రచారం ప్రారంభిస్తామన్నారు. బస్సులు, కార్ల ద్వారా మహిళా నేతలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 50 రోజులు పర్యటనలు చేస్తారని తెలిపారు. మహిళలకు ఇంకా ఏం చేయవచ్చనే దానిపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు.

రామోజీకి ఇచ్చే గౌరవం ఇదేనా?

రాజధాని కేసు డిసెంబర్‌కు వాయిదా పడిందని, అది ఎప్పుడు తేలుతుందో తెలియదన్నారు. ఒక మూర్ఖుడి నిర్ణయానికి తెలుగు జాతి బలి అవ్వాలా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టును జగన్ అసమర్థతతో నాశనం చేశారని విమర్శించారు. నదుల అనుసంధానం కోసం తాను ప్రతిపాదించిన ప్రణాళికను చేపట్టి ఉంటే నీటి కరువు ఉండేది కాదన్నారు. తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసుకుందని, ఏపీ మాత్రం పోలవరాన్ని పూర్తి చేయలేకపోయిందని అన్నారు. రాష్ట్రంలో దొంగ ఓట్ల వ్యవహారంపై పోరాటాన్ని తీవ్రం చేస్తామని తెలిపారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా వదిలేది లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను మీడియా సంస్థగా ఈనాడు ప్రశ్నిస్తోందనే మార్గదర్శిపై కేసులు పెట్టారని విమర్శించారు. మార్గదర్శి చిట్‌ఫండ్ చందాదారులకు నోటీసులు ఇవ్వడానికి సీఐడీకి అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. మార్గదర్శిని ప్రశ్నించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. పద్మవిభూషణ్ రామోజీరావును గౌరవించుకునే విధానం ఇదేనా అని చంద్రబాబు అన్నారు.

చంద్రబాబు సింగపూర్ పార్ట్‌నర్ 'ఈశ్వరన్' ఔట్

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు నాటి సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని సింగపూర్ ప్రభుత్వ సహకారంతో దేవతల రాజధాని అమరావతిని తలదన్నే రీతిలో నూతన నగరాన్ని నిర్మిస్తానంటూ నమ్మబలికారు. రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే అంశంపై వందిమాగధులకు లీకులిచ్చి భారీ ఎత్తున భూములను కాజేశారు. ఆ తర్వాత తాపీగా రాజధాని ప్రాంతాన్ని ప్రకటించారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ను ముందు పెట్టి గ్రాఫిక్స్ చూపిస్తూ అందరినీ మభ్యపుచ్చారు. ఈ క్రమంలో రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ముసుగులో సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలిపి రూ.లక్ష కోట్లు స్వాహా చేసేందుకు స్కెచ్ వేశారు.

సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం అన్నట్లుగా..

రాజధానిలో 1,691 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా ప్రాజెక్టుకు సంబంధించి స్విస్ చాలెంజ్ విధానాన్ని తుస్సుమనిపించి ఇతర కంపెనీలేవీ బిడ్లు దాఖలు చేయకుండా సింగపూర్ సంస్థలు అసెండాస్–సిన్‌బ్రిడ్జి–సెంబ్‌కార్ప్ కన్సార్టియంకి కట్టబెడుతూ 2017 మే 2న నాటి చంద్రబాబు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఆ సంస్థల కన్సార్టియంకు స్టార్టప్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టును అప్పగిస్తూ 2017 మే 12న ఈశ్వరన్‌తో చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో రాజధాని నిర్మాణం కోసం ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం కుదుర్చుకున్నట్లు చంద్రబాబు ప్రచారం చేసుకున్నారు. ఆ ప్రాజెక్టులో పెట్టుబడి సహా మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5,721.9 కోట్లు వెచ్చించే రాష్ట్ర ప్రభుత్వం వాటా 42 శాతం కాగా కేవలం రూ.306.4 కోట్లు పెట్టుబడి పెట్టే సింగపూర్ కంపెనీల కన్సార్టియం వాటా 58 శాతం కావడం గమనార్హం. కన్సార్టియం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) కలిసి 15 ఏళ్లలో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా గ్రాస్ టర్నోవర్‌లో మొదటి విడత 5 శాతం, రెండో విడత 7.5 శాతం, మూడో విడత 12 శాతం (సరాసరి 8.7 శాతం) ఆదాయం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే సరిపోతుందని నాటి చంద్రబాబు కేబినెట్ అంగీకరించింది. ఈ ముసుగులో రూ.లక్ష కోట్లకుపైగా దోచుకోవడానికి స్కెచ్ వేశారు.

అక్రమాల ఒప్పందం రద్దు..

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడంతో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో అసెండాస్–సిన్‌బ్రిడ్జి–సెంబ్‌కార్ప్ కన్సార్టియంతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని సింగపూర్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఈ ఒప్పందం రద్దు అయింది.

అందరికీ అవకాశాలు: విజయసాయిరెడ్డి

- ఆధునిక పద్ధతిలో రాష్ట్రంలో భూముల సర్వే

సాక్షి, అమరావతి: ప్రతిపక్షంలో ఉండగా పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవులిచ్చి అవకాశాలు కల్పించారని వైఎస్సార్‌సీపీ నేత, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. వివిధ నియోజకవర్గాలలో పదవులు లభించని ఒకరిద్దరు నాయకులకు కూడా న్యాయం జరిగేలా పార్టీ చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి నేతృత్వంలో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.13,295 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న వివిధ రకాల పరిశ్రమల్లో 10,181 ఉద్యోగాల కల్పనకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిందన్నారు. అన్ని రకాల పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించేలా తీసుకున్న నిర్ణయాన్ని సమర్థంగా అమలు చేయాలని సీఎం జగన్ ఆదేశించారన్నారు. ఆధునిక పద్ధతిలో భూముల రీ సర్వేను తొలిదశలో 2,000 గ్రామాల్లో పూర్తి చేసి డిజిటల్ రికార్డులను రూపొందించినట్లు తెలిపారు.

2024లో జగనన్న వన్స్‌మోర్: ఎంపీ ఆళ్ల

రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉంటే సుభిక్షంగా, ప్రశాంతంగా ఉంటుందో ఆ నాయకుడి చేతుల్లోనే ప్రస్తుతం ఉందని ఎంపీ అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడువు విధించి మరీ అర్హులకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారని చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా జగనన్న సురక్ష ద్వారా ప్రయోజనాన్ని చేకూరుస్తున్నారని తెలిపారు. 2024లో జగనన్న వన్స్‌మోర్ సీఎం కావడం ఖాయమన్నారు.

తూ.గో జిల్లా మహిళకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయం

కడప కార్పొరేషన్: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం, పాత తుంగపురానికి చెందిన జంపా దుర్గ అనే మహిళకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయమందించింది. ఆమెకు తాత్కాలిక పాస్‌పోర్ట్ తయారు చేయించి స్వస్థలానికి పంపింది. వివరాలిలా ఉన్నాయి. నాలుగేళ్లక్రితం హౌస్ మెయిడ్ పనికోసం జంపా దుర్గ కువైట్ వెళ్లింది. కువైటీ ఇంట్లో పని ఎక్కువ, జీతం తక్కువ కావడం .. ఆ జీతం కూడా సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల రెండేళ్లక్రితం ఆ ఇంటినుంచి పారిపోయి బయటి పనులు చేసుకుంటూ ఉండేది. కువైటీ ఆమె పారిపోయిందని కేసు పెట్టడం వల్ల పట్టుబడితే ఆమెను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. దీంతో ఆమె ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ప్రావిజనల్ కో–ఆర్డినేటర్ ఎన్వీ సుబ్బారెడ్డిని కలిసి తన పరిస్థితిని వివరించింది. తన పాస్‌పోర్టు కూడా కువైటీ వద్దనే ఉందని, తనను ఎలాగైనా ఇండియాకు పంపించమని వేడుకుంది. సుబ్బారెడ్డి ఆమెను భారత ఎంబసీకి తీసుకుపోయి తాత్కాలిక పాస్‌పోర్టు తయారు చేయించి ఈనెల 9వ తేదీ ఇండిగో విమానం ద్వారా ఇండియాకు పంపించారు. 10వ తేదీ ఆమె తన స్వస్థలమైన పాత తుంగాపురం చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈవో హేమలత, డైరెక్టర్ ఇలియాస్, వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి, సుబ్బారెడ్డికి ధన్యవాదాలు తెలిపింది.



దుర్గకు తాత్కాలిక పాస్‌పోర్టు ఇస్తున్న సుబ్బారెడ్డి

తెలంగాణ

గూడ్స్ వ్యాగన్‌లో మంటలు

- మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలిపివేత
- మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

మంచిర్యాల క్రైం: నాగపూర్ నుంచి సికింద్రాబాద్ వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న ఓ గూడ్స్ రైలు బుధవారం మధ్యాహ్నం మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు రైలును మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలిపివేసి స్థానిక అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

వలంటీర్లపై దౌర్జన్యకాండ

- రెచ్చిపోయిన టీడీపీ నేతలు, జన సైనికులు
- గుంటూరులో యరపతినేని కుటుంబ సభ్యుల అరాచకం
- మూడు గంటల సేపు మహిళా వలంటీర్ నిర్బంధం
- ప్రకాశం జిల్లా పీరాపురంలో రాడ్లు, కర్రలతో దాడి
- విశాఖలో నిరసన తెలుపుతున్న వారిపై దాడికి యత్నం
- జనసైనికుల నిర్వాకంతో ఓ మహిళ చీరకు నిప్పంటుకుని మంటలు
- కృష్ణా జిల్లా పమిడిముక్కలలో చంపేస్తామని బెదిరింపు
- శ్రీకాళహస్తిలో సీఐపై దూషణల పర్వం



విశాఖలో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జనసైనికులు



వలంటీర్, సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు భార్య

సాక్షి ప్రతినిధి, గుంటూరు/జరుగుమల్లి (సింగరాయకొండ)/జగదాంబ (విశాఖ దక్షిణ)/పమిడిముక్కల/రేణిగుంట: ప్రజలకు సేవలందిస్తున్న తమ వ్యవస్థపై విషం చిమ్మడం సరికాదన్న వలంటీర్లపై జనసేన, టీడీపీ నేతలు కూడబలుక్కుని దౌర్జన్యానికి తెగబడుతున్నారు. అకారణంగా దూషిస్తూ దాడులకు దిగుతున్నారు. గుంటూరులో గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ఒక మహిళా వలంటీర్‌ను మూడు గంటల సేపు నిర్బంధించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు అందరి ఇళ్లను మ్యాపింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం రింగ్ రోడ్డులోని యరపతినేని ఇంటికి వలంటీర్ వెళ్లింది. పథకాలు ఏమీ రాకపోయినా మ్యాపింగ్ చేయాల్సి ఉందని చెప్పడంతో యరపతినేని భార్య అంగీకరించి ఫింగర్ ప్రింట్ కూడా వేసింది. తర్వాత వలంటీర్ కిందకి వచ్చి బండి బయటకు తీస్తున్న సమయంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ వచ్చి మేడం పిలుస్తున్నారని చెప్పడంతో మళ్లీ పైకి వెళ్లింది. యరపతినేని ఇంట్లో ఉన్న అతని బావమరిది వలంటీర్‌తో వాగ్వాదానికి దిగి ఆమెను నిర్బంధించారు. మా ఇంటికి ఎందుకు వచ్చారు. మా ఓట్లు తీసివేయడానికా, మా ఆస్తులు రాయించుకోవడానికా.. అంటూ నిలదీశారు. యరపతినేని శ్రీనివాసరావు కూడా ఫోన్‌లో వలంటీర్‌ను బెదిరించారు. దీంతో ఆమె సచివాలయం ప్లానింగ్ సెక్రటరీకి ఫోన్ చేయగా అతను, మరో ఉద్యోగి కలిసి వచ్చారు. వారితో కూడా వాగ్వాదం చేశారు. రాత్రి 9–15కు టీవీ–5 కెమెరామెన్ వచ్చి విజువల్స్ తీసుకున్న తర్వాత వారిని వదిలిపెట్టారు.

మట్టి తొలగించమని చెప్పడమే పాపమైంది..



బండి రమణయ్య

ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పీరాపురంలో టీడీపీ నేత ఎల్లావుల వెంకటేశ్వర్లు ఇల్లు మరమ్మతు చేసుకుంటూ వలంటీర్ బండి శ్రీనివాసుల రెడ్డికి చెందిన స్థలంలో మట్టిని తెచ్చి పోశాడు. తమ స్థలంలో మట్టి ఎందుకు పోస్తున్నావని వలంటీర్ ప్రశ్నించాడు. 'ఇది నీ స్థలం కాదు.. నా స్థలం' అని ఎదురుదాడికి దిగడంతో వలంటీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో టీడీపీ నేత వెంకటేశ్వర్లు, మరో 10 మంది రాడ్లు, కర్రలతో వచ్చి.. వలంటీర్ శ్రీనివాసులరెడ్డి, అతని తండ్రి వెంకటేశ్వర్లు, బాబాయి రమణయ్యపై దాడి చేశారు. రమణయ్య తలకు తీవ్ర గాయమైంది. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

పవన్‌ను ఏమైనా అంటే ఊరుకోం..

విశాఖలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, వలంటీర్లపై జన సైనికులు దాడికి పాల్పడ్డారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మహిళా పోలీసులపై పాలు చల్లి రచ్చ చేశారు. వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో వలంటీర్లు పూర్ణామార్కెట్ జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సమయంలో జనసేన సైనికులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. పవన్‌ను ఏమైనా అంటే ఊరుకోం అంటూ రెచ్చిపోయారు. అంటుకున్న దిష్టిబొమ్మను వీరిపై వేశారు. దీంతో కండిపిల్లి వరలక్ష్మి అనే మహిళ చీరకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మంటలు ఆర్పివేయంతో ప్రమాదం తప్పింది. 14 మంది జన సైనికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చంపేసి శ్మశానంలో పాతిపెడతాం..

కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మంటాడకు చెందిన జనసేన కార్యకర్త కె.ప్రవీణ్‌కుమార్ మంగళవారం సాయంత్రం రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పామర్రు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కంభపు రాంబాబుకు ఫోన్ చేసి పవన్ కళ్యాణ్‌పై ఎందుకు విమర్శలు చేశావంటూ వాగ్వాదానికి దిగాడు. దీంతో రాంబాబు తాను పోలీసులకు చెబుతానని ఫోన్ కట్ చేశాడు. మరో నాలుగైదుసార్లు ఫోన్ చేసినా అలాగే కట్ చేశాడు. రాత్రి ప్రవీణ్‌కుమార్ మరో ముగ్గురు జనసేన కార్యకర్తలతో కలిసి అతని ఇంటికెళ్లి రాంబాబు ఎక్కడ అని ప్రశ్నించారు. ఇంట్లో లేరని చెప్పిన అతడి భార్యను దుర్భాషలాడుతూ భయానక వాతావరణం సృష్టించారు. పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేస్తే రాంబాబును చంపేసి శ్మశానంలో పాతిపెట్టి చెప్పులదండ వేస్తామని హెచ్చరించారు. కుటుంబంలో అందరినీ చంపేస్తామని భ్రయభ్రాంతులకు గురి చేశారు. రాంబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా సీఐని దుర్భాషలాడిన జనసేన నేత

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో జనసేన నాయకురాలు నగరం వినుత ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పది తలల రావణుడంటూ దిష్టిబొమ్మను తయారు చేసి అనుచితంగా కాలితో తన్నడంతో పాటు కాల్చేస్తుండగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇలాంటి ఆందోళనలకు అనుమతి లేదంటూ శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్, బుచ్చినాయుడు కండ్రిగ సీఐ విక్రమ్ సిబ్బందితో అడ్డుకున్నారు. ఈ క్రమంలో జనసేన పార్టీ జిల్లా సెక్రటరీ కొట్టేటి సాయి సుమారు 15 మంది కార్యకర్తలతో కలసి ఉన్నపళంగా పెళ్లిమండపం వద్దకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను కింద పడవేసి కాలితో తొక్కుతూ పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జై.. పవన్ కల్యాణ్ అంటూ కేకలు పెట్టారు. అక్కడికి చేరుకున్న సీఐలు అంజూయాదవ్, విక్రమ్ సిబ్బందితో కలసి జనసేన కార్యకర్తలను వారించబోయారు. దిష్టిబొమ్మకు సాయి నిప్పంటిస్తుండగా సీఐ అడ్డుకున్నారు. దీంతో అతను సీఐని పరుష పదజాలంతో దుర్భాషలాడుతూ తిరగబడ్డాడు. అమెను బలంగా నెట్టడంతో సీఐ అంజూయాదవ్ సాయి చెంపపై కొట్టారు. నలుగురిపై కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేశారు. కాగా, నగరం వినుత, ఆమె భర్త కోట చంద్రబాబుపై కూడా కేసు నమోదు చేశారు.



సీఎం దిష్టిబొమ్మను కాలితో తన్నుతూ కాలుస్తున్న నగరం వినుత


మదర్ ఎర్త్


రెయిన్‌బో


షనన్ స్నో

ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతోంది.
సాంకేతిక విప్లవంతో ప్రతి రంగం వేగం పుంజుకుంటోంది.
మరి... మహిళాభివృద్ధి కూడా అంతే వేగంగా జరుగుతోందా?
అభివృద్ధి పరుగులో మహిళ ఎక్కడో వెనుకబడుతోంది.
చిత్రలేఖనంలో మహిళల వాటా ఐదు శాతమే.
అందుకే 'వరల్డ్ ఆఫ్ ఉమెన్' (వావ్) పుట్టింది.
వావ్ సీఓఓ షనన్ స్నో పరిచయం ఇది.

సాధికార చిత్రాలు

షనన్ స్నో... అమెరికా అమ్మాయి. మయామిలో ఉంటోంది. ప్రపంచంలోని మహిళలందరినీ ఎంపవర్‌మెంట్ అనే వేదిక మీదకు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తోంది. యామ్ కర్‌కాయ్ అనే చిత్రకారిణి, మరికొంత మంది భావ సారూప్యత కలిగిన వ్యక్తులతో కలిసి 'వరల్డ్ ఆఫ్ ఉమెన్' వేదికగా ఉమెన్ ఆర్టిస్టుల కోసం పని చేస్తోన్న షనన్ తెలుగింటి కోడలు. ఆమె కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కి వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడింది.

''నా దృష్టిలో జీవితం అంటే సాటి వారికి మనవంతుగా తోడ్పడడమే. అలాగే ప్రపంచం అంతటినీ చుట్టి రావడం కూడా. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రపంచం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. సమాజం కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందుతోందా అంటే సమాధానం కష్టమే. నిజానికి మహిళాభివృద్ధితోనే సమాజం సంపూర్ణాభివృద్ధిని సాధిస్తుంది. అలాంటిది మహిళ ఇంకా సాధికారత సాధన కోసం పోరాడుతూనే ఉంది. ఆ పోరాటంలో విజయం సాధించాలంటే మహిళలు ఒకరికొకరు చేయూతగా నిలవాలి. ఆ భావనతోనే 2021 జూలైలో వరల్డ్ ఆఫ్ ఉమెన్' అనే అనే సంస్థను స్థాపించాం. మా వరల్డ్ ఆఫ్ ఉమెన్ కమ్యూనిటీతో ఇప్పటికి ప్రపంచ వ్యాప్తంగా 350 మంది మహిళా చిత్రకారులు అనుసంధానమయ్యారు. ఈ రెండేళ్లలో మేము దాదాపు 30 మీట్ అప్స్ ఏర్పాటు చేశాం. ముంబయిలో శ్వేత పరేఖ్ మా కమ్యూనిటీ మేనేజర్. ఇలా మొత్తం ఇరవై మందిమి ఉన్నాం. కొత్తగా కుంచె పట్టుకున్న చిత్రకారిణుల చిత్రాలను అనతి కాలంలోనే ప్రపంచంలోని దేశాలన్నింటికీ పరిచయం చేస్తుంది ఈ వేదిక. ఒక విషయాన్ని చెప్పడానికి చిత్రలేఖనం ఒక అందమైన మాధ్యమం. అలాగే చిత్రలేఖనంలో ఎన్నో వైవిధ్యభరితమైన విధానాలుంటాయి. యామ్‌తోపాటు హాలీవుడ్ నటి ఎవా లాంగోరియా స్వచ్ఛందంగా ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

ఇండియాతో బంధం

ఇండియాతో అనుబంధం 2007లో మొదలైంది. భారతీయ సంస్కృతిని తెలుసుకోవడానికి, స్వయంగా ఆస్వాదించాలని వచ్చాను. గూగుల్‌లో ఉద్యోగం చేస్తూ నాలుగైదేళ్లు ఇండియాలోనే ఉన్నాను. అయితే ఇండియన్స్‌తో అనుబంధం ఏర్పడి ఇరవై ఏళ్లయింది. ప్రతాప్ పెనుమల్లి నాకు అండర్ గ్రాడ్యుయేషన్‌లో పరిచయమయ్యాడు. యాభై ఏళ్ల కిందట యూఎస్‌కి వెళ్లి, అక్కడే స్థిరపడిన కుటుంబం వాళ్లది. మామగారు రిటైర్ అయిన తర్వాత అత్తమ్మ, మామయ్య ఏటా కొంతకాలం ఇండియాలో ఉంటున్నారు. నేను కూడా వచ్చాను. మా అత్తగారి పుట్టిల్లు, మామగారి సొంత ఊరికి కూడా వెళ్లాను. బంధువులందరూ ఆత్మీయంగా పలకరిస్తుంటే ఇండియాలో కుటుంబ బంధాలు చాలా దృఢమైనవని తెలిసింది. మా అత్తమ్మ వంటతో తెలుగు రుచులన్నీ అలవాటయ్యాయి. దోశ, ఎగ్ బుర్జీ, రొయ్యల కూర ఇష్టం. నా పర్యటనల్లో భాగంగా ఇండియా అంతా చూసేశాను. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చారిత్రక, సాంస్కృతిక, యాత్రా ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలన్నింటినీ చూశాను. ప్రతాప్‌తో కలిసి తిరుమల కొండను నడిచి ఎక్కాను తెలుసా'' అంటూ ఆహ్లాదంగా నవ్వింది షనన్ స్నో. తిరుమలకొండకు నడిచి వెళ్లడం గొప్ప అనుభూతి. ప్రకృతిని ప్రేమించే వాళ్లకు ఎప్పటికీ చెరగని జ్ఞాపకం' అందామె చిరునవ్వుతో.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అవకాశాల్లో సమానత్వం

మేము చేస్తున్న ఈ ప్రయత్నం మహిళ సాధికారత సాధన కోసమే. మహిళ తనంతట తానుగా నిలబడగలగాలి. అవకాశాలు అందరికీ సమానంగా ఉండాలి. కానీ సమాజం అలా లేదు. ప్రపంచంలో ఏ దేశాన్ని చూసినా మహిళ మనుగడ కోసం పోరాడుతూనే ఉంది. కొన్ని దేశాల్లో అస్తిత్వం కోసం పోరాటం, కొన్ని దేశాల్లో హక్కుల పోరాటం, మరి కొన్ని దేశాల్లో స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం పోరాడుతోంది. సంతోషంగా జీవించాలంటే పోరాటం తప్పని పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికీ బాలికల విద్య ఇంకా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన విషయంగానే ఉంది. వీటన్నింటి పరిష్కారం కోసం మా వరల్డ్ ఆఫ్ ఉమెన్ సర్వీసులను విస్తరిస్తున్నాం. మా చిత్రలేఖనాలు కూడా 'మహిళ' అనే అంశం మీదనే ఉంటాయి. బాల్యం నుంచి స్త్రీకి ఎదురయ్యే సవాళ్లు, ఆమె సాధించిన విజయాలు, ఆమె అధిరోహించిన శిఖరాలే ఇతివృత్తంగా ఉంటాయి. ఇది మహిళాభివృద్ధికి కొత్త ప్రారంభం వంటిది. ఈ పరంపరలో భాగస్వాములు కావడం సులభం. ఆన్‌లైన్‌లో లాగిన్ అయ్యి సభ్యత్వం తీసుకోవచ్చు. మహిళలు సాధించలేనిదంటూ ఏదీ లేదు. సంఘటితమై సాధించి చూపిద్దాం.

– షనన్ స్నో, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, వరల్డ్ ఆఫ్ ఉమెన్


సైబర్ జంగిల్

న్యూస్‌మేకర్

దేశ నేతలు
ఇతర దేశాల నేతలతో
సరిగా మాట్లాడాలి.
వారు చెప్పేది సరిగా వినాలి.
దౌత్య సంబంధాలు సఫలం కావాలంటే సంభాషణే కీలకం.
కాని అన్ని భాషలు అందరు నేతలకూ రావాలని లేదు.
అందుకే దుబాసీలను ఎంచుకుంటారు.
ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో
తరచు కనిపిస్తున్న దుబాసి గుర్‌దీప్ కౌర్ చావ్లా.
ఇటీవల మోదీ అమెరికా పర్యటనలో ఆమె కీలక పాత్ర పోషించింది.

ప్రధానికి దుబాసీ



గుర్‌దీప్ కౌర్ చావ్లా

అది వేదిక మీద ఎవరో ఒక నాయకుడు చేస్తున్న రాజకీయ ప్రసంగాన్ని అనువాదం చేయడం కాదు. లేదా ఒక కథనో వ్యాసాన్నో అనువాదం చేయడం కాదు. అగ్రనేతలు చర్చలు చేసుకుంటున్నప్పుడు ఆ సంభాషణను అనువాదం చేయడం. దుబాసీగా ఉండటం. 'ఆ పని చాలా కష్టం' అంటారు గుర్‌దీప్ కౌర్ చావ్లా. అమెరికాలో స్థిరపడిన ఈ పంజాబీ భారతీయురాలు గత 26 ఏళ్లుగా దౌత్యరంగంలో దుబాసీగా సేవను అందిస్తున్నారు. 'డిప్లమాటిక్ ఇంటర్‌ప్రెటర్'గా అంతర్జాతీయ గుర్తింపు పొందారు గుర్‌దీప్ కౌర్.

ఢిల్లీలో చదువుకుని

గుర్‌దీప్ కౌర్ ఢిల్లీలో ఎం.ఏ. ఇంగ్లిష్ చదవి, ఆ తర్వాత పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ చేసి, పీహెచ్‌డీ చేశాక పార్లమెంట్‌లో అనువాదకురాలిగా కెరీర్‌ను ప్రారంభించారు. ఇంగ్లిష్, హిందీ, పంజాబీ, ఉర్దూ భాషల్లో గొప్ప ప్రవేశం ఉండటంతో దుబాసీగా ఆమె సేవలను పార్లమెంట్ భవన్ ఉపయోగించుకునేది. అయితే భర్త ఉద్యోగరీత్యా 1996లో అమెరికా వెళ్లిన గుర్‌దీప్ అక్కడ కూడా దౌత్యపరమైన దుబాసీగా కావాల్సిన అనుభవం కోసం 'జ్యుడిషియల్ కౌన్సిల్ ఆఫ్ కాలిఫోర్నియా'లో పని చేశారు. 'దౌత్యరంగానికి అవసరమైన మేలిమి ఇంటర్‌ప్రెటర్‌ల కొరతను ఆ రోజుల్లోనే నేను గమనించాను. అలాంటివారిని తయారు చేయడానికి 'ఇండియన్ లాంగ్వేజ్ సర్వీసెస్' అనే సంస్థను స్థాపించి దుబాసీలను తయారు చేస్తున్నాను. భారతీయ నేతల కోసమే కాదు ప్రపంచ నేతల కోసం కూడా అరబిక్, స్పానిష్, చైనీస్ తదితర భాషలలో నిపుణులైన దుబాసీలను మేము ఏర్పాటు చేస్తాం' అంటారు గుర్‌దీప్ కౌర్.


మోదీ – బైడెన్‌లతో గుర్‌దీప్ కౌర్



ప్రధానులకు దుబాసీ

అమెరికా పర్యటనకు వచ్చే భారతీయ ప్రధానులకు గుర్‌దీప్ దుబాసీగా పని చేసి ప్రశంసలు అందుకున్నారు. వి.పి.సింగ్, చంద్రశేఖర్, పి.వి.నరసింహారావు, వాజ్‌పేయి, గుజ్రాల్, మన్‌మోహన్ సింగ్ వీరందరూ అమెరికా వచ్చినప్పుడు వారి అధికారిక దుబాసీగా గుర్‌దీప్ పని చేశారు. ఇప్పుడు నరేంద్ర మోదీ కోసం పని చేస్తున్నారు. అయితే ట్రంప్ హయాంలో మోదీ అమెరికా వచ్చినప్పుడు ట్రంప్‌కు కూడా దుబాసీగా గుర్‌దీప్ పని చేశారు. అంటే ట్రంప్ మాట్లాడేది హిందీలో అనువాదం చేసి మోదీకి తెలిపారు. ఒబామాకు కూడా గుర్‌దీప్ పని చేశారు.

సవాళ్లతో నిండిన పని

'అగ్రనేతలు పాల్గొనే దౌత్య సంబంధ సమావేశాలలో దుబాసీగా పని చేయడం చాలా సవాలు. నేతలు మాట్లాడేది ఒక మాట తక్కువ కాకూడదు ఒక మాట ఎక్కువ కాకూడదు. ముఖ్యంగా మన భావాలు, పెడర్థాలు కలపకూడదు. నేను ఒక నేతకు దుబాసీగా పని చేయాలని అనుకున్న వెంటనే ఆ నేత వాడే పదసముదాయం, ఉచ్చారణ, యాస, వ్యక్తీకరణ మొత్తం స్టడీ చేస్తాను. రెండు దేశాల మధ్య ఉండే దౌత్య పరమైన సంబంధాల అవగాహన ఉండాలి. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సాంస్కృతిక అంతరం, అధికారిక సంబంధాల మధ్య ఉండే సవాళ్లు... వీటన్నింటిని తెలుసుకుని ఆ అగ్రనేత ఏం మాట్లాడబోతాడో ఊహించి సిద్ధంగా ఉండాలి. ఇంత హోమ్‌వర్క్ లేకపోతే తక్షణ అనువాదం సాధ్యం కాదు' అంటుంది గుర్‌దీప్ కౌర్.

ఐక్యరాజ్యసమితి, ఐ.ఎం.ఎఫ్, వరల్డ్ బ్యాంక్, యూ.ఎస్. ఇండియా బిజినెస్ కౌన్సిల్, డబ్ల్యు.హెచ్.ఓ తదితర సంస్థలకు గుర్‌దీప్ కౌర్ వ్యక్తిగతంగా తన సంస్థ తరఫున సేవలు అందిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇరు దేశాలు ఏవైనా మాట్లాడుకోవాలంటే గుర్‌దీప్ కౌర్ సేవలు తప్పనిసరి అనే స్థితిలో ఆమె తన సేవలను విస్తరించారు. భాష తెలియడం వల్ల వచ్చిన విజయం ఇది. భాషల మీద పట్టు సాధించి ఇటువైపు కెరీర్ మలుచుకోవాలనుకునేవారికి గుర్‌దీప్ గొప్ప స్ఫూర్తి.

● సేవాపథం

ముచ్చటగా మూడోసారి...

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో మూడుసార్లు ప్రసంగించిన తొలి భారతీయ యువతిగా లా ఆఫీసర్ దీపికా దేశ్వాల్ చరిత్ర సృష్టించింది. కాలేజీ రోజుల నుంచి సేవా పథంలో నడుస్తున్న ఢిల్లీకి చెందిన దీపిక ఎంతోమంది బాధితులకు అండగా నిలిచి, ఎన్నోరకాల సేవాకార్యక్రమాల్లో పాల్గొంది. నలుగురిని ఒకటి చేసి తన దారిలో నడిచేలా చేసింది...




● దీపికా దేశ్వాల్

పీహెచ్‌డీ స్కాలర్ అయిన దీపికా దేశ్వాల్‌కు చదువు మాత్రమే ప్రపంచం కాదు. కాలేజీ రోజుల నుంచి సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం అంటే ఇష్టం. కోవిడ్ కల్లోల కాలంలో సామాజిక సేవా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొంది. పంజాబ్‌లోని మోగా జిల్లాలో ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వందలాదిమందికి సహాయం అందించింది. స్నేహితులు, బంధువులను కూడా తన సేవాకార్యక్రమాలలో భాగం చేసింది.

అన్నదానం నుంచి అనుకోకుండా ఆపదలో చిక్కుకున్న వారికి సహాయం చేయడం వరకు ఎన్నో చేసింది.

తన జీతం మొత్తం కరోనా బాధితుల చికిత్స కోసం విరాళంగా ఇచ్చేది. ఆమె తండ్రి కూడా తన జీతంలోని కొంతమొత్తాన్ని విరాళంగా ఇచ్చేవాడు.

ఏ అవసరం ఎప్పుడు వచ్చినా ఫోన్ చేయమంటూ ఎంతోమందికి తన ఫోన్ నంబర్ ఇచ్చింది. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు ఫోన్ వచ్చినా పరుగులు తీసేది. బాధితులకు అన్ని రకాలుగా అండగా నిలిచేది.

సోషల్ మీడియాలో వేధింపులకు గురవుతున్న 80 మంది అమ్మాయిలకు అండగా నిలిచి, నేరస్థులు అరెస్ట్ అయేలా ఉద్యమించింది. వ్యభిచార కూపంలో చిక్కుకున్న అమ్మాయిలను రక్షించి వారికి పునరావాసం ఏర్పాటయ్యేందుకు కృషి చేసింది.

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగానికి మనదేశం తరఫున ప్రాతినిధ్యం వహించింది.

మహిళా సాధికారత నుంచి మానవ హక్కుల వరకు ఎన్నో కార్యక్రమాలలో క్రియాశీల పాత్ర పోషించిన దీపికకు న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో మూడోసారి ప్రసంగించే అరుదైన అవకాశం లభించింది. గత రెండు సమావేశాల్లో 'మానవ హక్కులు–మహిళా హక్కులు' అంశంపై మాట్లాడి 150 దేశాలకు చెందిన ప్రతినిధుల ద్వారా ప్రశంసలు అందుకుంది.

మనసున్న దీపిక ఆటల్లోనూ బంగారం అనిపించుకుంది.'యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ'లో రెజ్లింగ్, జూడోలలో ఆరుసార్లు బంగారు పతకం గెలుచుకుంది. ఆత్మరక్షణకు సంబంధించి అమ్మాయిల కోసం రకరకాల వర్క్‌షాప్‌లు నిర్వహించింది.

సైబర్ టాక్

ఫేక్ యాడ్స్‌తో వల

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రకరకాల ప్రకటనలు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్, గూగుల్ ప్లాట్‌ఫారాలలో ఇవి అధికంగా కనిపిస్తుంటాయి. వీటిలో ఏవి నిజమైనవి, ఏవి నకిలీవి అని తెలుసుకోవడం కష్టంగా ఉంటుంది. నిజమని నమ్మి మోసపోయే బాధితుల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ప్రకటనల పేరుతో జరిగే ఈ ఆర్థిక మోసాల బారిన పడకుండా ఉండాలంటే మరింత అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇది.

ఫేస్‌బుక్ ద్వారా..

మోసగాళ్లు నకిలీ అకౌంట్స్‌ను ఓపెన్ చేస్తారు. వీటిని ఫేక్ లైక్స్, షేర్స్, ఫాలోవర్స్, పోస్ట్‌ల ను రూపొందించడానికి ఉపయోగిస్తారు. ఈ నకిలీ అకౌంట్స్ ద్వారా వచ్చే యాడ్స్‌కు ఎటువంటి వాస్తవిక ఆధారాలు ఉండవు. ఫేస్‌బుక్ ప్రకటనలపై క్లిక్ లను రూపొందించడానికి ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. దీని ద్వారా కృత్రిమంగా క్లిక్ త్రూ రేట్లను పెంచి, ప్రకటనదారులకు చెల్లించాల్సిన మొత్తాన్ని పెంచుతారు. అలాగే, యాడ్ నెట్‌వర్క్‌ను మోసగించడానికి చట్టబద్ధమైన వెబ్‌సైట్‌లు లేదా యాప్స్‌ను అనుకరిస్తారు. దీంతో మోసపూరిత వెబ్‌సైట్‌లలో ఈ యాడ్స్ కనిపిస్తుంటాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో..

- కొంతమంది ఇన్‌ఫ్లుయెన్సర్లు ఫేక్ ఫాలోవర్లను కొనుగోలు చేయడం ద్వారా మోసానికి పాల్పడవచ్చు. లేదా వారి ప్రజాదరణను పెంచుకోవడానికి ఒక ఒప్పందం చేసుకోవచ్చు. అయితే, దీని ద్వారా ప్రకటనదారులు ఆశించిన ప్రయోజనాన్ని పొందలేరు.
- మోసగాళ్లు ఫేక్ గ్రూప్‌లను క్రియేట్ చేస్తారు. ఒకరి పోస్ట్‌లను లైక్, షేర్, రివ్యూ చేయడానికి ఒప్పుకుంటారు. దీని ద్వారా వినియోగదారులు నమ్మకాన్ని పొందేందుకు ఒక భ్రమను సృష్టిస్తారు. తమ యాడ్స్‌ను ప్రచారం చేసే విధంగా మలుచుకుంటారు.
- ఫేక్ గ్రూప్స్ మాదిరిగానే పాడ్ నెట్‌వర్క్‌లను ఏర్పాటుచేస్తారు. దీని ద్వారా సభ్యులు ఒకరి పోస్ట్‌లపై మరొకరు కృత్రిమమైన ఎంగేజ్‌మెంట్‌ను పెంచుకుంటారు. ఎక్కుమంది వ్యూవర్స్‌ను చేరుకోవడానికి ఇదో తరహా ఎత్తుగడ.

ట్విటర్

- ఫేక్ ఫాలోవర్లు, రీ ట్వీట్‌లు, లైక్స్ క్రియేట్ చేయడానికి మోసగాళ్లు ఆటోమేటెడ్ బాట్‌లను అమలు చేస్తారు. వారు హ్యాష్‌ట్యాగ్స్ లేదా టాపిక్స్‌ను విస్తరించడానికి బాట్స్‌ను ఉపయోగిస్తారు. ఇది ట్రెండింగ్ భ్రమను సృష్టిస్తుంది.
- మోసగాళ్లు కొన్ని హ్యాష్‌ట్యాగ్‌లు లేదా టాపిక్స్‌తో జనాదరణ పొందేలా, ట్రెండింగ్‌లో ఉండేలా కృత్రిమ ప్రచారం చేస్తారు. ఎక్కువ మందిని చేరుకోవచ్చనే ఆశతో ప్రకటనదారులు ఈ మార్గాన్ని ఎంచుకుంటారు.
- హ్యాష్‌ట్యాగ్స్, రీ ట్వీట్స్ చేయడానికి, విస్తరించడానికి ఫేక్ అకౌంట్స్‌ను క్రియేట్ చేస్తారు. దీని ద్వారా కంటెంట్, విజిబిలిటీతో వ్యూవర్స్‌ను రీచ్ అవడమే లక్ష్యంగా పెట్టుకుంటారు.

ప్రచార మోసానికి మార్గాలు

- మోసగాళ్లు క్లిక్‌బైట్ మెసేజ్‌లను ఎస్సెమ్మెస్, వాట్సాప్, ఇ–మెయిల్ లేదా సోషల్ మీడియా ద్వారా పంపుతారు.
- సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో, గూగుల్ ప్రకటనలలో ఫేక్ యాడ్స్ సృష్టిస్తారు. ముఖ్యంగా కొత్త ఐ ఫోన్ మోడల్ వంటి ట్రెండింగ్‌లో ఉన్న విషయాలను ప్రచారం చేస్తారు.
- ప్రకటనలకు ఆకర్షితుడై మోసగాడిని సంప్రదించినప్పుడు అతను బుకింగ్ లేదా అడ్వాన్స్ చెల్లించమని అడుగుతాడు.
- కోరుకున్న వస్తువు డిస్కౌంట్ రేట్‌లో లభిస్తుందనే ఆశతో మోసగాడు చెప్పిన మొత్తాన్ని బాధితుడు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తాడు. ఆ తర్వాత డెలివరీ, జీఎస్టీ, ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఛార్జీలు మొదలైనవాటికి అదనపు మొత్తాన్ని చెల్లించమని బాధితుడిని కోరతాడు.
- మోసగాడు చెప్పింది నిజమని బాధితుడు నమ్మి డెలివరీ ట్రాకింగ్ వివరాలను పంపుతాడు. లేదంటే, అడిగినంత మొత్తాన్ని చెల్లిస్తాడు.
- బాధితుడు డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసిన తర్వాత మోసగాడు కాల్స్‌ను, ఇతర కమ్యూనికేషన్ మార్గాలను బ్లాక్ చేస్తాడు.


ప్రతీకాత్మక చిత్రం

మోసాన్ని అధిగమించడానికి ..

- మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న ప్రముఖ వ్యాపార ప్రకటనల నెట్‌వర్క్‌లు, పబ్లిషర్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. ఏవైనా అడ్వర్టైజింగ్ పార్టనర్‌షిప్‌లలోకి ప్రవేశించే ముందు క్షుణ్ణంగా పరిశీలించి, తగిన శ్రద్ధ తీసుకోవాలి.
- ప్రకటనల మోసాన్ని గుర్తించి, నిరోధించడంలో సహాయపడే ధ్రువీకరణ సాధనాలు, టెక్నాలజీని ఉపయోగించాలి. ఇవి, అనుమానాస్పద యాడ్స్ లోని లొసుగులను కనిపెట్టగలవు. క్లిక్ ఫ్రాడ్, ఇంప్రెషన్ ఫ్రాడ్ వంటి వివిధ రకాల మోసాలకు వ్యతిరేకంగా ఇవి రక్షణను అందిస్తాయి.
- ఏవైనా అనుమానాస్పద యాడ్స్‌ను గుర్తించడానికి ఇతర యూజర్ల క్రమాన్ని కూడా పర్యవేక్షించాలి. అంటే, అసహజంగా అనిపించే లైక్స్, షేర్స్ వేగంగా పెరగడం వంటివి ఉన్నాయేమో చెక్ చేయాలి.
- మోసాన్ని గుర్తించే లెర్నింగ్ టెక్నిక్స్‌ను ఉపయోగిస్తే ఇవి మోసపూరిత తేడాలను గుర్తించగలవు.
- మీ యాడ్స్... సంబంధిత ప్లాట్‌ఫారమ్‌లలో కనిపించేలా చూసుకోవడానికి స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలి. అనుమానాస్పదమైన, క్వాలిటీ లేని వెబ్‌సైట్స్, మోసపూరిత కార్యకలాపాలకు గురయ్యే యాప్‌లలో ప్రకటనలను ఉంచడం మానుకోవాలి.
- ఈ తరహా తాజా మోసాలను మీ టీమ్ అంటే.. బంధుమిత్రుల సమూహాలకు అవగాహన కల్పించాలి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేందుకు ఇండస్ట్రీ కాన్ఫరెన్స్‌లు, వెబినార్లు, వర్క్‌షాప్స్‌కు హాజరవ్వాలి.
- ప్రకటనల ప్రచారాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలి. డేటాలో ఏవైనా తేడాలు ఉన్నాయేమో సరిచూసుకోవాలి.
- మీరు మోసపూరిత కార్యకలాపాలను అనుమానించినట్లయితే, వాటిని సంబంధిత యాడ్ ప్లాట్‌ఫారమ్స్ లేదా నెట్‌వర్క్‌లకు తెలియజేయాలి. మోసపూరిత ప్రకటనల విధానాలను పంచుకోవడం ద్వారా మిగతావారిని అలెర్ట్ చేయవచ్చు.
- ప్రకటనల మోసాన్ని ఎదుర్కోవడానికి నిజాయితీని ప్రోత్సహించే ఇండస్ట్రీ అసోసియేషన్స్‌తో కనెక్ట్ అయి ఉండటం శ్రేయస్కరం.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



క్లీన్ స్వీప్ లక్ష్యంగా బరిలోకి...

తమ విజయపరంపరను కొనసాగిస్తూ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో... మిర్పూర్‌లో నేడు బంగ్లాదేశ్‌తో జరిగే చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు బరిలోకి దిగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో నెగ్గిన భారత్... రెండో మ్యాచ్‌లో 95 పరుగులు చేసినా స్పిన్నర్ల మాయాజాలంతో గట్టెక్కింది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

జ్ఞానేశ్వరికి స్వర్ణ పతకం



కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల 49 కేజీల విభాగంలో భారత ప్లేయర్ జ్ఞానేశ్వరి యాదవ్ స్వర్ణ పతకం సాధించింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జ్ఞానేశ్వరి మొత్తం 176 కేజీలు బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఈ పోటీల్లో భారత్‌కే చెందిన జిలీ దలబెహెరా రజత పతకం గెలిచింది. మహిళల 45 కేజీల విభాగంలో కోమల్... పురుషుల 55 కేజీల విభాగంలో ముకుంద్ అహిర్ భారత్‌కు స్వర్ణ పతకాలు అందించారు.

‘జబర్’దస్త్ విజయం



రిబాకినా

- డిఫెండింగ్ చాంపియన్ రిబాకినాపై ఆన్స్ జబర్ గెలుపు
- వరుసగా రెండో ఏడాది సెమీస్‌లోకి
- సబలెంకా కూడా ముందుకు

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ఈసారి కొత్త చాంపియన్ అవతరించనుంది. ట్యునీషియా క్రీడాకారిణి, ప్రపంచ ఆరో ర్యాంకర్ ఆన్స్ జబర్ ధాటికి డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్) క్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో గత ఏడాది రన్నరప్ ఆన్స్ జబర్ 6-7 (5/7), 6-4, 6-1తో రిబాకినాను బోల్తా కొట్టించి వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గంటా 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జబర్ తొలి సెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయినా... వెంటనే తేరుకొని వరుసగా రెండు సెట్‌లు గెలిచి విజయం దక్కించుకుంది. ఎనిమిది ఏస్‌లు సంధించిన జబర్ నెట్ వద్దకు 11 సార్లు దూసుకొచ్చి 9 సార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు రిబాకినా 22 సార్లు నెట్ వద్దకు వచ్చి 10 సార్లు మాత్రమే పాయింట్లు నెగ్గింది. 35 విన్నర్స్ కొట్టిన జబర్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. రిబాకినా 20 అనవసర తప్పిదాలు చేసింది. మరో క్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) అలవోక విజయంతో రెండోసారి వింబుల్డన్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది. 87 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సబలెంకా 6-2, 6-4తో 25వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా)పై గెలిచింది. రెండో సెట్‌లో ఒకదశలో సబలెంకా 2-4తో వెనుకబడినా ఆందోళన చెందకుండా పట్టుదలతో ఆడి వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో స్వితోలినా (ఉక్రెయిన్)తో వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్); ఆన్స్ జబర్‌తో సబలెంకా తలపడతారు.

తొలిసారి సెమీస్‌లోకి అల్‌కరాజ్, మెద్వెదెవ్

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్), మూడో ర్యాంకర్ మెద్వెదెవ్ (రష్యా) తొలిసారి ఈ టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో మెద్వెదెవ్ 2 గంటల 58 నిమిషాల్లో 6-4, 1-6, 4-6, 7-6 (7/4), 6-1తో క్రిస్టోఫర్ యుబాంక్స్ (అమెరికా)పై, అల్‌కరాజ్ 7-6 (7/3), 6-4, 6-4తో ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్)పై గెలిచారు. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో యానిక్ సినెర్ (ఇటలీ)తో జొకోవిచ్ (సెర్బియా); మెద్వెదెవ్‌తో అల్‌కరాజ్ ఆడతారు.



ఆన్స్ జబర్

బోపన్న జోడీ జోరు

పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (3/7), 7-5, 6-2తో టాలన్ గ్రీక్స్‌పూర్-బార్ట్ స్టీవెన్స్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. 2015 తర్వాత వింబుల్డన్ టోర్నీలో బోపన్న డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి ప్రవేశించాడు.

భారత బౌలర్ల జోరు



అశ్విన్

- తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ విఫలం
- టీ విరామానికి 137/8
- అశ్విన్‌కు 4 వికెట్లు

రోసీయూ (డొమినికా): వెస్టిండీస్‌తో ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజే భారత్ పైచేయి సాధించింది. తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో ప్రత్యర్థిని కుప్పకూల్చింది. భారత బౌలర్ల ధాటికి విండీస్ బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి రోజు టీ విరామ సమయానికి వెస్టిండీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. కెరీర్‌లో మొదటి టెస్టు ఆడుతున్న అలిక్ అతనజ్ (99 బంతుల్లో 47; 6 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. అశ్విన్ 4 వికెట్లు పడగొట్టగా, జడేజాకు 2 వికెట్లు దక్కాయి.

టాస్ గెలిచి విండీస్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి వికెట్‌కు 31 పరుగులు జత చేసి ఓపెనర్లు క్రెయిగ్ బ్రాత్‌వైట్ (20), తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (12) కుదురుకున్నట్లుగా అనిపించారు. అయితే 7 పరుగుల వ్యవధిలో వీరిద్దరిని అశ్విన్ అవుట్ చేసి దెబ్బ కొట్టాడు. శార్దుల్ తన తొలి ఓవర్లోనే రీఫర్ (2)ను వెనక్కి పంపగా, సిరాజ్ చక్కటి క్యాచ్‌కు బ్లాక్‌వుడ్ (14) అవుట్ కావడంతో లంచ్ సమయానికే స్కోరు 68/4కు చేరింది. మరో ఎండ్‌లో అలిక్ మాత్రమే ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. సొంత మైదానంలో అతను కొన్ని చక్కటి షాట్లతో జట్టును ఆదుకున్నాడు. రెండో సెషన్‌లో భారత్ మరో 3 వికెట్లు తీయడంలో సఫలమైంది. డి సిల్వ (2) ప్రభావం చూపలేకపోగా, హోల్డర్ (18) వికెట్ సిరాజ్ ఖాతాలో చేరింది. ఐదు పరుగుల వ్యవధిలో జోసెఫ్ (4), అలిక్‌లను అశ్విన్ అవుట్ చేశాడు. జోసెఫ్ వికెట్‌తో అశ్విన్ అంతర్జాతీయ వికెట్ల సంఖ్య 700కు చేరడం విశేషం. ఈ మ్యాచ్ ద్వారా తండ్రీ కొడుకులిద్దరినీ టెస్టు క్రికెట్‌లో అవుట్ చేసిన తొలి భారత బౌలర్‌గా అశ్విన్ గుర్తింపు తెచ్చుకున్నాడు. 2011లో తన తొలి టెస్టులో శివ్‌నారాయణ్ చందర్‌పాల్ వికెట్ తీసిన అశ్విన్ ఈ మ్యాచ్‌లో తేజ్‌నారాయణ్‌ను అవుట్ చేశాడు. గతంలో బోథమ్, వసీమ్ అక్రమ్, మిచెల్ స్టార్క్, సైమన్ హార్మర్ ఇలాంటి ఫీట్‌ను నమోదు చేశారు.

యశస్వి, ఇషాన్ అరంగేట్రం



తొలి టెస్టులో భారత జట్టు ఇద్దరు కొత్త ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ఊహించిన విధంగానే యశస్వి జైస్వాల్‌కు తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడే అవకాశం లభించగా... వికెట్ కీపర్‌గా ఇప్పటికే 14 వన్డేలు, 27 టి20లు ఆడిన ఇషాన్ కిషన్ తొలిసారి టెస్టు క్రికెట్ బరిలోకి దిగాడు. భారత్ తరఫున టెస్టులు ఆడిన 306వ, 307వ ఆటగాళ్లుగా వీరిద్దరు నిలిచారు. భారత్ ఆడిన గత ఐదు టెస్టుల్లో కీపర్‌గా ఉన్న ఆంధ్ర ఆటగాడు కేఎస్ భరత్ స్థానంలో ఈసారి టీమ్ మేనేజ్‌మెంట్ ఇషాన్‌కు తుది జట్టులో చోటు ఇచ్చింది. జార్ఖండ్‌కు చెందిన ఇషాన్ 48 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 38.76 సగటుతో 2985 పరుగులు చేశాడు. ముంబై ఆటగాడు యశస్వి గత రెండేళ్లుగా అన్ని ఫార్మాట్‌లలో సత్తా చాటుతూ సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్‌లో మెరుపులు, దేశవాళీ వన్డేల్లో మెరుపు బ్యాటింగ్ మాత్రమే కాకుండా 15 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలోనే 9 సెంచరీలతో 80.21 సగటుతో 1845 పరుగులు సాధించడం అతనికి అవకాశం కల్పించింది.

రాణించిన విహారి



బెంగళూరు: వెస్ట్ జోన్ జట్టుతో బుధవారం మొదలైన దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ జట్టు తొలి రోజే తడబడింది. వెస్ట్ జోన్ కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. వర్షం కారణంగా తొలిరోజు పూర్తి 90 ఓవర్ల కోటా సాధ్యపడలేదు. మయాంక్ అగర్వాల్ (28; 6 ఫోర్లు) తక్కువ స్కోరుకే అవుటవ్వగా... కెప్టెన్ హనుమ విహారి (130 బంతుల్లో 63; 9 ఫోర్లు), హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (87 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) మూడో వికెట్‌కు 79 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఒకదశలో సౌత్ జట్టు 121/2తో పటిష్టంగా కనిపించింది. అయితే అర్జన్ నాగ్వస్‌వాలా (2/45), చింతన్ గజా (2/27), షమ్స్ ములానీ (2/19) ధాటికి సౌత్ జట్టు 55 పరుగుల తేడాతో ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆంధ్ర క్రికెటర్ రికీ భుయ్ (33 బంతుల్లో 9) నిరాశపరిచాడు. వాషింగ్టన్ సుందర్ (9 బ్యాటింగ్), వైశాక్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

అభిషేక్‌కు కాంస్యం



బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ తొలి రోజు భారత్‌కు ఒక కాంస్య పతకం లభించింది. పురుషుల 10 వేల మీటర్ల విభాగంలో అభిషేక్ పాల్ కాంస్య పతకం సాధించాడు. అభిషేక్ 29 నిమిషాల 33.26 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు. మహిళల జావెలిన్ త్రోలో అన్ను రాణి (59.10 మీటర్లు) నాలుగో స్థానంలో నిలిచింది.

ఈనెల 22, 23 తేదీల్లో రెజ్లింగ్ ట్రయల్స్

న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత రెజ్లింగ్ జట్లను ఎంపిక చేసేందుకు ఈనెల 22, 23 తేదీల్లో సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తామని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అడ్‌హక్ కమిటీ ప్రకటించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి... నిరసన చేపట్టిన రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్, సాక్షి మలిక్, సంగీత ఫొగాట్, సత్యవర్త్, జితేందర్‌లకు ట్రయల్స్‌లో ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలా వద్దా అనేది శుక్రవారం నిర్ణయిస్తామని అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు భూపేందర్ సింగ్ బజ్వా తెలిపారు.

నేటి నుంచి అల్టిమేట్ టీటీ లీగ్

పుణే: మూడేళ్ల తర్వాత అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (టీటీ) లీగ్ నాలుగో సీజన్‌కు నేడు తెర లేవనుంది. మొత్తం ఆరు జట్లు (చెన్నై లయన్స్, దబంగ్ ఢిల్లీ, పుణేరి పల్టన్, యు ముంబా, బెంగళూరు స్మాషర్స్, గోవా చాలెంజర్స్) బరిలో ఉన్నాయి. ఈనెల 30న ఫైనల్‌తో లీగ్ ముగుస్తుంది. తెలంగాణ క్రీడాకారులు ఆకుల శ్రీజ దబంగ్ ఢిల్లీ తరఫున, సూరావజ్జుల స్నేహిత్ పుణేరి పల్టన్ తరఫున ఆడుతున్నారు. తొలిరోజు చెన్నై లయన్స్‌తో పుణేరి పల్టన్ తలపడుతుంది. రాత్రి గం. 7:30 నుంచి మొదలయ్యే మ్యాచ్‌లను స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



క్వాలిఫయింగ్‌లో కశ్యప్ ఓటమి



కౌన్సిల్ బ్లఫ్స్ (అమెరికా): యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ పారుపల్లి కశ్యప్ మెయిన్ ‘డ్రా’కు అర్హత సాధించలేకపోయాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో హైదరాబాద్‌కు చెందిన కశ్యప్ 21-19, 21-17తో రోహన్ మిధా (ఇంగ్లండ్)పై గెలిచాడు. కూ తకహాషి (జపాన్)తో జరిగిన రెండో రౌండ్‌లో కశ్యప్ తొలి గేమ్ 21-23తో కోల్పోయి, రెండో గేమ్‌లో 7-11తో వెనుకబడిన దశలో గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. చెన్నైకి చెందిన 19 ఏళ్ల శంకర్ ముత్తుస్వామి మెయిన్ ‘డ్రా’కు అర్హత పొందాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో శంకర్ 21-17, 21-11తో డావి సిల్వా (బ్రెజిల్)పై, రెండో రౌండ్‌లో 21-11, 21-17తో బీఆర్ సంకీర్త్ (కెనడా)పై గెలిచాడు. పురుషుల డబుల్స్ మెయిన్ ‘డ్రా’ తొలి రౌండ్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ (భారత్) ద్వయం 14-21, 14-21తో లిన్ యు చియె-సు లీ వె (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడిపోయింది.

సినిమా

బై బై భాయ్



● ఐశ్వర్య, రజనీకాంత్, విష్ణు విశాల్, జీవిత

మొయుద్దీన్ భాయ్ పాత్రకు టాటా చెప్పేశారు రజనీకాంత్. ‘లాల్ సలామ్’లో ఆయన చేసిన పాత్ర ఇది. రజనీ పెద్ద కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో రజనీ ముంబైకి చెందిన మాఫియా డాన్ మొయుద్దీన్ భాయ్‌గా కీలక పాత్ర చేశారు. బుధవారంతో ఆయన పాత్ర చిత్రీకరణ పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి, బై బై చెప్పింది యూనిట్. ఆ ఫొటోను షేర్ చేసి, ‘‘మీతో సినిమా చేయడం ఓ అద్భుతం.. మీరు ప్యూర్ మేజిక్ నాన్నా’’ అని పేర్కొన్నారు ఐశ్వర్య. రజనీ చెల్లెలిగా జీవిత నటిస్తున్న ఈ చిత్రంలో క్రికెటర్ కపిల్ దేవ్ ఓ కీ రోల్‌లో కనిపిస్తారు. లైకా ప్రొడక్షన్స్ పై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

నాతో రా...



● సమంత, విజయ్ దేవరకొండ

‘నాతో రా.. నీలా రా.. ఆరాధ్యా..’ అంటూ విజయ్ దేవరకొండ పాడగా, ‘పదము నీ వైపిలా.. పరుగు నీదే కదా..’ అంటున్నారు సమంత. ఈ ఇద్దరూ జంటగా నటించిన ‘ఖుషీ’ చిత్రంలోని రెండో పాట ఇది. ఈ చిత్రదర్శకుడు శివ నిర్వాణ తెలుగు వెర్షన్‌కి ఈ పాట రాయగా, తమిళంలో మదన్ కార్కీ సాహిత్యం అందించారు. తెలుగు, తమిళంలో సిధ్ శ్రీరామ్, చిన్మయి, హిందీలో జుబిన్ నాటియల్, పలక్ ముచ్చల్, కన్నడంలో హరిచరణ్ శేషాద్రి, చిన్మయి, మలయాళంలో కేఎస్ హరిశంకర్, శ్వేతా మోహన్ ఆలపించారు. హిషామ్ అబ్దుల్ వాహబ్ స్వరపరిచారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 1న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

మలయాళ ఇండస్ట్రీకి మైత్రీ



● రవిశంకర్, లాల్ జూనియర్

తెలుగు చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోలతో పలు బ్లాక్ బస్టర్‌లను అందించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ మలయాళంలో అడుగుపెట్టింది. తొలి ప్రాజెక్ట్‌గా ‘గాడ్ స్పీడ్’ అనే బ్యానర్‌తో కలిసి ‘నడికర్ తిలగం’ సినిమాకి శ్రీకారం చుట్టారు. టొవినో థామస్ హీరోగా లాల్ జూనియర్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. నవీన్ యర్నేని, వై. రవిశంకర్, అల్లన్ ఆంటోని, అనూప్ వేణుగోపాల్ నిర్మిస్తున్న ఈ సినిమా బుధవారం కొచ్చిలో ప్రారంభమైంది. ‘‘టొవినో థామస్ ఈ చిత్రంలో అనేక సవాళ్లతో కూడిన సూపర్ స్టార్ డేవిడ్ పడిక్కల్ పాత్రను పోషిస్తున్నారు. బుధవారమే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం’’ అన్నారు. భావన కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆల్బీ, సంగీతం: యక్జాన్ గారి పెరీరా, నేహా నాయర్.

నా కళ్లతో భయపెట్టాను!



● శివ రాజ్‌కుమార్

‘‘మీరు గన్నుతో ఎంత మందిని భయపెట్టారో అంత కంటే ఎక్కువ మందిని నేను నా కళ్లతో భయపెట్టాను. దే కాల్ మీ ఓజీ... ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్’ అనే డైలాగ్‌తో ‘ఘోస్ట్’ సినిమా టీజర్ విడుదలైంది. కన్నడ హీరో శివ రాజ్‌కుమార్ నటించిన చిత్రం ‘ఘోస్ట్’. శ్రీని (బీర్బల్) దర్శకత్వంలో సందేశ్ నాగరాజ్ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని నిర్మించారు. బుధవారం శివ రాజ్‌కుమార్ పుట్టినరోజుని (జూలై 12) పురస్కరించుకుని ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో దసరాకి ‘ఘోస్ట్’ ప్రేక్షకుల ముందుకి రానుంది.

తెలుగు నిర్మాతతో...

శివ రాజ్‌కుమార్ హీరోగా తెలుగు నిర్మాత సుధీర్ చంద్ర పదిరి కన్నడంలో ఓ సినిమా నిర్మించనున్నారు. శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాని ప్రకటించారు. ఈ చిత్రానికి కార్తీక్ అద్వైత్ దర్శకత్వం వహించనున్నారు. ఎస్‌సీఎఫ్‌సీపై (సుధీర్ చంద్ర ఫిల్మ్ కంపెనీ) సుధీర్ చంద్ర పదిరి నిర్మించనున్న ఈ మూవీ క్యారెక్టర్ కాన్సెప్ట్ పోస్టర్‌ని బుధవారం రిలీజ్ చేశారు. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్.

పాన్ ఇండియా చిత్రాల్లో...



● రోషన్

‘నిర్మలా కాన్వెంట్’ (2016)లో లీడ్ రోల్ చేసి, ‘పెళ్లి సందడి’ (2021)తో హీరోగా మంచి మార్కులు తెచ్చుకున్నారు నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా. ఇప్పుడు పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో హీరోగా సినిమాలు సైన్ చేశారు. రోషన్ ఒకేసారి రెండు పాన్ ఇండియా చిత్రాలు అంగీకరించడం విశేషం. కన్నడ దర్శకుడు నందకిశోర్ దర్శకత్వంలో రోషన్-మోహన్ లాల్ కాంబినేషన్‌లో రూపొందనున్న పాన్ ఇండియా చిత్రం షూటింగ్ ఈ నెలాఖరులో ఆరంభం కానుంది. తండ్రీ-కొడుకుల అనుబంధం నేపథ్యంలో పీరియాడికల్ యాక్షన్ మూవీగా రూపొందనుంది. రోషన్ నటించనున్న మరో పాన్ ఇండియా చిత్రం వైజయంతీ మూవీస్-స్వప్నా సినిమా బేనర్లపై రూపొందనుంది. నూతన దర్శకుడు ప్రదీప్ అద్వైతం ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.

అమ్మాయిలతో మాట్లాడ్డానికి రెండేళ్లు పట్టింది

\- ఆనంద్ దేవరకొండ



‘ప్రేమలో సంతోషం, బాధ ఉంటాయి. ఆ భావోద్వేగాలను ‘బేబీ’ సినిమాలో బాగా చూపించాం. ట్రైలర్‌లో చూపించిన ఎమోషన్ కంటే సినిమాలో మరో యాభై శాతం ఎక్కువే ఉంటుంది. వాటికి ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు’’ అని హీరో ఆనంద్ దేవరకొండ అన్నారు. సాయి రాజేష్ దర్శకత్వంలో ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బేబీ’. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ చెప్పిన విశేషాలు.

● ఇప్పటివరకు నేను పక్కింటి అబ్బాయిలా కనిపించే సినిమాలు చేశాను. కానీ, మొదటిసారి వైడ్ రేంజ్ ఆడియన్స్‌ని పలకరించే ‘బేబీ’తో వస్తున్నాను. ఈ సినిమాకి యూత్, మాస్ ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతారు. ఈ పాత్రను చేయగలననే నమ్మకాన్ని సాయి రాజేష్ అన్న నాలో నింపాడు. నా కెరీర్‌లో బేబీ ఎప్పటికీ నిలిచిపోతుంది.

● ‘బేబీ’కి విజయ్ బుల్గానిన్ అద్భుతమైన సంగీతం, ఆర్ఆర్ అందించారు.

మా అన్నకి (విజయ్ దేవరకొండ) ‘టాక్సీవాలా’ లాంటి మంచి హిట్ ఇచ్చారు ఎస్‌కేఎన్‌గారు.. ఇప్పుడు నాకు ‘బేబీ’తో హిట్ ఇవ్వనున్నారు.

● ఎవరి జీవితంలో అయినా తొలి ప్రేమ ఎప్పటికీ ఓ అందమైన అనుభూతి. అది సక్సెస్ అయినా, ఫెయిల్ అయినా ఎప్పటికీ గుర్తుంటుంది. నేను బాయ్స్ బోర్డింగ్ స్కూల్‌లో చదివాను. బయటకు వచ్చాక అమ్మాయిలతో మాట్లాడేందుకు రెండేళ్లు పట్టింది.

● ‘ప్రేమ దేశం’ సినిమాకు ‘బేబీ’కి అస్సలు పోలికలుండవు. ఫీల్ వైజ్ చూస్తే ‘ప్రేమిస్తే, 7/జీ బృందావన కాలనీ’ స్టైల్‌లో ఉంటుంది. ‘బేబీ’లోకి ముందుగా నేను వచ్చాను. ఆ తర్వాత వైష్ణవి, విరాజ్‌లు వచ్చారు. ముగ్గురి పాత్రలకు సమ ప్రాధాన్యం ఉంటుంది. నా సినిమాల కథ గురించి మా అన్నతో చర్చించను.. కానీ ఫలానా డైరెక్టర్, ఫలానా జానర్‌లో సినిమా అని చెబుతాను. అయితే తుది నిర్ణయాన్ని మా నాన్న, అన్న నాకే వదిలేస్తారు. ప్రస్తుతం ‘గం గం గణేశా’ సినిమా చేస్తున్నాను.

రోజా నుంచి నా మైండ్ సెట్ అదే!

\- ఏఆర్ రెహమాన్



ఏఆర్ రెహమాన్ దాదాపు 150 చిత్రాలకు పాటలు స్వరపరిచారు. ఆస్కార్ అవార్డు సాధించారు. ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. అయితే ‘‘నేనింకా నేర్చుకునే దశలో ఉన్నాను. నా కెరీర్ ఇప్పుడే మొదలైనట్లుగా అనిపిస్తోంది. ఎందుకంటే ప్రతీ పదేళ్లకు సంగీతంలో మార్పులొస్తున్నాయి’’ అన్నారు రెహమాన్. ఉదయనిధి స్టాలిన్, కీర్తీ సురేష్ ప్రధాన పాత్రల్లో రూపొందిన తమిళ ‘మామన్నన్’కి రెహమాన్ సంగీతం అందించారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగులో ‘నాయకుడు’గా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ ఇచ్చిన ఇంటర్వ్యూ...

● ఇటీవల ‘పొన్నియిన్ సెల్వన్’లాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కి సంగీతం అందించిన మీకు ‘నాయకుడు’లాంటి రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలు చేయడం ఎలా అనిపిస్తుంటుంది?

‘నాయకుడు’ రాజకీయ నేపథ్యంలో రూపొందిన సినిమా. సమాజంలోని అసమానతలతో పాటు చాలా విషయాల గురించి చర్చించారు. ఈ తరహా సినిమాలకు సంగీతం అందించడం సవాల్ అని చెప్పలేను కానీ ఓ కొత్త అనుభూతి మాత్రం దక్కుతుంది. చాలా రోజుల తర్వాత నేను జానపద తరహా పాటలు ఇచ్చిన చిత్రమిది.

● మీరు ఒక సినిమా ఒప్పుకో దానికి కథ, హీరో, దర్శకుడు.. ఈ మూడింటిలో ఏ అంశానికి ప్రాధాన్యం ఇస్తారు?

మూడూ ముఖ్యమే. మంచి కథ ఉంటే మంచి పాటలు ఇవ్వగలం. ఆ పాటలను దర్శకుడు చక్కగా తెరకెక్కించాలి. హీరో చేసే మంచి పెర్ఫార్మెన్స్‌ని బట్టి ఆ పాట హైలైట్ అవుతుంది. ఇప్పుడు ‘నాయకుడు’ విషయానికి వస్తే.. హీరో ఉదయనిధి స్టాలిన్ ముందు నన్ను సంప్రదించారు. సంగీతం అందించాలని అడిగారు. ఆ తర్వాత నేను కథ విన్నాను.. ఆసక్తిగా అనిపించింది. దర్శకుడు మారి సెల్వరాజ్ ఇప్పటివరకూ తీసిన సినిమాలకు భిన్నంగా ఈ చిత్రకథ ఉంది. మారి ఈ కథకు చాలా మాస్ అప్పీల్ ఇచ్చారు. అందుకు తగ్గట్టు పాటలు ఇచ్చాను. ఈ సినిమాలో ప్రతి పాట కథను ముందుకు తీసుకుని వెళుతుంది. అందుకే మ్యూజిక్ ఇవ్వడాన్ని ఎంజాయ్ చేశా.

● అందుకేనా ఈ సినిమా ఫంక్షన్‌కి సంబంధించిన వేదికపై ‘జివ్వు జివ్వు...’ పాటకు డ్యాన్స్ కూడా చేశారు..

ఈ సాంగ్ సిట్యువేషన్ చాలా మెచ్యూర్డ్‌గా ఉంటుంది. అది మైండ్‌లో పెట్టుకోవడంతో పాటు ఫన్ టచ్ ఇవ్వాలనుకుని ట్యూన్ చేశా. ఫన్ కోసమే స్టేజి మీద డ్యాన్స్ కూడా చేశాను.

● సంగీతంలో మార్పులు వస్తున్నట్లే మీ ఆలోచనా విధానం కూడా మారుతోందా?

ఎన్ని మార్పులు వచ్చినా మెలోడీ మారదు. లిరిక్ కూడా మారదు.. 30, 40 ఏళ్లుగా అదే. అయితే వైబ్రేషన్ కొంచెం మారుతుంది... బీట్ మారుతుంది. ‘రోజా’ నుంచి నా ఫార్ములా, మైండ్ సెట్ ఒక్కటే. అదేంటంటే నా పాట సింపుల్‌గా, క్యాచీగా ఉండాలి. ప్రేక్షకుల్లో, సమాజంలో వచ్చిన మార్పు తాలూకు ప్రభావం సంగీతంపై ఉంటుంది. ఇప్పుడు సంగీతానికి ఇంకా స్కోప్ పెరిగింది.

● మీ అమ్మాయి ఖతీజా తమిళ చిత్రం ‘మిన్‌మిని’తో సంగీత దర్శకురాలిగా పరిచయం కానున్నారు... ఓ ఫాదర్‌గా మీ ఫీలింగ్?

మహిళలు తాము అనుకున్నది సాధించాలనుకునే మైండ్ సెట్ నాది. మా ఇంట్లో మా అమ్మగారు, నా వైఫ్ వెరీ స్ట్రాంగ్. నా కూతురు ఖతీజా కూడా అంతే. ఏ మాత్రం టెన్షన్ పడటంలేదు. ట్యూన్స్ ఎలా ఇవ్వాలనే విషయంలో తనకు మెచ్యూర్టీ ఉంది. ఓ ఫాదర్‌గా ఐయామ్ హ్యాపీ.

● తెలుగులో బుచ్చిబాబు డైరెక్షన్‌లో రామ్‌చరణ్ హీరోగా రూపొందనున్న చిత్రం గురించి?

ఇది చాలా ఎగ్జయిటింగ్ ప్రాజెక్ట్. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పడానికి ఇంకా చాలా టైమ్ ఉంది. ఇప్పుడే రివీల్ చేయలేను.

● ‘గాంధీ టాక్స్’ అనే సైలెంట్ చిత్రానికి మ్యూజిక్ ఇవ్వడంపై మీ అనుభూతి గురించి?

గతంలో ‘పుష్పక విమానం’లాంటి సైలెంట్ సినిమాలను అద్భుతంగా చేశారు. ఇప్పుడు నాకలాంటి మంచి అవకాశం వచ్చింది. ఇలాంటి సినిమాలు సవాల్ అనాలి. అందుకే ఈ సినిమా డైరెక్టర్ కిశోర్‌తో ‘ఐ హేట్ యు.. లవ్ యు’ అని సరదాగా అన్నాను. డైలాగ్స్ లేకుండా సాగే ఈ సినిమాలోని సందర్భాలకు తగ్గట్టు మ్యూజిక్ ఇవ్వడం అనేది నాకు ఎగ్జయిటింగ్‌గా అనిపించింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	224	65,394
నిఫ్టీ ▽	55	19,384

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,930	△	169
డోజోన్స్	34,394	△	133
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,416	△	134
డాక్స్	16,023	△	233
షాంఘై	3,196	▽	25
నికాయ్	31,945	▽	260

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,786	▽	100
బంగారం (99.5 స్వచ్ఛత)	58,551	▽	99
వెండి (కిలో)	70,777	▽	51

విప్రో ఉద్యోగులకు ఏఐలో శిక్షణ

బిలియన్ డాలర్ల వెచ్చింపు



న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం విప్రో తమ యావత్ సిబ్బందికి కృత్రిమ మేథ (ఏఐ)లో శిక్షణ కల్పించడంపై దృష్టి పెడుతోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్లలో విప్రో ఏఐ360 ప్రోగ్రాం ద్వారా బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 8,200 కోట్లు) వెచ్చించనుంది. సంస్థలో మొత్తం 2.5 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. 'వచ్చే 12 నెలల్లో మొత్తం 2,50,000 మంది ఉద్యోగులకు ఏఐ ఫండమెంటల్స్, బాధ్యతాయుతంగా ఏఐ వినియోగంపై శిక్షణ అందిస్తాం' అని విప్రో ఒక ప్రకటనలో తెలిపింది. వివిధ స్థాయిల్లో ఏఐ వినియోగానికి సంబంధించి కంపెనీ బోధనాంశాలను రూపొందించనుంది. అలాగే హ్యాకథాన్స్ మొదలైనవి కూడా నిర్వహించనుంది. అటు విప్రో వెంచర్స్ ద్వారా ఆధునిక స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ కూడా చేయడంతో పాటు జెన్ ఏఐ సీడ్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ ద్వారా జనరేటివ్ ఏఐ ఆధారిత స్టార్టప్‌లకు శిక్షణ కల్పించనుంది.

ఉన్నత విద్యకు 'జీఆర్‌టీ జ్యువెలర్స్' చేయూత



హైదరాబాద్: ప్రతిభ కలిగిన విద్యార్థుల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు 'జీఆర్‌టీ జ్యువెలర్స్' చేయూత అందించింది. ఈ విద్యా సంవత్సరం (2023–24) మొదటి లేదా రెండో ఏడాది ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులు చదువుతున్న వారిలో అర్హులైన 100 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలు మంజూరు చేసింది. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయితే డిగ్రీ పూర్తయ్యే వరకు ఈ సాయం కొనసాగుతుందని వెల్లడించింది. ఉన్నత విద్య ద్వారానే సామాజిక చైతన్యం అభివృద్ధి చెందుతుందని కంపెనీ తెలిపింది.

టీసీఎస్ బోణీ.. బాగుంది!

- క్యూ1 లాభం రూ. 11,074 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 59,381 కోట్లు

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) తొలి త్రైమాసిక(క్యూ1) ఫలితాలతో సీజన్‌కు తెరతీసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం వార్షికంగా 17 శాతం ఎగసి రూ. 11,074 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 9,478 కోట్లు ఆర్జించింది. అయితే గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో సాధించిన రూ. 11,392 కోట్లతో పోలిస్తే లాభాలు స్వల్పంగా తగ్గాయి. ఇక మొత్తం ఆదాయం 13% పుంజుకుని రూ. 59,381 కోట్లకు చేరింది. గతేడాది క్యూ4లో రూ. 59,162 కోట్ల ఆదాయం నమోదైంది.

ఆర్డర్‌బుక్ జోష్

టీసీఎస్ ప్రస్తుత ఆర్డర్‌బుక్ విలువ బిజినెస్ పటిష్టతను చాటుతూ 10.2 బిలియన్ డాలర్లను తాకింది. నిర్వహణ లాభ మార్జిన్లు 23.1 శాతం నుంచి స్వల్పంగా మెరుగుపడి 23.2 శాతానికి చేరాయి. ఉద్యోగులకు వార్షిక వేతన పెంపు చేపట్టినప్పటికీ మార్జిన్లు మెరుగుపరచుకోగలిగినట్లు కంపెనీ సీఎఫ్‌వో సమీర్ సేక్సారియా పేర్కొన్నారు. అత్యుత్తమ పనితీరు చూపిన ఉద్యోగులకు 12–15 శాతం వేతన పెంపును చేపట్టినట్లు మానవ వనరుల చీఫ్ మిలింద్ లక్కడ్ వెల్లడించారు. కాగా.. కీలక మార్కెట్లలో సవాళ్ల కారణంగా సమీప భవిష్యత్‌లో దేశీ ఐటీ రంగం ఆటుపోట్లను చవిచూసే వీలున్నట్లు పరిశ్రమ నిపుణులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.



డిమాండ్ కొనసాగుతుంది

దీర్ఘకాలంలో కంపెనీ సర్వీసులకు డిమాండ్ కొనసాగనున్నట్లు విశ్వసిస్తున్నాం. కొత్త టెక్నాలజీల అవసరం ఇందుకు దోహదం చేయనుంది.
–కె.కృతివాసన్, కొత్త సీఈవో, ఎండీ

ఇతర హైలైట్స్

- క్యూ1లో నికరంగా 523 ఉద్యోగులను జత చేసుకుంది.
- జూన్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 6.15 లక్షలకు చేరింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 17.8 శాతంగా నమోదైంది.

విభాగాల వారీగా

క్యూ1లో లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ విభాగంలో ఐటీ సర్వీసుల ఆదాయం 10.1 శాతం పురోగమించగా.. కంపెనీకి ప్రధానమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) నుంచి 3 శాతమే వృద్ధి నమోదైనట్లు టీసీఎస్ పేర్కొంది. ప్రాంతాలవారీగా చూస్తే యూకే 16.1 శాతం వృద్ధిని అందుకోగా.. సాఫ్ట్‌వేర్ సేవలకు ప్రధానమైన ఉత్తర అమెరికా బిజినెస్ 4.6 శాతమే బలపడింది.

ఫలితాల వెల్లడి, మార్కెట్ల క్షీణత నేపథ్యంలో టీసీఎస్ షేరు బీఎస్ఈలో 0.4 శాతం నీరసించి రూ. 3,260 వద్ద ముగిసింది.

ఆఖర్లో అమ్మకాలు

- 19,400 దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ 224 పాయింట్ల నష్టం
- మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: ఆఖరి గంట అమ్మకాలతో ఆరంభ లాభాల్ని కోల్పోయిన స్టాక్ సూచీలు బుధవారం నష్టాలను చవిచూశాయి. దేశీయ ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాల వెల్లడి, ఐటీ దిగ్గజాలు టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ కంపెనీల క్యూ1 ఆర్థిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో మార్కెట్లో అప్రమత్తత చోటు చేసుకుంది. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో అధికంగా లాభాల స్వీకరణ జరిగింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 65,320 వద్ద కనిష్టాన్ని, 65,812 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 224 పాయింట్ల నష్టంతో 65,394 వద్ద స్థిరపడింది. నిఫ్టీ రోజంతా 19,362–19,508 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 55 పాయింట్ల పతనంతో 19,384 వద్ద నిలిచింది. దీంతో సూచీల మూడు రోజుల వరుస ర్యాలీకి బ్రేక్ పడినట్టైంది. డాలర్ మారకంలో రూపాయి విలువ 23 పైసలు బలపడి 82.18 స్థాయి వద్ద స్థిరపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- జీఎస్‌టీ మండలి క్యాసినోలపై 28% జీఎస్‌టీ విధింపుతో డెల్టా కార్ప్ షేరు లిస్టింగ్ తేదీ నాటి నుంచి ఒక రోజులో అతి పెద్ద పతనాన్ని చవిచూసింది. ఏకంగా 28% క్షీణించి రూ. 178 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 23% నష్టపోయి రూ.189 వద్ద ముగిసింది.
- రిలయన్స్ (రూ.2,802), ఎయిర్‌టెల్ (రూ.895), సన్ ఫార్మా (రూ.1,083), హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ (రూ.2,350), ఇండిగో (రూ.2,744), జైడస్ లైఫ్‌సైన్సెస్ (రూ.595), టాటా మోటార్స్ డీవీఆర్ (రూ.345), షేర్లు ఏడాది గరిష్టాన్ని నమోదు చేశాయి.

మ్యాక్సివిజన్‌లో క్వాడ్రియా పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంటి వైద్య సేవలు అందిస్తున్న మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్స్ తాజాగా రూ.1,300 కోట్ల నిధులను సమీకరిస్తోంది. ఆరోగ్య సేవల రంగంలో పెట్టుబడులు చేస్తున్న క్వాడ్రియా క్యాపిటల్ ఈ మొత్తాన్ని సమకూరుస్తోంది. మ్యాక్సివిజన్‌లో మైనారిటీ వాటా కోసం క్వాడ్రియా సుమారు రూ.600 కోట్ల ప్రారంభ పెట్టుబడి, అలాగే అదనపు వాటా కోసం మరో రూ.700 కోట్ల వరకు తదుపరి పెట్టుబడి చేయనుంది. మ్యాక్సివిజన్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోసహా ఆరు రాష్ట్రాల్లో 42 కేంద్రాలను నిర్వహిస్తోంది. మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్స్‌ను 1996లో డాక్టర్ కె.పి.రెడ్డి స్థాపించారు. 2010లో ఈ సంస్థను డాక్టర్ జీఎస్‌కే వేలు చేజిక్కించుకున్నారు.



ఎకానమీకి గణాంకాల ఊరట...

- నిర్దేశిత స్థాయిలోనే జూన్ వినియోగ ధరల స్పీడ్
- 4.81 శాతంగా నమోదు
- మేలో పరిశ్రమల మెరుగైన పనితీరు
- ఉత్పత్తిలో 5.2 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి బుధవారం వెలువడిన గణాంకాలు ఎకానమీకి కొంత ఊరటనిచ్చాయి. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెల్లో మూడు నెలల గరిష్ట స్థాయిలో 4.81 శాతంగా నమోదవగా, మే నెల పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 5.2 శాతం పురోగతి నెలకొంది. తయారీ, మైనింగ్ రంగాలు మంచి పనితీరును ప్రదర్శించాయి. రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెల్లో మూడు నెలల గరిష్ట స్థాయిని చూసినా, అది ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న స్థాయిలోనే ఉండడం ఊరట నిస్తున్న అంశం.

అన్ని విభాగాలూ పురోగతిలోనే...

- మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70 శాతం వాటా ఉన్న తయారీ రంగం 5.7 శాతం వృద్ధిని (గత ఆర్థిక సంవత్సరం ఇదే నెల విలువతో పోల్చి) నమోదుచేసుకుంది.
- విద్యుత్ ఉత్పత్తి 0.9% వృద్ధి నమోదయ్యింది.
- మైనింగ్‌లో 6.4 శాతం పురోగతి ఉంది.
- క్యాపిటల్ గూడ్స్ విభాగంలో 8.2 శాతం వృద్ధి.
- కన్జూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తిలో 1.1% వృద్ధి.
- మౌలిక, నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 14%.

ఏప్రిల్– మే నెలల్లో...

ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 4.8 శాతం వృద్ధి నమోదయ్యింది. గత ఏడాది ఇదే నెలల్లో ఈ రేటు 12.9 శాతంగా నమోదయ్యింది.

పెరిగిన ఆహార ధరలు



ఆహార ధరలు పెరగడంతో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 4.81 శాతంగా (2022 జూన్‌తో పోల్చి) నమోదయ్యింది. అంతక్రితం మూడు నెలల్లో ఈ స్థాయి పెరుగుదల ఇదే తొలిసారి. రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ 2 లేదా మైనస్ 2తో 4% వద్ద ఉండాలి. ఈ ప్రాతిపదిక రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న స్థాయిలోనే ఉందని భావించవచ్చు. కాగా ఒక్క ఆహార బాస్కెట్‌ను చూస్తే, ద్రవ్యోల్బణం 4.49%గా ఉంది. మేలో ఈ రేటు 2.95 శాతమే.

హెచ్‌సీఎల్ టెక్ లాభం ఓకే

- క్యూ1లో రూ. 3,534 కోట్లు
- షేరుకి రూ. 10 డివిడెండ్



ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికానికి(క్యూ1) ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1(ఏప్రిల్–జూన్)లో నికర లాభం వార్షికంగా 7 శాతం బలపడి రూ. 3,534 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,324 కోట్లు ఆర్జించింది. అయితే గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో సాధించిన రూ. 3,983 కోట్లతో పోలిస్తే లాభాలు 11 శాతం క్షీణించాయి. ఇక మొత్తం ఆదాయం 12 శాతం ఎగసి రూ. 26,296 కోట్లకు చేరింది. గతేడాది క్యూ1లో రూ. 23,464 కోట్ల ఆదాయం నమోదైంది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 10 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డివిడెండు చెల్లింపునకు ఈ నెల 20 రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది.

ఇతర విశేషాలు

- కొత్తగా 1,597 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి
- క్యూ1లో నికరంగా 2,506 మంది ఉద్యోగులు తగ్గారు.
- జూన్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 2,23,438కు చేరింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 16.3 శాతంగా నమోదైంది.

ఫలితాల వెల్లడి నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం క్షీణించి రూ. 1,107 వద్ద ముగిసింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీలో బీఎస్సీ, బీటెక్ ప్రవేశాలు

ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అండర్ గ్రాడ్యుయేట్ వ్యవసాయ బీఎస్సీ, అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **ఇంటర్‌లో బైపీసీ స్ట్రీమ్ కోర్సులు:** బీఎస్సీ(హానర్స్) వ్యవసాయం, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సులకు ఈఏపీసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులు. ఎన్నారై కోటాలో బీఎస్సీ(హానర్స్)వ్యవసాయం, కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. -ఎంపీసీ స్ట్రీమ్ కోర్సులు బీటెక్(వ్యవసాయ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)ల్లో రైతు కోటాలో ప్రవేశాలకు ఈఏపీసెట్–2023లో ర్యాంకులు సాధించిన వారు అర్హులు.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 1117
» **కోర్సులు–సీట్ల సంఖ్య:** బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్–1062, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ)–55.
» **అర్హత:** ఇంటర్మీడియట్(ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ లేదా నేచురల్ సైన్సెస్) ఉత్తీర్ణతతో పాటు ఏపీ ఈఏపీసెట్–2023 ర్యాంకు సాధించి ఉండాలి. » **వయసు:** 31.12.2023 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఏపీ ఈఏపీసెట్–2023 ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 27.07.2023.
» **వెబ్‌సైట్:** https://ugadmissionsangrau.aptonline.in

ఏపీ వైద్య కళాశాలల్లో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్(ఏపీఎస్ఏహెచ్‌పీసీ)..2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రైవేటు పారామెడికల్ కళాశాలల్లో వివిధ పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.


» **కోర్సులు:** డీఎంఎల్‌టీ, డీఎంఐటీ, డీఓఏ, డీడీఐఏఎల్‌వై, డీఆర్‌ఈఎస్‌టీ, డీఎంఎస్‌టీ, డీఈఆర్‌ఎఫ్‌యూ, డీఓటీ, డీఆర్‌టీటీ, డీఆర్‌జీఏ, డీడీఆర్‌ఏ, డీకార్డియో, డీసీఎల్‌టీ, డీఈసీజీ, డీఏఎన్‌ఎస్, డీఎంపీహెచ్‌ఏ.
» **అర్హత:** రెండేళ్ల కాలపరిమితి గల ఈ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్, బైపీసీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 16 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులకు సంబంధించి ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది.
» **కాలేజీలు–జిల్లాలు:** ఏపీలో మొత్తం తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, జిల్లాల్లోని పలు ప్రైవేటు పారామెడికల్ కళాశాలల్లో వివిధ పారామెడికల్ కోర్సులను అందిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న సీట్లకు ఆ కాలేజీ పరిధిలోని జిల్లాలకు చెందిన అభ్యర్థులు(లోకల్) దరఖాస్తు చేసుకోవాలి.
» **సీట్ల సంఖ్య:** తొమ్మిది గవర్నమెంట్ కాలేజీల్లో వివిధ పారామెడికల్ కోర్సుల్లో మొత్తం 1053 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా కాలేజీల పరిధిలోకి వచ్చే జిల్లాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే వివిధ జిల్లాల్లో ఉన్న ప్రైవేట్ పారామెడికల్ కాలేజీల్లో 17,254 పారా మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో మొత్తం 18,307 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
» **ఎంపిక విధానం:** బైపీసీ విద్యార్థులు అందుబాటులో లేకుంటే ఎంపీసీ విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు.ఈ రెండు గ్రూపు విద్యార్థుల లేకుంటే.. ఇతర గ్రూపు విద్యార్థులకు ప్రవేశం కల్పించే అవకాశం ఉంది. సీట్లను ప్రభుత్వ రిజర్వేషన్ల మేరకు ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వెబ్‌సైట్‌లో సూచించిన దరఖాస్తు నమూనాను పూర్తి చేసి సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ చిరునామకు పంపాలి. » ప్రైవేటు పారామెడికల్ కళాశాలల్లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత జిల్లా వైద్యారోగ్య అధికారికి కార్యాలయం చిరునామకు పంపాల్సి ఉంటుంది.
» **దరఖాస్తుతో జత చేయాల్సిన సర్టిఫికేట్‌లు:** పదో తరగతి సర్టిఫికేట్, ఆధార్ కార్డు, ఇంటర్ సర్టిఫికేట్–మార్క్స్ షీట్స్, ఆరు నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికేట్లు, క్యాస్ట్ సర్టిఫికేట్ తదితరాలు జత చేయాలి.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.07.2023.
» **కౌన్సెలింగ్ నిర్వహణ,అభ్యర్థుల కేటాయింపు:** 01.08.2023.
» **తరగతులు ప్రారంభం:** 01.09.2023.
» **వెబ్‌సైట్:** appmb.co.in/apsahpc.co.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రవేశాలు

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, మెరైన్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ .. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం సీట్ల సంఖ్య:** 114
» **అర్హత:** బీఈ, బీటెక్(మెకానికల్ ఇంజనీరింగ్/మెకానికల్ స్ట్రీమ్ ఆఫ్ ఇంజనీరింగ్/నేవల్ ఆర్కిటెక్చర్ స్ట్రీమ్ ఆఫ్ ఇంజనీరింగ్/మెరైన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, మెడికల్ ఫిట్‌నెస్,సైకలాజికల్ స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.07.2023.
» **వెబ్‌సైట్:** www.cslmeti.in

బీటెక్ తర్వాత పయనమెటు..!

బీటెక్.. నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సు! ఈ కోర్సు పూర్తి చేసుకుంటే.. విస్తృత కెరీర్ అవకాశాలు ఖాయమనే భావన! అందుకే ఏటా లక్షల మంది విద్యార్థులు బీటెక్‌లో చేరి బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తుంటారు. ఇంజనీరింగ్ తర్వాత కొంతమంది ఉన్నత విద్య లక్ష్యంగా చేసుకుంటే.. మరికొందరు ఉద్యోగావకాశాలపై దృష్టిపెడతారు. ఈ నేపథ్యంలో.. బీటెక్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..



» బీటెక్ అర్హతతో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు
» గేట్ స్కోర్‌తో ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం
» ఇంజనీరింగ్ తర్వాత పలు సర్కారీ కొలువులు
» ఐఐఎంల్లో మేనేజ్‌మెంట్ పీజీకి మార్గం క్యాట్
» విదేశాల్లో ఎంఎస్, ఎంబీఏ చదివే అవకాశం

ప్రస్తుత పరిస్థితుల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సును పూర్తి చేసుకున్న అభ్యర్థులకు విస్తృతమైన ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ తర్వాత క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా కార్పొరేట్ కొలువులు ఖాయం అవుతాయి. అంతేకాకుండా ప్రభుత్వ విభాగాల్లోనూ ఉద్యోగాలు సొంతం చేసుకునే వీలుంది. దీంతోపాటు బీటెక్ తర్వాత గేట్ ద్వారాప్రతిష్టాత్మక ఐఐటీల్లో ఎంటెక్, క్యాట్‌తో ఐఐఎంల్లో ఎంబీఏలో చేరొచ్చు.

గేట్‌తో.. ఎంటెక్ బాట

బీటెక్ ఉత్తీర్ణులు ఎక్కువ మంది ఎంటెక్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఎంటెక్‌లో అడుగుపెట్టాలంటే.. జాతీయ స్థాయిలో నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది. గేట్‌లో ర్యాంకు ఆధారంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, వివిధ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎంటెక్‌లో ప్రవేశం లభిస్తోంది. రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీలు సైతం గేట్ ఉత్తీర్ణులకు ఎంటెక్ సీట్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఇస్తున్నాయి.గేట్‌ను ప్రతి ఏటా ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్/అక్టోబర్‌ల్లో వెలువడుతుంది. గేట్ స్కోర్‌తో ఎంటెక్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది.

పీజీఈసెట్

రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంటెక్‌లో చేరేందుకు మార్గం.. పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈసెట్). ఇందులో స్కోర్ ఆధారంగా.. యూనివర్సిటీ అనుబంధ కళాశాలలతోపాటు, ప్రైవేట్ కళాశాలల్లో ఎంటెక్‌లో అడుగు పెట్టొచ్చు.

క్యాట్‌తో మేనేజ్‌మెంట్ పీజీ

బీటెక్ అభ్యర్థులు ఆసక్తి చూపుతున్న మరో కోర్సు.. మేనేజ్‌మెంట్ పీజీ లేదా ఎంబీఏ. దేశంలో మేనేజ్‌మెంట్ విద్యను అందించడంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లకు మంచి పేరుంది. వీటిల్లో చేరేందుకు మార్గం.. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్). ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ఐఐఎంలు ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తాయి. రాత పరీక్షలో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్ అండ్ వెర్బల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా సఫిషియన్సీ అంశాలపై ప్రశ్నలుంటాయి. ఐఐఎంలే కాకుండా..దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు కూడా క్యాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశానికి ఈ స్కోరే ప్రామాణికం. రాష్ట్ర స్థాయిలోని కళాశాలల్లో ఎంబీఏలో చేరాలంటే.. ఐసెట్(ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)లో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్

పరిశోధనలపై ఆసక్తి ఉన్న బీటెక్ ఉత్తీర్ణులు సీఎస్ఐఆర్–యూజీసీ నెట్‌కు హాజరుకావచ్చు. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధనల కోసం పీహెచ్‌డీకి అభ్యర్థులను ఎంపిక చేసే ఎంట్రన్స్ సీఎస్ఐఆర్ యూజీసీ–నెట్. దీనిద్వారా బీటెక్‌తోనే ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీకి ఎంపికైన వారికి మూడేళ్ల పాటు నెలకు రూ.31 వేలు చొప్పున జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్), ఆ తర్వాత పీహెచ్‌డీకి నమోదు చేసుకుంటే నెలకు రూ.35 వేలు చొప్పున ఎస్ఆర్ఎఫ్(సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) లభిస్తుంది. ఇలా గరిష్టంగా మొత్తం అయిదేళ్ల పాటు జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు లభిస్తాయి.

విదేశీ విద్యకు ఇలా

బీటెక్ పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎక్కువ మంది లక్ష్యం విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడమంటే అతిశయోక్తి కాదు. విదేశాల్లో చదవాలంటే.. జీఆర్ఈ, టోఫెల్ వంటి టెస్ట్‌ల్లో మంచి స్కోర్ సాధించాలి. సంబంధిత యూనివర్సిటీలో ప్రవేశం ఖరారయ్యాక వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. మేనేజ్‌మెంట్ కోర్సులు చదవాలనుకునే వారు..గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(జీమ్యాట్)లాంటి పరీక్షల్లో మంచి స్కోరు సాధించాలి. ప్రస్తుతం మన దేశ విద్యార్థులు ఎక్కువగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు ఉన్నత విద్య కోసం పయనమవుతున్నారు.

ఉద్యోగావకాశాలు అందుకునేలా

బీటెక్ ఉత్తీర్ణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సొంతం చేసుకునే అవకాశముంది. ఆ వివరాలు..

గేట్ స్కోర్‌తో.. పీఎస్‌యూ కొలువు

గేట్ స్కోర్ ఆధారంగా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ) ఇంజనీర్ ట్రైనీ, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ నియామకాలు చేపడుతున్నాయి. గేట్ స్కోర్‌తో ఆయా సంస్థలకు దరఖాస్తు చేసుకుంటే.. మలిదశలో గ్రూప్ డిస్కషన్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపిక చేస్తారు. పీఎస్‌యూ కొలువు ఖాయమైతే ప్రారంభంలోనే నెలకు రూ.50 వేలకు పైగా వేతనం లభిస్తోంది. గేట్‌లో కనీసం 700 స్కోర్ సాధిస్తే పీఎస్‌యూల్లో ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి.

ఈఐఎస్‌తో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో

బీటెక్ ఉత్తీర్ణులకు కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి మార్గం.. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ఈఎస్ఈ). ఈ పరీక్షలో ర్యాంకు ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని దాదాపు 40కు పైగా శాఖల్లో.. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో.. గ్రూప్–ఎ, గ్రూప్–బి హోదాలో గెజిటెడ్ ర్యాంకులో ఇంజనీర్లుగా నియామకాలు ఖరారు చేస్తారు. ఎంపిక ప్రక్రియలో మూడు దశలు(ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ) ఉంటాయి. ప్రిలిమ్స్‌ను 500 మార్కులకు, మెయిన్స్‌ను 600 మార్కులకు నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూకు 200 మార్కులు ఉంటాయి.

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగాలు

ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోనూ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు అందుబాటులో ఉంటాయి. ఇరిగేషన్ అండ్ క్యాడ్, వాటర్ వర్క్స్, రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్, హౌసింగ్ డెవలప్‌మెంట్ వంటి శాఖల్లో ఏఈ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నోటిఫికేషన్లు విడుదల చేస్తాయి. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఆయా పోస్టులకు నియామకాలను ఖరారు చేస్తారు.

ప్రైవేట్ రంగంలో

బీటెక్ తర్వాత ప్రైవేట్ రంగంలోనూ అవకాశాలు విస్తృతమవుతున్నాయి. ఉత్పత్తి రంగం నుంచి సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ వరకూ.. వివిధ రంగాల్లో ఉద్యోగాలకు ఆయా సంస్థలు ప్రకటనలు ఇస్తున్నాయి. సబ్జెక్టుపై పట్టుతోపాటు ఇంటర్న్‌షిప్, అప్రెంటిషిప్ వంటి మార్గాల ద్వారా ప్రాక్టికల్ నైపుణ్యాలు పెంచుకుంటే.. కోరుకున్న కంపెనీల్లో కొలువు దక్కించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇటీవల కాలంలో సంస్థలు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ప్రక్రియలకే పరిమితం కాకుండా. ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్, వాక్–ఇన్స్ నిర్వహిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నాయి.

సర్టిఫికేషన్స్‌తో అవకాశాలు

బీటెక్ విద్యార్థులు ప్రైవేట్ రంగంలో అవకాశాలను దక్కించుకునేందుకు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న అంశాల్లో సర్టిఫికేషన్స్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ, క్లౌడ్ కంప్యూటింగ్, 3–డి డిజైన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అంశాల్లో నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా జాబ్ మార్కెట్ అవకాశాలను చేజిక్కించుకోవచ్చు. ప్రస్తుతం ఈ కోర్సులను పలు సంస్థలు ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్నాయి.

క్లుప్తంగా...

వీపీటీ, హెచ్‌పీసీఎల్ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పోర్టు, హెచ్‌పీసీఎల్ అధికారులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీటీ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) మధ్య అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, హెచ్‌పీసీఎల్ సీజీఎం (రిటైల్) సింగుపల్లి హరిప్రసాద్ ఈ ఒప్పంద పత్రాలపైన పోర్టు కార్య నిర్వాహక కార్యాలయంలో బుధవారం సంతకాలు చేశారు. ఓఎస్‌టీటీలో 2 అదనపు బ్రెస్టింగ్ డాల్ఫిన్స్ నిర్మాణం కోసం ఒప్పందం జరిగింది. ఇందుకోసం రూ.13.36 కోట్లు ఖర్చు చేయనున్నారు. మధ్యస్థ నౌకలను హ్యాండిల్ చేసేందుకు అనువుగా ఈ బెర్తు సామర్థ్యాన్ని 8.3 ఎంఎంటీపీఏ నుంచి 15 ఎంఎంటీపీఏ వరకు పెంచనున్నారు. 18 నెలల్లో ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ముందు చక్రం లేకుండానే ల్యాండింగ్



బనశంకరి: సాంకేతిక లోపం తలెత్తడంతో బెంగళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయంలో ఓ చిన్న విమానం ముందు చక్రం లేకుండానే సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. మంగళవారం హెచ్ఏఎల్ విమానాశ్రయం నుంచి సమీపంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చిన్న విమానం బయల్దేరింది. ఇందులో ఇద్దరు పైలట్లు ఉన్నారు. కొంతదూరం ప్రయాణించాక ముందు చక్రంలో సమస్య తలెత్తినట్లు గుర్తించారు. దీంతో ఏటీసీకి సమాచారమిచ్చి విమానాన్ని వెనక్కి మళ్లించారు. ముందు చక్రం ఓపెన్ కాకుండానే ల్యాండ్ చేశారు. పైలట్లు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

పీఏసీఎస్‌ల బలోపేతంపై రేపు ఢిల్లీలో జాతీయ సమ్మేళనం

ఎన్సీడీసీ రీజనల్ డైరెక్టర్ వీకే దుబాసి

సాక్షి, అమరావతి : రైతు ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీవో) ద్వారా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) బలోపేతంపై న్యూ ఢిల్లీలో శుక్రవారం జాతీయ స్థాయి సమ్మేళనం జరగనుందని జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్సీడీసీ) రీజనల్ డైరెక్టర్ వీకే దుబాసి చెప్పారు. 'సహకార్ సే సమృద్ధి' పథకం కింద సహకార రంగంలో 1100 కొత్త ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ ఉత్పత్తిదారులు మెరుగైన ధరలు పొందడం, రవాణా ఖర్చులను తగ్గించుకోవడం, మొత్తం ఉత్పాదకతను పెంచుకోవడంలో ఎఫ్‌పీవోలు తోడ్పాటు అందిస్తాయన్నారు. క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్స్(సీబీబీవో) నిర్వహణ కోసం ఒక్కో ఎఫ్‌పీవోకి రూ.25 లక్షలు అందిస్తామని దుబాసి వెల్లడించారు.

బీఎస్సీ నర్సింగ్ అర్హుల జాబితా విడుదల

సాక్షి, అమరావతి: నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించి ఏపీ–ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల వివరాలను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ https://drysr.uhsap.in/లో ఉంచింది. జాబితాలో 43,623 మంది ఉన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్సీ) నిబంధనల ప్రకారం జనరల్ విద్యార్థులకు 50 పర్సెంటైల్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, వికలాంగ విభాగాల్లో 40 పర్సంటైల్, జనరల్ వికలాంగ విద్యార్థులకు 45 పర్సంటైల్‌తో అర్హత సాధించిన వారి వివరాలను వెల్లడించారు.

టీచర్ల కృషితోనే ఉత్తమ ఫలితాలు

- పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్



సాక్షి, అమరావతి: పాఠశాలల్లో ఉపాధ్యాయులు అంకితభావంతో ఇష్టపడి బోధిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. సీబీఎస్ఈ అనుబంధ ప్రభుత్వ స్కూళ్లలో విద్యా విధానంపై బుధవారం విజయవాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులన్నారు. అక్టోబర్ 2 నుంచి డిజిటల్ కంటెంట్‌కు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్నామని చెప్పారు. అలాగే ఆగస్టులో జరిగే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో 5, 9, 12 తరగతుల విద్యార్థులకు టోఫెల్ పరీక్ష నిర్వహించి, ఉత్తమ ఫలితాలకు కృషి చేసిన 52 మంది ఇంగ్లిష్ టీచర్లను అమెరికాలోని ప్రతిష్టాత్మక ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో శిక్షణకు పంపిస్తామన్నారు. ఉన్నతాధికారులు ఉషారాణి, ఎం.వి.కృష్ణారెడ్డి,బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

'సాగర్ కవచ్' కవాతు ప్రారంభం



సాగర్‌కవచ్ విన్యాసాలు

సాక్షి,విశాఖపట్నం: దేశంలో రెండో అతి పెద్ద తీరాన్ని కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్ వెంబడి ఉన్న సముద్ర జలాల పరిధిలో సమగ్ర తీర భద్రతపై 2 రోజుల పాటు నిర్వహించనున్న 'సాగర్ కవచ్' కవాతు బుధవారం ప్రారంభమైంది. సముద్ర సంబంధిత భద్రతా వ్యవస్థలతో సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విన్యాసాలను నిర్వహిస్తోంది. 2008 నవంబర్ 26న ముంబై ఉగ్రదాడి తర్వాత తీర భద్రతపై దృష్టిసారించిన భారత్.. ప్రతి ఏటా తీరం వెంబడి ఉన్న రాష్ట్రాల్లో సాగర్ కవచ్‌ని నిర్వహిస్తోంది. భారత నౌకాదళం, ఇండియన్ కోస్ట్‌గార్డ్, స్టేట్ మెరైన్ పోలీస్, కస్టమ్స్, మత్స్య శాఖ, పోర్టు అథారిటీలు, డీజీఎల్ఎల్‌తో పాటు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలు, ఏజెన్సీలు, మారీటైమ్ డొమైన్‌లో భాగస్వాములైన ఏజెన్సీలు ఈ సాగర్ కవచ్‌లో పాల్గొంటున్నాయి. సముద్ర జలాల్లో ఆయా కేంద్ర, రాష్ట్ర రక్షణ విభాగాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం, విభాగాల వారీగా బలబలాల్ని నిరూపించుకునేలా ఈ కార్యక్రమం జరుగుతుంది. వనరుల దోపిడీ జరగకుండా ఏవిధమైన భద్రతని పెంపొందించాలనే అంశాలపైనా ఆయా విభాగాలు చర్చించుకుంటాయి. ఏపీ తీరం వెంబడి పూర్తిస్థాయి భద్రత వలయాన్ని నిర్మించేందుకు మత్స్యకారుల నుంచి ఎలాంటి సహకారం అందుతుంది? వారిని ఎలా సుశిక్షితుల్ని చేయాలనేదానిపైనా విన్యాసాలు నిర్వహిస్తున్నారు. ఈ విన్యాసాల్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తుండగా.. విశాఖలోని కోస్ట్‌గార్డ్ తూర్పు ప్రధాన కార్యాలయం నుంచి సమన్వయ సహకారం జరుగుతోంది. సముద్ర జలాల్లో ఏ చిన్న శత్రు సంబంధిత సమాచారం దొరికినా..పోలీస్(100) లేదా కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌కు సంబంధించి 1093 లేదా ఇండియన్ కోస్ట్‌గార్డు హెల్ప్‌లైన్ నంబర్ 1554కి సమాచారం అందించాలని రక్షణ విభాగాలు విజ్ఞప్తి చేశాయి. గురువారం సాయంత్రంతో సాగర్ కవచ్ ముగియనుంది.

విశాఖలో ఈస్ట్రన్ ఎయిర్ కమాండ్ చీఫ్ పర్యటన



ధర్కర్‌కు జ్ఞాపిక అందిస్తున్న బిస్వజిత్ దాస్ గుప్తా

సాక్షి,విశాఖపట్నం: ఈస్టర్న్ ఎయిర్ కమాండ్ చీఫ్ ఎయిర్ మార్షల్ ఎస్పీ ధర్కర్ విశాఖలో బుధవారం పర్యటించారు. తూర్పు నౌకాదళానికి చేరుకున్న ఆయనకు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా స్వాగతం పలికారు. అనంతరం..ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర వ్యవహారాల్ని ధర్కర్ పరిశీలించారు. ఈఎన్సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌తో ధర్కర్ భేటీ అయ్యారు. తీర ప్రాంతంలో ఎదురవుతోన్న భద్రతా సవాళ్లు, అధిగమించేందుకు తూర్పు నౌకా దళం, వైమానిక దళాలు సంయుక్తంగా అమలు చేస్తోన్న వ్యూహాలు, ఎయిర్‌ఫోర్స్‌కు ఈస్టర్న్ ఎయిర్ కమాండ్ పరిధిలో ఉన్న ఆయుధ సంపత్తి, వైమానిక సంపత్తిపై చర్చించారు.

కదిలిన కృష్ణమ్మ

- పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలు
- కృష్ణా ప్రధాన పాయలో మొదలైన వరద
- ఈ సీజన్‌లో తొలిసారిగా ఆల్మట్టిలోకి 19,172 క్యూసెక్కులు
- స్థానికంగా కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర డ్యామ్‌లోకి 17,383 క్యూసెక్కులు



సాక్షి, అమరావతి: కృష్ణమ్మ కదిలింది. పశ్చిమ కనుమల్లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా ప్రధాన పాయలో వరద ప్రవాహం మొదలైంది. ఈ సీజన్‌లో తొలిసారి ఆల్మట్టి డ్యామ్‌లోకి బుధవారం 19,172 క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో ఆల్మట్టిలో నీటినిల్వ 20.55 టీఎంసీలకు చేరింది. ఆల్మట్టి డ్యామ్ నిండాలంటే ఇంకా 103 టీఎంసీలు అవసరం. ఆల్మట్టికి దిగువన వర్షాలు కురవకపోవడంతో నారాయణపూర్ డ్యామ్‌లోకి ఇప్పటికీ వరద ప్రవాహం ప్రారంభం కాలేదు. నారాయణపూర్ డ్యామ్ నిండాలంటే 23 టీఎంసీలు అవసరం. ఆల్మట్టి, నారాయణపూర్ నిండాలంటే 126 టీఎంసీలు అవసరం. ఆ రెండు డ్యామ్‌లు నిండితేనే జూరాల మీదుగా కృష్ణా ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు చేరేది. సింగటలూరు బ్యారేజ్ దిగువన కురిసిన వర్షాల ప్రభావంతో తుంగభద్రలో వరద ప్రవాహం మొదలైంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 17,383 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 6.89 టీఎంసీలకు చేరుకుంది. ఈ డ్యామ్ నిండాలంటే ఇంకా 99 టీఎంసీలు అవసరం.

ధరలు తగ్గే వరకు సబ్సిడీపై టమాటా

రైతుబజార్లలో సబ్సిడీపై రూ.50కే విక్రయం

- రాష్ట్రవ్యాప్తంగా 103 రైతు బజార్లలో ప్రత్యేక స్టాల్స్
- సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచన



విజయవాడలోని రైతు బజార్‌లో సబ్సిడీ టమాటాలు అందజేస్తున్న మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, అమరావతి/కృష్ణలంక(విజయవాడ తూర్పు): వినియోగదారులపై భారం పడకూడదనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో సబ్సిడీపై టమాటాల విక్రయాలు చేపట్టిందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గే వరకు సబ్సిడీపై టమాటాలను అందజేస్తామని తెలిపారు. ధరలు తగ్గినప్పుడు రైతులకు, విపరీతంగా పెరిగినప్పుడు వినియోగదారులకు వైఎస్ జగన్ ప్రభుత్వం బాసటగా నిలుస్తోందన్నారు. విజయవాడలోని కృష్ణలంక రైతు బజార్‌లో సబ్సిడీపై టమాటాల విక్రయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షాలతో టమాటా పంట దెబ్బతినడం వల్ల దేశ వ్యాప్తంగా ధరలు పెరిగాయని చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాల్లో కిలో ధర రూ.250కు చేరుకోగా.. రాష్ట్రంలోని బహిరంగ మార్కెట్‌లో రూ.98 నుంచి రూ.124 వరకు ఉందన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 103 రైతుబజార్లలో సబ్సిడీపై టమాటాలను కిలో రూ.50కే విక్రయిస్తున్నామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మదనపల్లి, పలమనేరు ప్రాంతాల నుంచి ఇప్పటివరకు 600 టన్నుల టమాటాలను రూ.6 కోట్లతో సేకరించామని చెప్పారు. రూ.3 కోట్లకు పైగా సబ్సిడీ భరించి ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. నాలుగేళ్లలో రూ.10.26 కోట్ల విలువైన 3,100 టన్నుల టమాటాలను సేకరించి రైతులకు, వినియోగదారులకు అండగా నిలిచామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా టమాటా రైతులను, వినియోగదారుల ప్రయోజనాలను పట్టించుకోలేదన్నారు. టీడీపీ పాలనలో టమాటా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయినా చంద్రబాబు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్‌పాండే, రైతు బజార్ల సీఈవో నందకిశోర్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ సీహెచ్ జాన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో 4.02 లక్షల టన్నుల శనగల సేకరణ

- శనగల కోసం రూ.1,868.97 కోట్లు వెచ్చించాం
- 2.04 లక్షల మంది శనగ రైతులకు లబ్ధి
- శనగ రైతులకు రూ.300 కోట్ల బోనస్
- 'ఈనాడు' కథనాన్ని ఖండించిన మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే



సాక్షి, అమరావతి: శనగ రైతులకు నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలిచిందని మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే స్పష్టం చేశారు. బుధవారం మీడియాకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 'శనగ పేరుతో దగా' అంటూ ఈనాడులో ప్రచురితమైన కథనంలో పేర్కొన్న అంశాల్లో వాస్తవం లేదన్నారు. శనగలకు ఏటా కేంద్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధరలు నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. క్వింటాల్ శనగలకు 2019–20లో రూ.4,875, 2020–21లో రూ.5,100, 2021–22లో రూ.5,230, 2022–23లో రూ.5,335 చొప్పున కేంద్రం నిర్ణయించిందన్నారు. మార్కెట్‌లో ధర లేనప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు శనగలు కొనుగోలు చేస్తున్నామన్నారు. 2019–20లో 1.40 లక్షల మంది రైతుల నుంచి 2.59 లక్షల టన్నులు, 2020–21లో 5,940 మంది రైతుల నుంచి 8,222.90 టన్నులు, 2021–22లో 30,376 మంది నుంచి 71,698.20 టన్నుల శనగలు సేకరించామని వివరించారు. గడచిన రబీ సీజన్‌కు సంబంధించి (2022–23) 1.22 లక్షల టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతినివ్వగా.. 28,112 మంది శనగ రైతుల నుం 63,132.40 టన్నులు సేకరించామని చెప్పారు. వీరికి రూ.337 కోట్లు చెల్లించామన్నారు. ఇలా మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద ధరల స్థిరీకరణ నిధులతో మద్దతు ధర తగ్గిన ప్రతీసారి మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు బాసటగా నిలుస్తున్నామన్నారు. గతంలో ఇంత పెద్దఎత్తున రైతులకు అండగా నిలిచిన సందర్భాలు లేవన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2014–2018 వరకు 60,296 మంది నుంచి రూ.506 కోట్ల విలువైన 1.07 లక్షల టన్నుల శనగలు సేకరిస్తే.. గడచిన నాలుగేళ్లలో 2.04 లక్షల మంది రైతుల నుంచి రూ.1,868.97 కోట్ల విలువైన 4.02 లక్షల టన్నుల శనగలను మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాగానే శనగ రైతులకు రూ.300 కోట్ల బోనస్ కూడా ఇచ్చిందన్నారు.

గిరిజన విద్యార్థి మృతికి కారకులను వదిలిపెట్టం..

డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర



బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం

బుట్టాయగూడెం: కొండరెడ్డి గిరిజన విద్యార్థి గోగుల అఖిల్‌వర్ధన్ రెడ్డి మృతికి కారకులైన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని, వారి అంతు తేలుస్తామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర హెచ్చరించారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెంలో గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మృతి చెందిన బాలుడి తల్లిదండ్రులను కలిసి ఓదార్చారు. విద్యార్థి మృతిపై తీవ్ర సంతాపాన్ని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చెక్‌ను మంత్రి రాజన్నదొరతో పాటు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.మురళి చేతుల మీదుగా మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం రాజన్నదొర మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి మృతి ఘటన చాలా బాధాకరమైందన్నారు. ఘటనపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా సీరియస్‌గా ఉన్నారని, సీఎం జగన్ ఆదేశాలతోనే కేబినెట్ సమావేశం ఉన్నా ఇక్కడికి వచ్చి బాలుడి మృతి ఘటనపై జిల్లా ఎస్పీతో మాట్లాడామని దోషులను కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. కాగా, హత్యకు గురైన అఖిల్ వర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కంటతడి పెట్టుకున్నారు. బాలుడి ఫొటో చూసి తల్లడిల్లిపోయారు.

రిజిస్ట్రేషన్‌లో ఈ-స్టాంపింగ్..!

భూముల క్రయ, విక్రయాల్లో పారదర్శకత • రిజిస్ట్రేషన్‌శాఖ కొత్త విధానానికి శ్రీకారం

- మ్యాన్యువల్‌గా స్టాంపుల విక్రయాలు బంద్
- అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి, రాజమహేంద్రవరం: రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాల్లో అవకతవకలకు చెక్ పెట్టే దిశగా రంగం సిద్ధమైంది. పాత తేదీలతో స్టాంపులు కొనుగోలు చేసి తద్వారా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడటం పారిపాటిగా మారేది. ఈ విధానాన్ని పూర్తిగా అరికట్టేందుకు రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త విధానానికి నాంది పలికింది. 'ఈ–స్టాంపింగ్'తో భూముల క్రయ విక్రయాల్లో పారదర్శకత తీసుకువచ్చే బృహత్తర విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ఇప్పటికే ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రాచుర్యం పొందుతోంది. ఏ రోజుకారోజు అనే నినాదంతో ఈ–స్టాంపుల విక్రయాలను చేపట్టింది. స్టాంపుల విక్రయాల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సైతం అందుబాటులోకి తీసుకువచ్చింది.

తూర్పులో 12 కార్యాలయాల్లో అమలు

జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం చేసేందుకు 52 గ్రామ సచివాలయాల్లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ–స్టాంపింగ్ ప్రక్రియ జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేస్తున్నారు. అన్ని కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా నాన్ జ్యుడీషియల్ 'ఈ–స్టాంపుల' విక్రయాలు చేపడుతున్నారు. మ్యాన్యువల్ స్టాంపుల విక్రయాలు పూర్తి స్థాయిలో నిలుపుదల చేశారు. వాటి సరఫరాను సైతం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నిలిపివేశారు. వినియోగదారులు ఈ–స్టాంపుల వినియోగంపై దృష్టి సారించాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఈ-స్టాంపింగ్ అమలయ్యే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

రాజమండ్రి, పిడింగొయ్య, కడియం, అనపర్తి, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, కొవ్వూరు, బిక్కవోలు, అనంతపల్లి, వేగేశ్వరపురం, నిడదవోలు.

భవిష్యత్తు ఈ-స్టాంపింగ్‌దే



రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శక సేవలకు ప్రభుత్వం ప్రాధాన్య ఇస్తోంది. ఫలితంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల స్థానంలో ఈ–స్టాంపింగ్ విధానం ప్రవేశ పెట్టింది. జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ–స్టాంపు విధానం అమల్లో ఉంది. రానున్న రోజుల్లో మ్యానువల్ స్టాంపుల విక్రయాలు పూర్తి స్థాయిలో బంద్ అయ్యే అవకాశం ఉంది. వినియోగదారులు కూడా ఈ–స్టాంపుల కొనుగోలుపై దృష్టి పెట్టాలి.

– ఆనందరావు, జిల్లా రిజిస్ట్రార్

వెండర్లకు లైసెన్సులు

ఇప్పటివరకు నాన్ జ్యుడీషియల్ స్టాంపుల ద్వారా భూముల క్రయ, విక్రయాలు జరిగేవి. వీటిలో డాక్యుమెంట్ రైటర్లు కీలక భూమిక పోషించేవారు. ప్రస్తుతం 'ఈ–స్టాంపుల విక్రయాల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న వెండర్ల(విక్రయదారుల)తో పాటు కొత్తవారికి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. వందల సంఖ్యలో ఈ–స్టాంపింగ్ వెండర్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పూరి స్థాయిలో విచారణ చేపట్టి వారికి లైసెన్సులను మంజూరు చేస్తారు. ఈ స్టాంపింగ్ కంప్యూటర్ పరిజ్ఞానంతో చేపట్టాల్సి ఉండటంతో పది, ఆపై విద్యార్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నిర్దేశించిన సమయంలోగా లైసెన్సులు జారీ చేయనున్నారు.

ఇప్పటికే డిజిటలీకరణ

స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖలో పాత డాక్యుమెంట్ల డిజిటలీకరణకు ప్రభుత్వం ఇప్పటికే శ్రీకారం చుట్టింది. 1850 నుంచి 1999 వరకు జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి డాక్యుమెంట్లు ఇకపై ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ప్రక్రియ యుద్ధప్రాతి పదికన జరుగుతోంది. ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలైతే రికార్డులు వెతికి మాన్యువల్‌గా రాసివ్వాల్సిన ప్రయాసలకు విముక్తి కలుగుతుంది. ప్రస్తుతం ఈ–స్టాంపింగ్ తీసుకురావడంతో రిజిస్ట్రేషన్ ఇకపై పూర్తి పారదర్శక సేవలు అందించనుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943